# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 103 | హైదరాబాద్ | బుధవారం 08-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

ఆన్‌లైన్‌లో నా డీప్ ఫేక్ వీడియోలు కూడా చూశాను: నిర్మలా సీతారామన్



## ఫార్మా హబ్‌గా హైదరాబాద్

- తెలంగాణకు తరలివచ్చిన మరో భారీ పెట్టుబడి
- రూ.9,000 కోట్లతో ముందుకొచ్చిన ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ
- హైదరాబాద్‌లో దేశంలోనే తొలి మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటు
- పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానంగా మారిందన్న సీఎం రేవంత్
- స్థానికంగా పెరగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు 11లో

## ఆర్ఆర్ బీ ఉద్యోగాల జాతర..

- 8 వేలకు పైగా ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ
- గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్లకు మంచి అవకాశం
- క్లర్క్, మేనేజర్, స్టేషన్ మాస్టర్, అకౌంట్స్ ఆఫీసర్ తదితర పోస్టుల భర్తీ

11లో




## నేటి భారతం

- ప్రజల డబ్బుతో పట్టణాలు నిర్మించాలంటే.. ముందుగా మనసు స్వచ్ఛంగా ఉండాలి..
- మున్సిపల్ కమిషనర్ గది పారదర్శకంగా ఉంటే పట్టణం కూడా శుభ్రంగా ఉంటుంది.
- అవినీతి చేసే అధికారి కూల్చేది భవనాలు కాదు, ప్రజల విశ్వాసం..
- పట్టణం చెత్తతో నిండిపోతే ప్రజలను తప్పు అంటారు..
- కానీ నిజానికి అవినీతి అధికారి చేతుల్లోనే చెత్త మొదలవుతుంది.
- ఒక అవినీతి కమిషనర్ నగరాన్ని కాదు, నైతికతను కూలదోయగలడు..
- నగర అభివృద్ధి ఫైల్స్‌లో కాదు, మనసులో ఉండే నిజాయితీలో మొదలవుతుంది.
- పట్టణం శుభ్రం కావాలంటే ముందు మున్సిపల్ కార్యాలయం శుభ్రం కావాలి.
- కమిషనర్ పదవి సేవకే కానీ, స్వార్థానికి కాదు అన్నది తెలుసుకోవాలి..
- ప్రజా సేవ అనే పథకాన్ని అవినీతి ప్రాజెక్టుగా
- మార్చే వాళ్లు ప్రజల శాపం నుంచి తప్పించుకోలేరు.
- ఒక నిజాయితీ కమిషనర్ నగరానికి కాంతి, ఒక అవినీతి కమిషనర్ చీకటితో సమానం..

– బోయినపల్లి రమణా రావు,
సీనియర్ జర్నలిస్ట్..



## భౌతికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- 2025 సంవత్సరానికి భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రకటన
- ముగ్గురు అమెరికా శాస్త్రవేత్తలను వరించిన ప్రతిష్ఠాత్మక పురస్కారం
- జాన్ క్లార్క్, మైఖేల్ డివోరెట్, జాన్ మార్టినిస్‌లకు సంయుక్తంగా అవార్డు 11లో

## డ్రైవింగ్‌లో ఫోన్ వాడుతున్నారా?

- డ్రైవింగ్‌లో ఫోన్ వాడే వారిపై కఠిన చర్యలు తప్పవన్న సీపీ సజ్జనార్
- వీడియోలు చూడటం, ఇయర్‌ఫోన్స్ వాడటం శిక్షార్హమన్న సీపీ
- ముఖ్యంగా ఆటో, క్యాబ్, బైక్ టాక్సీ డ్రైవర్లే లక్ష్యం
- డ్రైవర్ల పరధ్యానం ప్రాణాలకే ముప్పని స్పష్టీకరణ
- రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచన



11లో




11లో

## హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ నెమ్మదించడానికి కారణాలివే

- హైదరాబాద్ రియల్ ఎస్టేట్ స్తబ్దతపై రంగనాథ్ స్పష్టత
- మార్కెట్ నెమ్మదించడానికి హైడ్రా కారణం కాదన్న హైడ్రా కమిషనర్
- పెరిగిపోయిన అన్-సోల్డ్ ఇన్వెంటరీ, తగ్గిన ఎన్నారై పెట్టుబడులే అసలు కారణం
- వడ్డీ రేట్ల పెరుగుదల, ఏఐతో ఉద్యోగ భయాలు కూడా ప్రభావం చూపుతున్నాయని వెల్లడి

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. సాయంత్రం తెలంగాణ టీడీపీ నేతలతో చంద్రబాబు కీలక భేటీ



11లో



12లో

## అవినీతిని తమ ఇంటిపేరుగా మార్చుకుంటున్న అధికారులు

- భారీ అవినీతికి పాల్పడుతున్న మున్సిపల్ కమిషనర్లు
- ప్రభుత్వ భూముల్లో, వ్యవసాయ భూముల్లో అనుమతులు ఇస్తాం మాకు చట్టాలు వర్తించవు...
- టౌన్ ప్లానింగ్ అధికారులతో, టాక్స్ అధికారులతో, చేతులు కలిపి లక్షల కోట్లు కొల్లగొడుతున్న వైనం
- ఏసీబీకి చిక్కిన అవినీతి అధికారులే దీనికి సాక్ష్యం
- కేవలం సస్పెండ్ చేయకుండా, విధులనుంచి తొలగించాలి..
- శాఖాపరమైన కఠిన శిక్షలు అమలు చేయాలి
- సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి...
- డిమాండ్ చేస్తున్న " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "

## సంపాదకీయం

# బీహార్ లో కులమే ప్రధానం...

బిహార్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. మొత్తం 2 దశల్లో బిహార్ ఎన్నికలను నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. మొదటి విడత ఎన్నికలు వచ్చే నెల 6వ తేదీన.. రెండో విడత అదే నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపింది. నవంబర్ 14వ తేదీన కౌంటింగ్ ఏర్పాటు చేసి అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు. తొలి విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈనెల 10వ తేదీన ప్రారంభం కానుండగా.. రెండో విడత ఈనెల 13వ తేదీన మొదలు కానుంది. ఇక దేశవ్యాప్తంగా ఉన్న ఉపఎన్నికల తేదీలను కూడా ఈసీ వెల్లడించింది.బీహార్ ఓటర్ల జాబితా వివాదం మధ్య, కొన్ని రోజుల్లోనే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ ఎన్నికల వ్యూహాలను మెరుగుపరుచుకుంటున్నాయి. కానీ యథాప్రకారం అభ్యర్థుల ఎంపికలో కులం కార్డే కేంద్ర బిందువు అవుతుంది. ఏదైనా ఎన్నికల్లో రెండు విధాలుగా ఓటర్లను ప్రలోభపరచవలసి ఉంటుంది. ఐదేళ్ల క్రితం లాలూప్రసాద్ అప్పటి ఎన్నికలను అగ్డా (అగ్ర వర్గాలు), పిచ్చడా (వెనుకబడిన వర్గాలు) మధ్య పోరాటంగా అభివర్ణించారు. బిజెపిని సంప్రదాయ అగ్రకులాల, ఉన్నత వర్గాల పార్టీగా ప్రకటించారు. 2024లో 'ఇండియా కూటమి' కూడా రెండు విధాలుగా ప్రచారాన్ని ముందుకు సాగించాలని ఆకాంక్షించింది. వెనుకబడిన వర్గాలపైనే దృష్టిపెట్టి మరింత సంరక్షణ వారికి అవసరమని ప్రచారం సాగించింది

బీహార్‌లో వెనుకబడిన వర్గాల సమీకరణకు సుదీర్ఘ చరిత్ర ఉంది. వలస కాలంనుంచే ఈ తరహా ఉద్యమాలు మొదలయ్యాయి. ఇవి రాజకీయంగా వెనుకబడిన వర్గాలకు అధికారాన్ని కట్టబెట్టాయి. ఈ వెనుకబడిన వర్గాల సమీకరణే ఎన్నికల పోటీకి సాధనంగా ఉపయోగపడుతుంది. ఉన్నతవర్గాలు, తక్కువస్థాయి వర్గాలు అన్న తేడాయే విచక్షణకు దారితీస్తుంది. ఏదెలాగున్నా పొత్తులు, ప్రతిపొత్తుల ఆట, మొత్తంమీద పార్టీ వ్యవస్థలో రాజకీయ చీలికలు ఈ రెండు కోణాల దృష్టిని నిత్యం క్లిష్టం చేస్తున్నాయి. చారిత్రకంగా చూస్తే బిజెపి అభ్యర్థుల ఎంపిక ఉన్నత కులాల అనుకూలంగానే ఉంటుంది. 2020 లో బిజెపి 74 మంది ఎంఎల్ఎల్లో 33 మంది (40%) ఉన్నత కులాల వారే. అలాగే ఎక్కడా బిజెపి ముస్లిం అభ్యర్థులను ఎంపిక చేయదు. అంటే దీని అర్థం మిగతా అభ్యర్థులు ఒబిసి(26), ఇబిసి(2) నుంచి ఎంపిక చేసిన వారే. దీనికి విరుద్ధంగా జెడియు 43 మంది ఎంఎల్ఎల్లో 22 మంది ఒబిసి, ఇబిసిలకు చెందినప్పటికీ కేవలం 10 మంది మాత్రమే ఉన్నత కులాల వారు ఉన్నారు.

చాలామంది జెడియు ఎంఎల్ఎల్లో ఏడుగురు కుర్మీలు, నలుగురు యాదవులతో కలుపుకుని స్థానిక ప్రాధాన్యం కలిగిన ఒబిసి గ్రూపులకు చెందినవారే. మరోవైపు ఆర్‌జెడి నిర్మొహమాటంగా పూర్తిగా యాదవులకే అనుకూలంగా ఉంటుంది. 2020లో . 44 సీట్లలో 26ను గెలుచుకుంది. బిజెపి, జెడియుకు భిన్నంగా ఆర్‌జెడి ముస్లిం అభ్యర్థులను నియమించింది. కాంగ్రెస్ కూడా అలాగే చేసింది. వాస్తవానికి ప్రధాన పార్టీలన్నిటిలో కాంగ్రెస్ లోనే ముస్లిం ఎంఎల్ఎల జనాభా ఎక్కువ. బిజెపి, జెడియు లేదా ఆర్‌జెడి ఏదైనా ఎన్నికైన ఒబిసి ఎంఎల్ఎల్లో మెజార్టీ స్థానిక ప్రాధాన్యం కలిగిన సామాజిక వర్గాలవారే ఎంపికయ్యారు. ఇబిసిలు ప్రచార వాక్చాతుర్యానికి కేంద్రబిందువే అయినప్పటికీ, చాలావరకు మినహాయింపబడ్డారు. బీహార్ జనాభాలో ఇబిసిలు దాదాపు 36 శాతం నుంచి 40 శాతం ఉన్నప్పటికీ, 2020 అసెంబ్లీలో వారి ప్రాతినిధ్యం కేవలం 11 శాతానికి పరిమితమైంది. చాలా పార్టీలు తమ టికెట్ల పంపిణీలో వైవిధ్యం చూపించినప్పటికీ ఫలితాలలో పెద్ద చీలిక కనిపించింది. తీవ్రమైన కుల విభజనే కీలకమవుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 22 శాతం ఓట్లతో ఆర్‌జెడి అతిపెద్ద పార్టీగా తెరపైకి వచ్చింది. 2014 నుంచి హిందీ బెల్టులో బిజెపి ఆధిపత్యం వహిస్తున్నా ఓట్లలో అయిదోవంతు మాత్రమే పొందగలిగింది. అభ్యర్థుల ఎంపికలో వైవిధ్యం చూపించాలని బిజెపి కాంక్షిస్తున్నా, అధికారంలో ఉండడానికి మిత్రవర్గాల పొత్తుపైనే ఆధారపడవలసి వస్తోంది. ముఖ్యంగా దాని ప్రధాన మిత్రపక్షం జెడియు తన జాతి మతపరమైన జాతీయవాద భాగాన్ని పంచకుండా ఇప్పటికీ సెక్యులర్‌శక్తిగా తన అస్తిత్వాన్ని ప్రదర్శిస్తోంది. కులాల చీలిక, వెనుకబడిన వర్గాల సుదీర్ఘ చారిత్రక ప్రభావం బిజెపి హిందుత్వవాదాన్ని అడ్డుకుంటున్నాయి. సామాజిక, ఎన్నికల పొత్తుల నిర్మాణానికే మొగ్గుచూపుతున్నాయి. యోగి ఆదిత్యనాథ్ వంటి చరిష్మా కలిగిన హిందుత్వరాజకీయ నేత లేకపోవడం కూడా బిజెపికి మైనస్ పాయింటే. మతపరమైన కేంద్రీకరణ బీహార్‌లో చాలా తక్కువ ప్రభావం చూపుతుంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల ముఖ చిత్రాన్ని పరిశీలిస్తే బీహార్ రాజకీయ వ్యాకరణ మౌలిక స్వరూపం మారే అవకాశం లేదు. 2023లో నితీశ్‌కుమార్ నిర్వహించిన కులాల గణన బట్టి బీహార్ రాజకీయాల్లో కులమే ప్రధాన బలమైన పునాదిగా వెల్లడవుతోంది. ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఓటర్ల జాబితాపై సమగ్ర సర్వే ఒకటి కాగా, మరొకటి ప్రశాంత్ కిశోర్ 'జనసూరజ్' ప్రచారం. పంజాబ్‌లో స్థానిక ఉన్నత వర్గాలను తిరస్కరించి ఓటర్లు బయటనుంచి వచ్చిన ఆమ్‌ఆద్మీపార్టీకి ఎలాగైతే పట్టం కట్టారో అలాగే బీహార్‌లో కూడా జరుగుతుందని ప్రశాంత్ కిశోర్ భవిష్యత్ రాజకీయ అంచనాలు వేస్తున్నారు. కానీ బీహార్ పంజాబ్‌లా కాదు. ఇక్కడ కులం అన్నది చాలా లోతుగా వేళ్లూనుకుంది. కిశోర్ స్వంత వ్యూహం కూడా కులం గణాంకాలను ప్రతిబింబిస్తోంది. ఆయన ప్రచారం కూడా సంప్రదాయ కుల స్వరంపైనే ఆధారపడుతోంది. ఏ పార్టీకి ఫలితాలు ఎలా వస్తాయో చెప్పలేకపోయినా ఇప్పుడు అనిశ్చితి మాత్రం వెంటాడుతోంది.

# నేను దేవుడ్ని... అమ్మను దేవుడి దగ్గరకు పంపించా...

కడప, అక్టోబరు 7, (

వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తల్లిని చంపిన యశ్వంత్ రెడ్డి మానసిక పరిస్థితిపై అనుమానాలు తలెత్తుతున్నాయి. యశ్వంత్ రెడ్డి మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. పోలీసుల విచారణలో కూడా తాను దేవుడిని అని.. ఆ విషయం అమ్మ నమ్మకపోవటంతోనే తల్లిని దేవుడి వద్దకు పంపించానంటూ యశ్వంత్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. అల్లారుముద్దుగా పెంచిన కొడుకే తన పాలిట కాలయముడు అవుతాడని ఊహించలేకపోయిన ఆ కన్నతల్లి ఉదంతం ఇప్పుడు సంచలనంగా మారింది.వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో తల్లిని చంపిన తనయుడి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. యశ్వంత్ కుమార్ రెడ్డి మానసిక స్థితి సరిగా లేదని వార్తలు వస్తున్నాయి. అయితే తాను దేవుణ్ని అంటే నమ్మలేదనే తల్లిని చంపినట్లు యశ్వంత్ కుమార్ రెడ్డి పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే..ప్రొద్దుటూరులోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన విజయభాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల ఏకైక సంతానం యశ్వంత్ కుమార్ రెడ్డి. లక్ష్మీదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఒక్కడే కొడుకు కావటంలో యశ్వంత్ కుమార్ రెడ్డిని గారాబంగా పెంచారు ఆ దంపతులు. కొడుకును బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనే ఉద్దేశంతో చెన్నైలో ఇంజినీరింగ్ చదివించారు.

ఇంజనీరింగ్ పూర్తి కాగానే యశ్వంత్ కుమార్ రెడ్డి.. ఉద్యోగాన్వేషణలో భాగంగా హైదరాబాద్‌కు పంపించారు. ప్రతి నెలా ఖర్చుల కోసం డబ్బులు పంపించేవారు. ఈ క్రమంలోనే ఈ మధ్యనే ఒకసారి మూడు వేలు పంపించగా.. కొన్ని రోజులకే మరో పదివేలు కావాలని యశ్వంత్ రెడ్డి అడగటంతో తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో తల్లి మీద కోపం పెంచుకున్న యశ్వంత్ రెడ్డి.. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరు చేరుకుని తల్లితో గొడవ పడ్డాడు. తండ్రిని గదిలో బంధించి తల్లి గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. కూరగాయలు కోసే కత్తితో కన్నతల్లి గొంతుకోసిన యశ్వంత్ రెడ్డి.. ఆ తర్వాత లక్ష్మీదేవి వరండాలోకి ఈడ్చుకుని వచ్చి పడేశాడు. ఆ తర్వాత తలుపులు బిగించుకుని టీవీలో పాటలు వింటూ కూర్చున్నాడు.మరోవైపు ఉద్యోగ ప్రయత్నాల కోసం హైదరాబాద్ చేరిన యశ్వంత్ రెడ్డి.. ఇన్నేళ్లు హైదరాబాద్‌లో ఒక్కడే రూమ్‌లో ఉంటున్నట్లు బంధువులు చెప్తున్నారు. ప్రతినెలా యశ్వంత్ ఖర్చుల కోసం ఇంటి నుంచి డబ్బులు పంపేవారని చెప్తున్నారు.

అయితే యశ్వంత్ మానసిక స్థితిలో మార్పును గమనించిన అతని తల్లిదండ్రులు.. ఇంటికి వచ్చేయాలని కోరినా అతను వినిపించుకోలేదంటున్నారు. కేవలం డబ్బుల కోసం మాత్రమే యశ్వంత్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసేవాడని తెలిసిందిమరోవైపు హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం ప్రొద్దుటూరులోని ఇంటికి చేరుకున్న యశ్వంత్ రెడ్డి.. వచ్చిన వెంటనే తల్లితో గొడవ పడినట్లు తెలిసింది. తాను దేవుణ్ని అని.. అడిగినప్పుడు డబ్బులు ఇవ్వాలంటూ లక్ష్మీదేవితో గొడవపడినట్లు సమాచారం

. పోలీసుల విచారణలోనూ యశ్వంత్ రెడ్డి ఇదే విషయాన్ని చెప్పినట్లు తెలుస్తోంది. తాను దేవుడిని అంటే తల్లి నమ్మడం లేదని.. అందుకే దేవుడి వద్దకు పంపించానని యశ్వంత్ చెప్పినట్లు సమాచారంఈ క్రమంలోనే యశ్వంత్ రెడ్డి మానసిక స్థితిగతులపై పోలీసులు దృష్టి సారించినట్లు సమాచారం. హైదరాబాద్‌లో అతను ఉన్న పరిస్థితులు.. గతంలో మానసిక సమస్యలతో ఎప్పుడైనా ఇబ్బందులు పడ్డారా అనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మొత్తంగా ఒక్కగానొక్క కొడుకు అంటూ గారాబంగా పెంచిన కన్నతల్లినే.. ఓ కొడుకు అమానుషంగా గొంతుకోసి హత్య చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది.

================

# ఏపీలో 'స్క్రబ్‌టైఫస్' కే కలకలం

నెల్లూరు, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)

ఆంధ్రప్రదేశ్‌లో 'స్క్రబ్ టైఫస్' కేసులు కలకలం రేపుతున్నాయి. నల్లిని పోలిన చిన్న కీటకం కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. ముఖ్యంగా చిన్న పిల్లలపై దీని ప్రభావం అధికం. జ్వరం, కండరాల నొప్పి, తలనొప్పి వంటి లక్షణాలుంటాయి. చికిత్స ఆలస్యమైతే మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌కు దారితీసి ప్రాణాంతకం కావచ్చు. నెల్లూరు జిల్లాలో నాలుగు కేసులు నమోదయ్యాయి. పరిసరాల శుభ్రత, ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. లక్షణాలు కనిపిస్తే రక్త పరీక్ష చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.ఏపీలో 'స్క్రబ్ టైఫస్' కేసులు నమోదయ్యాయి.. నల్లిని పోలిన ఒక చిన్న కీటకం కుడితే ఈ స్క్రబ్‌టైఫస్ బారినపడతారు. ఇది ఇళ్లలో పెద్దవాళ్లు, పిల్లలను కుడుతుంది.. కాకపోతే ముఖ్యంగా చిన్న పిల్లలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంది. ఇప్పటికే డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు స్క్రబ్ టైఫస్ టెన్షన్ మొదలైంది. కొండ ప్రాంతాల్లో కనిపించే ఈ కీటకాలు ఇప్పుడు అన్ని చోట్లకూ వ్యాపించాయంటున్నారుఒక కీటకం కుడితే నల్ల మచ్చ వస్తుంది. ఏడు రోజుల పాటు జ్వరం ఉంటుంది. డెంగీ లాగే కండరాల నొప్పి, తలనొప్పి, జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. చికిత్స ఆలస్యం అయితే మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్‌కు దారి తీసి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. లక్షణాలను బట్టి యాంటీ బయోటిక్స్‌తో నయం చేయవచ్చు. కొన్నిసార్లు ఐసీయూ చికిత్స కూడా అవసరం అవుతుందని చెబుతున్నారు వైద్యులు.తాజాగా నెల్లూరు జిల్లాలో స్క్రబ్‌టైఫస్ కేసులు నమోదయ్యాయి. కావలి, వెంకటేశ్వరపురం, మనుబోలు, ఎన్టీఆర్‌నగర్‌లో ఈ ఏడాది 4 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. ముందస్తు జాగ్రత్తగా స్క్రబ్ టైఫస్ బాధిత కుటుంబ సభ్యులతో పాటుగా ఆ చుట్టుపక్కల వారికి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయా? అని టెస్ట్‌లు చేస్తున్నారు. ఒకవేళ ఎవరికైనా స్క్రబ్ టైఫస్ లక్షణాలను గుర్తిస్తే వెంటనే వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి జీజీహెచ్‌కు పంపుతున్నారు. ఈ టైఫస్ జ్వరం నిర్ధారణ కోసం వీల్‌ఫెలిక్స్ పరీక్ష చేయాలని సూచిస్తున్నారు డాక్టర్లు.ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. ముఖ్యంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఒకవేళ ఇంట్లో పాత దిండ్లు, పరుపులు, మంచాలు, పరుపులు వంటివి తీసివేయడం మంచిదంటున్నారు. ఈ కీటకాలు రాత్రి వేళల్లో ఎక్కువగా దాడి చేసే అవకాశం ఉందంటున్నారు. అందుకే పిల్లల కాళ్లు చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేయాలని సూచిస్తున్నారు. చెట్లు ఎక్కువగా ఉన్న చోట్ల, వ్యవసాయ భూముల పక్కన నివసించే వారిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ పురుగులు ఎక్కువగా పొట్ట, బుగ్గలు, ఛాతి, పాదాలప కుడుతాయి అంటున్నారు.స్క్రబ్ టైఫస్ విషయంలో భయం అవసరం లేదని.. ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామంటున్నారు డాక్టర్లు. ఒకవేళ ఎవరికైనా జ్వరం వచ్చి తగ్గకపోతే డెంగీ, టైఫాయిడ్, మలేరియాగా భావించి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరుతున్నారు డాక్టర్లు. ఒకవేళ మచ్చలు కనిపిస్తే వెంటనే స్క్రబ్ టైఫస్ నిర్ధారించేందుకు రక్త పరీక్ష చేయించుకోవాలని సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదని.. ప్రజలకు ఆందోళన అవసరం లేదని.. కానీ ముందస్తు జాగ్రత్తలు కూడా అవసరం అంటున్నారు.

# ఉత్తరాంధ్రపై జగన్ గురి

విశాఖపట్టణం, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)

ఉత్తరాంధ్ర పై జగన్మోహన్ రెడ్డి ఫోకస్ పెట్టారా? పార్టీని బలోపేతంపై దృష్టి పెట్టారా? వచ్చే ఎన్నికలను టార్గెట్ చేసుకున్నారా? అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేందుకు ఇప్పుడే వ్యూహం రూపొందిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. 2029 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో ఎక్కువ సీట్లు తెచ్చుకుంటేనే వైసీపీకి ఛాన్స్ ఉంటుంది. లేకుంటే మాత్రం ఇబ్బందికరమే. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడు ఎన్నికలను ఎదుర్కొంది. అందులో రెండింట దారుణ పరాజయం



చవిచూసింది. 2019లో జగన్ ప్రభంజనంలో సైతం.. ఉత్తరాంధ్రలో ఆరు సీట్లను గెలుచుకుంది తెలుగుదేశం పార్టీ. కానీ 2024 ఎన్నికలకు వచ్చేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది ఉత్తరాంధ్రలో. అందుకే మరోసారి ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే కచ్చితంగా ఉత్తరాంధ్రలో మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాయలసీమ అండదండగా నిలుస్తూ వస్తోంది. అక్కడ 70కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2014లో వైసీపీకి అక్కడ మెజారిటీ వచ్చింది. 2019లో స్వీప్ చేసింది. 2024లో మాత్రం ఓ ఏడు స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. అందుకే వచ్చే ఎన్నికల్లో రాయలసీమలో మెజారిటీ సీట్లు దక్కించుకొని.. ఉత్తరాంధ్రలో మెరుగైన స్థానాలు పొందితే.. మ్యాజిక్ ఫిగర్ దాటవచ్చు అన్నది జగన్మోహన్ రెడ్డి అంచనా. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఉత్తరాంధ్రలో వచ్చే స్థానాలను అనుసరించి మాత్రమే వైసిపి అధికారంలోకి వచ్చే పరిస్థితి ఉంటుంది. అందుకే మూడున్నర ఏళ్ల ముందే ఉత్తరాంధ్రలో పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు జగన్మోహన్ రెడ్డి. అందుకే సీనియర్లను యాక్టివ్ చేస్తున్నారు.ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అందులో ఓ 20 స్థానాలపై గురిపెట్టినట్లు సమాచారం. ఉత్తరాంధ్రలో సీనియర్లుగా బొత్స సత్యనారాయణ,ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణ దాసు వంటి సీనియర్లు ఉన్నారు. వారితోనే ఈసారి రాజకీయం చేసి ఉత్తరాంధ్రను దక్కించుకోవాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అందులో భాగంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటు పరాన్ని నిరసిస్తూ నర్సీపట్నంలో ఆందోళన చేయనున్నారు. మొత్తం ఉత్తరాంధ్రను ఆకట్టుకునేలా భారీ ప్లాన్ రూపొందించారు. విశాఖలో భారీగా పరిశ్రమల ఏర్పాటు జరుగుతోంది. పెట్టుబడులు కూడా వస్తున్నాయి. అది కచ్చితంగా కూటమికి ప్లస్ అవుతుంది. అందుకే ఈ పరిశ్రమల ఏర్పాటుకు జరుగుతున్న భూ సమీకరణ, ప్రభుత్వ భూముల కేటాయింపులో జరుగుతున్న లోపాలపై పోరాటం చేయాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. తద్వారా కూటమి దూకుడుకు కళ్లెం వేయడంతో పాటు పార్టీని కొంతవరకు నిలబెట్టవచ్చని భావిస్తున్నారు. ఆయన ప్రయత్నాలు మరి ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# సంక్షేమ పథకాలు కలిసొస్తాయా

విజయవాడ అక్టోబరు 7, (న్యూస్ పల్స్)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తిరిగి ఎన్నికలు ఎప్పుడు జరిగినా గట్టెక్కిస్తాయని భావిస్తున్నట్లుంది. అందుకే ఆయన పదే పదే సంక్షేమం పదాన్ని వల్లె వేస్తున్నారు. అభివృద్ధి అన్న మాట కంటే ఎక్కువగా సంక్షేమం అనే పదమే ఎక్కువ సార్లు ఆయన నోట వినిపిస్తుంది. గత పదిహేను నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసింది. పింఛన్లను నాలుగు వేల రూపాయలకు పెంచడంతో పాటు, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఉచిత బస్సు, ఆటో డ్రైవర్లకు పదిహేను వేల రూపాయలు వంటి పథకాలను అమలు చేశారు. వీటితో పాటు తల్లికి వందనంతో పాటు అన్నదాతకు అండగా నిలుస్తూ అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేశారు. సంక్షేమం విషయంలో చంద్రబాబు ను ఎవరూ తప్పుపట్టలేరు. గత మూడు దఫాలుగా... నిజానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు సంక్షేమం అమలు చేసిన దానికంటే ఎక్కువగా ఈ టర్మ్ లో అమలు చేసి చూపుతున్నారు. గతంలో మూడు దఫాలు ఆయన విజన్ తో పనిచేసేవారు. సంక్షేమం అనేది ఆయనకు లీస్ట్ ప్రయారిటీగా ఉండేది. రాష్ట్ర భవిష్యత్ అంటూ సుదూర దృష్టితో ఆలోచించి నిర్ణయాలు తీసుకునే వారు. కానీ ఈసారి మాత్రం చంద్రబాబు నాయుడు అందుకు భిన్నంగా కనిపిస్తున్నారు. కార్యకర్తల సంక్షేమాన్ని కూడా పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇప్పుడంతా సంక్షేమ మంత్రమే ఆయన నోటి నుంచి వినిపిస్తుండటం ఒకింత పార్టీ నేతలకు ఆశ్చర్యం కలిగిస్తుంది. చంద్రబాబు నాయుడు తన పై ఉన్న అపవాదును చెరిపేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎందుకంటే చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయరు అన్న వారి నోళ్లను మూయించడానికే సంక్షేమాన్ని భారమైనా భుజానకెత్తుకున్నారంటున్నారు.అయితే సంక్షేమాన్ని అమలు చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే రెండోసారి విజయం సాధించారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోనూ అనేక సంక్షేమ పథకాలను ఇబ్బడి ముబ్బడిగా అమలు చేసిన కేసీఆర్ ను కూడా ప్రజలు ఓడించారు. ఇక గత ప్రభుత్వ హయాంలో దాదాపు 2.75 లక్షల కోట్ల రూపాయలను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశానని జబ్బలు చరుచుకున్న జగన్ ను కూడా పక్కన పెట్టేశారు. అంటే సంక్షేమం ఎప్పటికప్పుడు టర్న్ అవుతుందా? అన్నది మాత్రం ఇక్కడ అర్థం కావడం లేదు. ఎవరు అధికారంలోకి వచ్చినప్పటికీ గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కంటే ఒకింత ఎక్కువే ఇవ్వాల్సి ఉంటుంది. కోతలు పెట్టడానికి వీలుండదని భావించి ప్రజలు మార్పును కోరుకుంటే సంక్షేమ మంత్ర పనిచేయదని చెప్పాలి. అందుకే చంద్రబాబు పదే పదే సంక్షేమం నినాదాన్ని అందుకున్నప్పటికీ ఫలితాలు మాత్రం చివర వరకూ చెప్పలేమన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. రానురాను రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దిగజారిపోవడమే తప్పించి పెరగడం జరగదని తెలిసినా పాలకులు మాత్రం సంక్షేమం వైపునకు పరుగులు తీయడం కొన్నివర్గాల నుంచి పెదవి విరుపులు వినిపిస్తున్నాయి.

# మూడు పార్టీలనూ "లోకల్" ముంచేస్తుందా?

విజయవాడ, అక్టోబరు 7,ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు పెద్దగా సమయం లేదు. మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు విడతల వారీగా ఎన్నికలు జరగడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిద్ధమయింది. 2026 జనవరి లేదా మార్చి నెలల్లోనే ఈ ఎన్నికలు ఉండే అవకాశముంది.

సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి అడ్వాంటేజీ ఉంటుంది. అంగబలం, అర్థబలం సమృద్ధిగా ఉండటంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ ప్రాంతంలో కూడా గెలిస్తే మేలు జరుగుతుందని ప్రజలు సహజంగా భావిస్తారు. అందుకే లోకల్ బాడీ ఎన్నికల్లో ఎక్కువగా అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు వస్తూ ఉంటాయి.. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉన్న నేతల మధ్య విభేదాలు ఎన్నికల ఫలితాలను ఏ రకమైన ప్రభావానికి గురి చేస్తాయోనన్న ఆందోళన అందరిలోనూ ఉంది. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన నేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ అగ్రనేతలు మాత్రం కలసికట్టుగానే ఉన్నారు. కానీ నేతల మధ్యనే సఖ్యత లేదు. అది వాస్తవం. ఏ పార్టీ నియోజకవర్గంలో అధికారంలో ఉంటే మిగిలిన కూటమి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నేతలు వ్యతిరేకిస్తున్నారు. నామినేటెడ్ పదవులు తమకు దక్కకపోవడంతో పాటు పనుల కేటాయింపులో కూడా తమకు ప్రాధాన్యత దక్కడం లేదన్న అసహనం, అసంతృప్తి ఎక్కువగా కనిపిస్తుంది.

మద్యం షాపులు, ఇసుక, కాంట్రాక్టు పనులు వంటి విషయాల్లో తమకు అన్యాయం జరుగుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు.? అసంతృప్తి.. అసహనం... కూటమి ప్రభుత్వం ఇటు సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మరొకవైపు అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తున్నారు. కానీ నేతల మధ్య సమన్వయం లేమి కూటమి కొంపముంచుతుందేమోనన్న ఆందోళన ఎక్కువగా కనిపిస్తుంది.

ఉదాహరణకు పిఠాపురం నియోజకవర్గమే తీసుకుంటే అక్కడ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే అక్కడ జనసేనలోనే రెండు నుంచి మూడు గ్రూపులున్నాయి.

ఇక టీడీపీ, జనసేన క్యాడర్ మధ్య పొసగడం లేదు. ఇలా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. లోకల్ ఎన్నికల్లో దెబ్బతీసి ఎమ్మెల్యేను అధినాయకత్వం ముందు దోషిగా నిలబెట్టాలన్న ప్రయత్నం జరుగుతున్నట్లు కనిపిస్తుందంటున్నారు. అదే జరిగితే కూటమిలోని మూడు పార్టీలకూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెన్నుపోట్లు తప్పవని కూటమి పార్టీ నేతలే అంటుండటం విశేషం. అయితే మరో మూడు నాలుగు నెలల సమయం ఉండటంతో అప్పటికి పరిస్థితి చక్కబడే అవకాశాలున్నాయన్న ఆశలు మాత్రం నేతల్లో కనిపిస్తుంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

=====================================

# కోనసీమలో కొబ్బరి చెట్లు ఏమౌతున్నాయి...

కాకినాడ, అక్టోబరు 7,
కోనసీమ పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చేది పచ్చని కొబ్బరి చెట్లు. రోడ్డు.. ఆ రోడ్డుకు ఇరువైపులా ఉండే కొబ్బరి చెట్లు.. వాటి మధ్యన ప్రయాణం.. మనసుకు ఓ ప్రశాంతత. కానీ కోనసీమలో ఇప్పుడు ఆ కొబ్బరి చెట్లు కనుమరుగువతున్నాయి. కన్నకొడుకులా పెంచుకున్న ఆ కొబ్బరి చెట్లు వాడిపోతున్నాయి.. ఆ తర్వాత కూలిపోతున్నాయి. దీంతో ఆ రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. అసలింతకీ.. కొబ్బరి చెట్లు ఎందుకు కూలుతున్నాయి? దానికి కారణం ఏంటి? అసలేం జరుగుతోంది? సముద్రపు నీరు చేరడంతో కుళ్లిపోతున్న కొబ్బరి చెట్లు.. కోనసీమలోని కొబ్బరి చెట్లు చనిపోతుండటంతో ఇప్పుడు ప్రత్యక్షంగా 10 గ్రామాలు.. పరోక్షంగా 20 గ్రాముల రైతులు నష్టపోతున్నారు. దీనికి కారణం శంకర గుప్తం డ్రైనేజీ. వైనతేయ నదీ పాయలో సముద్రం పోటు సమయంలో వచ్చిన నీరు శంకర గుప్తం డ్రైనేజీ ద్వారా చింతలపూడి గ్రామం వరకు వెనక్కి రావడంతో కొబ్బరి తోటలలో ఆ సముద్రపు నీరు నిలిచిపోతుంది. శంకరగుప్తం మేజర్ డ్రైనేజీ వైనతేయ నది లింక్ ఉంది. శంకరగుప్తం డ్రైయిన్‌కి ప్రధానంగా నాలుగు లింక్ డ్రైనేజీలు ఉన్నాయి. ఒకటి అంతర్వేది, రెండు వేప చెట్టు డ్రెయిన్, పోలవరం డ్రెయిన్, నాలుగు ముత్యాల పేట డ్రెయిన్. ఈ నాలుగు డ్రెయిన్‌ల నుంచి వచ్చే నీరు వల్ల గ్రామాలు దెబ్బతింటున్నాయి. దీనికి అధ్యయనం చేయడానికి హార్టికల్చర్, అగ్రికల్చర్, బి డబ్ల్యూ టి, స్కాలర్స్, ఫిలాసఫర్స్, సైంటిస్టులు వచ్చారు.. వచ్చారు చూసారు వెళ్లారు గాని ఎవ్వరు నివేదికలు ఇవ్వలేదంటున్నారు గ్రామస్తులు. ాాఔఉఅ రిగ్గుల వేస్ట్



ఆయిల్ సముద్రంలో కలుస్తోందని ఆరోపణలు.. ాాఔఉఅ రిగ్గులు గ్రామాల చుట్టుపక్కల ఎక్కువగా ఉండటంతో వాటి నుండి వచ్చే వేస్ట్ ఆయిల్ అంత సముద్రంలోకి విడిచి పెడుతున్నారని చెబుతున్నారు. సముద్రపు నీరు పూర్తిగా కలుషితమవుతుందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇకపై తాము ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని చెబుతున్నారు. కోనసీమ నుంచి ఆర్మీలో పని చేస్తూ దేశానికి సేవలందిస్తున్నారు రాజేష్. మరో ఏడాదిలో రిటైర్‌మెంట్ తీసుకుని స్వస్థలానికి వచ్చి తన కొబ్బరి తోట చూసుకుందామనుకునేది ఆయన ఆలోచన. కానీ ఇప్పుడు తన తోటకు వస్తే దుఃఖం వస్తుందంటున్నారు. నేల కూలిన కొబ్బరి చెట్లను చూసి గుండె బరువెక్కుతుందని ఆవేదన చెందుతున్నారు. కొబ్బరిపై ఆధారపడ్డ పరిశ్రమలు మూతపడ్డాయన్న రైతులు.. కోనసీమ కొబ్బరి రైతులు ఇలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని 2014 ఇప్పటివరకు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు అదే గ్రామానికి చెందిన దొరబాబు అనే వ్యక్తి. కొబ్బరికాయలు ఎక్స్‌పోర్ట్ చేయడం.. కొబ్బరి తాడును తయారు చేయడం.. ఇలా అనేక పరిశ్రమలు ఇప్పుడు ఈ ప్రాంతంలో మూతపడ్డాయంటున్నారు. ఆదాయం లేక చాలా మంది పూర్తిగా గ్రామాన్ని వదిలి వలస వెళ్లే పరిస్తితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆయన. రాజోలు నియోజకవర్గంలో అనేక గ్రామాలలో ాాఔఉఅ రిగ్గులు ఉన్నాయి. వీటి నుంచి వచ్చిన వ్యర్థ ఆయిల్‌ని సముద్రంలోకి వదులుతు న్నారని చెబుతున్నారు. ప్రస్తుతం సముద్ర నీరు కూడా పూర్తిస్థాయిలో రంగు మారిపోయిందని.. విషపూరితంగా మారిపోయిందంటున్నారు. ఆ నీరే కొబ్బరి చెట్ల మధ్యలోకి రావడం వల్లే పూర్తిస్థాయిలో కుళ్ళిపోతున్నాయని చెబుతున్నారు. న్యాయం జరగకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామన్న రైతులు కోనసీమ కొబ్బరి చెట్ల వినాశనానికి కారణమవుతున్న శంకరగుప్తం డ్రైయిన్‌కి సంబంధించి పూర్తిగా విశ్లేషణ చేపడితే.. ఇది మొత్తం 22 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 1990లలోనే ఈ కాలువ నిర్మాణానికి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయితే 2014లో చేపట్టిన డ్రెడ్జింగ్ పనులు ఇప్పుడు తమకు శాపాలుగా మారాయి అంటున్నారు ఈ ప్రాంతవాసులు. 16 కిలోమీటర్లు డ్రెడ్జింగ్ చేయాల్సింది.. 8 కిలోమీటర్లు చేసి వదిలేశారని చెబుతున్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో చర్యలు చేపడితే సమస్య పరిష్కారమవుతుందని.. లేదంటే తాము ఇక పోరు బాట పడతామని చెబుతున్నారు.

# చేశాం... చెప్పుకోలేకపోయాం

కడప అక్టోబరు 7, (
మేం చేసింది చెప్పుకోలేకపోయాం. ప్రజలకు అన్నీ చేశాం కానీ? వాటిని ప్రచారం చేసుకోలేకపోయాం.. ఇటీవల జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణుల వద్ద వ్యక్తం చేసిన బాధ ఇది. అయితే ఆయన బాధకు కారణం కూటమి ప్రభుత్వం చర్యలు. ఒకవైపు అభివృద్ధి చేస్తోంది. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఎక్కడా ఆర్భాటం చేయడం లేదు. కానీ ప్రజల్లోకి కూటమి ప్రభుత్వం పనులు వెళుతున్నాయి. ప్రజల నుంచి సానుకూలత వస్తోంది. అలాగని వైసీపీ మాదిరిగా వాలంటీర్లు లేరు. ఐ ప్యాక్ లాంటి టీం కూడా లేదు. అయినా సరే కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజల్లోకి వెళ్తున్నాయి. దీనిని చూసి జగన్మోహన్ రెడ్డి తలలు పట్టుకుంటున్నారు. అయితే అప్పటికీ, ఇప్పటికీ ఆయన తేడా గుర్తించలేకపోవడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోటు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో వాలంటీర్లు ఉండేవారు. ప్రతి 50 కుటుంబాల బాధ్యతలను చూసేవారు. వారే ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేసేవారు. చక్కటి చిరునవ్వుతో లబ్ధిదారులను పలకరించేవారు. అయితే ఆ పింఛన్ అందిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. అసలు ప్రజా ప్రతినిధులతో సంబంధం లేదని.. వాలంటీర్ల చొరవతోనే తమకు పింఛన్లు అందుతున్నాయని భావించేవారు లబ్ధిదారులు. అస్సలు పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు, మంత్రుల జోక్యం ఉండేది కాదు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అలా కాదు. సీఎం చంద్రబాబు ప్రతినెలా ఒకటో తేదీన ఏదో ఒక జిల్లాకు వెళ్తున్నారు. స్వయంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రుల సైతం ప్రజల్లోకి వెళ్లి పింఛన్లు అందించగలుగుతున్నారు. తద్వారా సంక్షేమ పథకాలు బాగానే అమలు చేస్తున్నామని.. బాధ్యతగా పర్యవేక్షిస్తున్నామని ప్రజలకు సంకేతాలు పంపగలుగుతున్నారు.ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ అయ్యింది. విజయవాడలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోల్లోనే ప్రయాణించి వేదిక వద్దకు చేరుకున్నారు. వేలాది మంది ఆటో డ్రైవర్ల సమక్షంలో పథకాన్ని ప్రారంభించారు. వీలున్నంతవరకు ఎటువంటి హడావిడి లేకుండా.. ఆటో డ్రైవర్లతో మమేకం అయ్యారు. జిల్లా కేంద్రాల్లో మంత్రులు, నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు కార్యక్రమాన్ని దిగ్విజయంగా జరిపించారు. ప్రజల కోసం కూటమి ప్రభుత్వం ఏదో చేస్తుందన్న ఆలోచనను ప్రజల్లోకి పంపగలిగారు.అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం తాము ఎన్నో చేశామని.. చెప్పుకోలేకపోయామన్న బాధ వెనుక.. కూటమి ప్రభుత్వ చర్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అప్పట్లో ప్రభుత్వ పథకం అమలు చేసిన క్రమంలో మీడియాకు ప్రకటనలు ఇచ్చేవారు. వాలంటీర్లతో పని పూర్తి చేయించేవారు. తాను మాత్రం తాడేపల్లిలో బటన్ నొక్కేవారు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రులకు, ముఖ్య నాయకులకు ఎటువంటి పని లేకుండా చేసేవారు. ఆ విషయాన్ని మరిచి తాము అన్నీ చేశామని.. కానీ చెప్పుకోలేకపోయామన్న బాధ పడుతున్నారు. కానీ అసలు విషయాన్ని గ్రహించారు కానీ.. ఆయన ఎట్టి పరిస్థితుల్లో చెప్పుకోలేరు.

## ఆర్టీసీ చార్జీల పెంపుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన




హైదరాబాద్ అక్టోబరు 7
పెరిగిన ఆర్టీసీ చార్జీలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. వారంతా ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బస్సులోని ప్రయాణికులతో మాట్లాడారు. సుధీర్రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్ తదితరులు పెంచిన ఛార్జీలను తగ్గించాలని నినాదాలు చేసారు.
=======================

## సుప్రీంకోర్టులో సీజేఐపై దాడి యత్నం: కేటీఆర్ తీవ్ర ఖండన

### ప్రజాస్వామ్య మూలాలపై దాడి అంటూ వ్యాఖ్య ఎక్స్ లో పోస్ట్ చేసిన కేటీఆర్

హైదరాబాద్ అక్టోబరు 7
సుప్రీంకోర్టులో సీజేఐ గవాయ్ పై దాడికి ప్రయత్నించడాన్ని బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య మూలాలపై దాడి అంటూ వ్యాఖ్యానించారు. మన దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుంది. దీనికి నిన్న సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి జరగడం ఒక దారుణమైన సంకేతం. ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయిపై జరిగిన దాడి యత్నాన్ని తీవ్రంగా, నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నానని అన్నారు.
న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన ఈ సిగ్గుచేటైన దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు, ఆ వ్యవస్థపైనే జరిగిన దాడి. విశ్వాసం , మతం వంటి సున్నితమైన అంశాలపై ఎలాంటి విభేదం ఉన్నా కూడా హింసను సమర్థించదు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్యం యొక్క మూలాలకే ముప్పు కలిగిస్తుందని అన్నారు.

## కుక్కునూరు లో అర్ధరాత్రి వేళ అధికారుల రాకతో పరారైన ఇసుక అక్రమార్కులు




ఏలూరు అక్టోబరు 7
ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణాకు ఇసుక మాఫియా ప్రయత్నం చేసింది. పాములేరు నదీ పరీవాహం నుంచి ఇసుక అక్రమంగా సేకరించి అంతరాష్ట్ర సరిహద్దులు దాటించేందుకు సిద్దపడ్డారు. కుక్కునూరు మండల రెవెన్యూ, పోలీస్ అధికారులు సమాచారం అందుకుని రంగంలోకి దిగారు. వాచర్స్ సహకారంతో పోలీస్ వస్తున్నారన్న సమాచారంతో అప్రమత్తం అయి అక్రమార్కులు తప్పించుకున్నారు.

# తెలంగాణలో టీడీపీ... భారీ స్కెచ్

హైదరాబాద్, అక్టోబరు 7,తెలంగాణలోపార్టీ బలోపేతం పై చంద్రబాబు ఫోకస్ పెట్టారా? మెల్లగా పార్టీని యాక్టివ్ చేయాలని చూస్తున్నారా? స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్నారా? గ్రేటర్ విశాఖలో సత్తా చాటాలని చూస్తున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా ఇలానే ఉన్నాయి. కొద్ది రోజుల కిందట తెలంగాణ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు కాకుండా.. క్రమేపి పార్టీని యాక్టివ్ చేయాలని చూస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వివిధ కారణాలతో పార్టీని వీడిన వారిని రప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా బిఆర్ఎస్ లో ఉన్న పూర్వ టిడిపి నేతలతో మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే తెలుగుదేశం పార్టీ తెలంగాణలో యాక్టివ్ కావడం ఖాయం. అయితే మొన్నటి చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ ఉద్దేశం కూడా అదేనని తెలుస్తోంది.అయితే ముందుగా తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష స్థానాన్ని భర్తీ చేస్తారని తెలుస్తోంది. 2023 తెలంగాణ ఎన్నికలకు ముందు తెలంగాణ టిడిపి అధ్యక్షుడిగా ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా చేశారు. అప్పటినుంచి టీటీడీపీ అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. తెలంగాణలో ఎన్నికలు జరిగిన సమయానికి ఏపీలో చంద్రబాబు అరెస్టయ్యారు. 52 రోజులపాటు రిమాండ్ ఖైదీగా ఉండి పోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో వ్యూహాత్మకంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంది తెలుగుదేశం పార్టీ. అయితే చంద్రబాబు నిర్ణయాన్ని విభేదించారు కాసాని జ్ఞానేశ్వర్. అప్పటికే తెలంగాణలో తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేయగలిగారు జ్ఞానేశ్వర్. పోటీ నుంచి తప్పుకోవడంతో జ్ఞానేశ్వర్ పునరాలోచనలో పడ్డారు. కెసిఆర్ పిలుపుతో బి ఆర్ఎస్ లో చేరారు. ఆ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. కానీ అప్పటి నుంచి టీటీడీపీ అధ్యక్ష పదవిని భర్తీ చేయలేదు చంద్రబాబు.అయితే ఇప్పుడు అధ్యక్ష పదవి కోసం ముగ్గురు నేతల మధ్య పోటీ జరుగుతున్నట్లు సమాచారం. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగారు కృష్ణారెడ్డి. తరువాత టిడిపిని వీడి గులాబీ కండువా కప్పుకున్నారు. కానీ ఏపీలో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తీగల కృష్ణారెడ్డి గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఏకంగా సైకిల్ ఎక్కేశారు. మరోవైపు మాజీ మంత్రి బాబు మోహన్ సైతం ముందుగా గులాబీ పార్టీలోకి వెళ్లారు. తరువాత బిజెపిలో చేరారు. చివరకు పాత పార్టీ సైకిల్ ఎక్కేశారు. అయితే ఈయన సైతం అధ్యక్ష పదవి ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అరవింద్ కుమార్ గౌడ్ ఆ పదవి కోసం ఎదురుచూస్తున్నారు. ఈయన సీనియర్ నేత దేవేందర్ గౌడ్ మేనల్లుడు. పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగుతూ వచ్చారు. అయితే ఈ ముగ్గురు నేతల్లో ఎవరికో ఒకరికి పదవి ఇవ్వడం ఖాయమని తెలుస్తోంది.మరోవైపు గులాబీ పార్టీ నుంచి చాలామంది నేతలు టిడిపి వైపు వస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. మొన్న ఆ మధ్యన పార్టీ హైకమాండ్తో విభేదించిన కేసీఆర్ కుమార్తె కవిత టిడిపిలో చేరుతారని తెగ ప్రచారం నడిచింది. మరోవైపు మాజీ మంత్రి మల్లారెడ్డి, నామా నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు వంటి నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ కు చెందిన కమ్మ సామాజిక వర్గం నేతలు ఎక్కువగా టిడిపి వైపు టర్న్ అవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అందుకే చంద్రబాబు సైతం స్థానిక రాజకీయాలను అనుసరించి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. స్థానిక సంస్థలతోపాటు జీవీఎంసీ ఎన్నికల్లో ఉనికి చాటుకొని.. క్రమేపి పార్టీని అభివృద్ధి చేసి పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఆయన ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

## విశాఖపట్నంలో ఓజీ కారవాన్ బస్సు స్టార్ హోటల్ రేంజ్‌లో సౌకర్యాలు

విశాఖపట్టణం, అక్టోబరు 7
ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ, ఓజీ డ్రీమ్‌లైనర్ సంస్థ కలిసి విలాసవంతమైన కారవాన్ బస్సులను త్వరలో ప్రవేశపెడుతున్నాయి. విశాఖపట్నం నుండి అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు ఇవి అద్భుతమైన అనుభూతిని ఇస్తాయి. ఏసీ పడక గదులు, వంటగది, టీవీ, వైఫై వంటి సౌకర్యాలతో రెండు కుటుంబాలు సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. ఒక్కో వ్యక్తికి రూ.2,500తో రాత్రి బసతో కూడిన ప్యాకేజీలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ, ఓజీ డ్రీమ్‌లైనర్ సంస్థ కలిసి కారవాన్ బస్సులను త్వరలో అందుబాటులోకి తెస్తున్నాయి. ఈ బస్సులు నగర ప్రజలకు అద్భుతమైన పర్యాటక అనుభూతిని ఇస్తాయి. వీటిలో విలాసవంతమైన సౌకర్యాలు ఉంటాయి. పర్యాటక శాఖతో ఒప్పందం తర్వాత నిర్వాహకులు ప్యాకేజీలు ప్రకటిస్తారు. ఈ ఓజీ కారవాన్ బస్సులు స్టార్ హోటళ్లలా ఉంటాయి.. వీటిలో ఏసీ పడక గదులు, విశాలమైన హాళ్లు, వంటగది, మరుగుదొడ్డి వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రయాణికులు ఎంతో సౌకర్యంగా ప్రయాణించవచ్చు. విశాఖపట్నం నుంచి అరకు, పాడేరు, వంజంగి, లంబసింగి, అరసవల్లి, శ్రీకాకుళం, సీతంపేట, అన్నవరం, రాజమహేంద్రవరం, కాకినాడ వంటి అనేక పర్యాటక ప్రాంతాలను ఈ కారవాన్ బస్సులలో సందర్శించవచ్చుఈ ఓజీ కారవాన్‌లను విశాఖలో పర్యాటకులను ఆకర్షించడానికి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఓజీ కారవాన్‌లో రెండు కుటుంబాలు ప్రయాణించొచ్చు. అందుకు అవసరమైన వసతులు ఈ కారవాన్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఈ ఓజీ బస్సులో కూర్చోవడానికి సోఫాలు, పడకలు, మ్యూజిక్ సిస్టం, వినోదం కోసం రెండు టీవీలు, వైఫై, నచ్చిన ఆహారం వండుకోవడానికి వంటగది కూడా ఉంటుంది. ఒక్కో వ్యక్తి రూ.2,500 చెల్లిస్తే ఈ ఓజీ బస్సులో.. రాత్రి బసతో పాటు రోజంతా ప్రయాణించొచ్చు. పర్యాటకశాఖతో జరిగే ఒప్పందం మేరకు ఈ ధర ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు.ఎవరైనా పర్యాటక ప్రదేశాల సందర్శించాలనుకుంటే ఈ కారవాన్ బస్సులు చాలా సౌకర్యంగా ఉంటాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులతో కలిసి జాలీ ట్రిప్ వేయొచ్చు. ఈ ఓజీ బస్సులో ఒకేసారి 10 నుంచి 15 మంది వెళ్లిరావొచ్చని చెబుతున్నారు. ఈ ప్యాకేజీలో ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు సమకూరుస్తారు. అంతేకాదు ఒకవేళ ఎవరికైనా ప్రత్యేకంగా వంటకాలు కావాలంటే ముందుగా చెబితే చేయిస్తాము అంటున్నారు.

# నవీన్ యాదవ్ పేరుకే ప్రాధాన్యం

హైదరాబాద్, అక్టోబరు 7,
జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థి ఎంపిక ఆలస్యమవుతోంది. ఉపఎన్నికపై చర్చించేందుకు, అభ్యర్థిని ఖరారు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి .. పార్టీ అధ్యక్షుడు ఖర్గేతో సమావేశం అయ్యేందుకు బెంగళూరు వెళ్లారు. యాదవ్ సామాజికవర్గానికి టిక్కెట్ కేటాయించాలని ప్రాథమికంగా నిర్ణయించుకున్నారు. గతంలో మజ్లిస్ తరపున పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నవీన్ యాదవ్ ఇప్పుడు కాంగ్రెస్ లో ఉన్నారు. ఆయన వైపు రేవంత్ మొగ్గు చూపుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, తుమ్మల నాగేశ్వరరావు మూడు రోజులు స్థానిక నేతలు, కార్యకర్తలతో చర్చలు జరిపి నాలుగు పేర్లను షార్ట్ లిస్ట్ చేశారు. వారిలో ప్రధానంగా బొంతు రామ్మోహన్, నవీన్ యాదవ్ పేర్లు ఎక్కువగా ప్రచారంలోకి వస్తున్నాయి. నవీన్ యాదవ్ కుటుంబానికి స్థానికంగా పట్టు ఉంది. చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడిగా ఆయన నియోజకవర్గంలో కీలకంగా ఉంటారు. మజ్లిస్ తరపున నవీన్ యాదవ్ ఓ సారి పోటీ చేశారు. 2014లో మజ్లిస్ తరపున పోటీ చేసి .. 9వేల ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థి గోపీనాథ్ చేతిలో ఓడిపోయారు. 2019లో బీఆర్ఎస్ తో అవగాహన కారణంగా మజ్లిస్ టిక్కెట్ ఇవ్వకపోవడంతో ఇండిపెండెంట్ గా పోటీ చేశారు. సొంత బలంతోనే మూడో స్థానంలో నిలిచారు. 2023లోనూ అదే అవగాహన కొనసాగడంతో మజ్లిస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఇప్పుడు రేవంత్ ఆయన కుటుంబం మాస్ పవర్ పై నమ్మకంతో వారికే టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అభ్యర్థిత్వం కోసం మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. యాదవ సామాజికవర్గానికి ఇవ్వాలంటే తనకే ఇవ్వాలంటున్నారు. అయితే ఆయన స్థానికుడు కాదు. పాతబస్తీకి చెందిన నేత కావడంతో జూబ్లిహిల్స్ లో టిక్కెట్ ఇవ్వకపోవచ్చని చెబుతున్నారు. మరికొంత మంది టిక్కెట్ కోసం ప్రయత్నిస్తున్నా.. స్థానకి బలం.. వ్యక్తిగత బలం అన్నీ కలసి వచ్చి నవీన్ యాదవే అందరికీ కనిపిస్తున్నారు. జూబ్లిహిల్స్ ఉపఎన్నిక.. కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ కు చాలా ముఖ్యం. ఉపఎన్నికల్లో గెలిస్తే.. ప్రజాభిప్రాయం.. కాంగ్రెస్ కు అనుకూలంగా ఉందని అనుకుంటారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ యాదవ్ లేదా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దీనికోసం భారీ ఎత్తున లాబీయింగ్ కూడా జరుగుతోందని వార్తలు వస్తున్నాయి. ఒకవేళ యాదవ్ సామాజిక వర్గానికి ఇవ్వాలనుకుంటే.. నవీన్ యాదవ్‌కు ఇచ్చే అవకాశం ఉందని టాక్. నవీన్‌కు అన్నివర్గాల ప్రజల, పార్టీ సీనియర్ల మద్దతు ఉంది. మరోవైపు, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వచ్చిన హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కూడా జూబ్లీహిల్స్ టికెట్ కోసం పోటీపడుతున్నారు. అయితే ఆయన్ను ఔట్‌సైడర్‌గా భావిస్తున్నారట పార్టీ క్యాడర్. అందుకే నవీన్ యాదవ్‌కే టికెట్ ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ నిపుణులు అంటున్నారు.అభ్యర్థిని ఎంపిక చేసే క్రమంలో కాంగ్రెస్ సమీకరణాలపై కూడా చర్చ జరుగుతోంది. ఈ మధ్య కాలంలో అభ్యర్థి కోసం ఒక వ్యక్తిని పరిశీలించేటప్పుడు.. అతడి వ్యక్తిత్వం, చరిత్ర గురించి మాత్రమే పరిగణలోకి తీసుకోవట్లేదని విశ్లేషకులు అంటున్నారు.
వాటితో పాటు అతడి వద్ద డబ్బులున్నాయా, అతడు లేదా ఆమె గెలుపు గుర్రాలేనా అనే ప్రాతిపదికపైనే.. అభ్యర్థులను ఖరారు చేస్తున్నట్లు చెబుతున్నారు.ఇందులో ఎంత నిజం ఉందో పక్కకు పెడితే.. రానున్న రోజుల్లో డబ్బు, పలుకుబడి ఎన్నికలను శాసిస్తాయని స్పష్టమవుతోంది. ప్రత్యర్థిని తట్టుకుని నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవాలంటే.. వారి కంటే బలమైన వ్యక్తిని రంగంలోకి దింపాల్సి ఉంటుంది. ఈ లెక్కన రాజకీయ పార్టీలు పోటీ పడితే.. సామాన్యుడికి రాజకీయ ప్రాతినిధ్యం అందని ద్రాక్షలా పరిణమిస్తుందంటే అతిశయోక్తి కాదు.లేకపోతే.. వ్యతిరేకత ప్రారంభమయిందని చెప్పుకుంటారు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే అభ్యర్థి ఎంపిక విషయంలో హైకమాండ్ కు తన అభిప్రాయం స్పష్టంగా చెప్పి.. నవీన్ యాదవ్ పేరును ఖరారు చేయించాలని ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ ఇప్పటికే మాగంటి సునీత పేరును ఖరారు చేసింది. ఆమె ప్రచారం చేసుకుంటున్నారు. నవీన్ యాదవ్ కూడా బస్తీల్లో ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు.

# ఆటోవాలా..రోజు గడిచేది ఎలా..

హైదరాబాద్, అక్టోబరు 7, రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమంలో భాగంగా వారికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చింది. అయితే మహిళలకు లబ్ధి చేకూర్చే ఉచిత బస్సు పథకం.. పరోక్షంగా ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసింది. ప్రయాణానికి ఆటోలను వినియోగించే మహిళలు.. ఉచి తం కావడంతో బస్సు ప్రయాణానికే మొగ్గు చూపుతు న్నారు. రోజంతా కష్టపడినా పూట గడవని దయ నీయ స్థితిలో ఆటో డ్రైవర్లు బతుకులు వెళ్లదీస్తున్నారు. వాస్తవానికి ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో డ్రైవ ర్లకు నష్టం కలుగుతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి ఏడాదికి రూ. 12,000 అందిస్తామని హామీ కూడా ఇచ్చింది. కానీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఉచిత బస్సు ప్రయాణ విధానంతో దెబ్బ తిన్న ఆటో డ్రైవర్లకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సంవత్స రానికి రూ. 15,000 అందిస్తున్నది. దీంతో ఆటో డ్రైవర్లకు అండగా నిలవడంలో ఏపీని ఆదర్శంగా తీసుకుని తమ జీవనోపాధిని కాపాడుకోవడానికి వార్షిక ఆర్థిక సహాయం అందించాలని తెలంగాణ ఆటో డ్రైవర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుం బాలు మనుగడ కోసం పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వ హామీ మాత్రం ఇప్పటికీ కాగితాలకే పరిమితమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ. 12,000 వార్షిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని తెలంగాణలోని యూనియన్లు ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. 'తెలంగాణ ప్రభుత్వం వాగ్దానం చేసిన ఆర్థిక సహాయాన్ని వీలైనంత త్వరగా విడుదల చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం.- ఆర్థిక సహాయం లేకుండా వేలాది మంది డ్రైవర్లకు మనుగడ అసాధ్యంగా మారింది' అని తెలంగాణ ఆటో డ్రైవర్, కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఆటో యూనియన్ల జేఏసీ కన్వీనర్ బండారపు వెంకటేశం వాపోతున్నారు. 'మా ఆదాయాలు పడిపోయాయి, అప్పులు పెరుగుతున్నాయి, పరిస్థితి



రోజురోజుకూ దిగజారుతోంది.' అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ అంతటా ఆటో డ్రైవర్లు జీవనోపాధికి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులోకి తీసుకురావడంతో పాటు.., ఓలా, ఉబర్ వంటి ప్రైవేట్ రైడ్- హెయిలింగ్ ప్లాట్‌ఫామ్‌ల ఆధిపత్యం వల్ల అటోవాలాల రోజువారీ ఆదాయం తగ్గింది. చాలా మందిని పేదరికంలోకి నెట్టింది. ఈ నష్టాలను పూడ్చడానికి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ఉపశమనం ప్రవేశపెట్టినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీ మాత్రం ఇంకా నెరవేరలేదు. హైదరాబాద్‌లో 3 లక్షలకు పైగా ఆటో డ్రైవర్లు, తెలంగాణ అంతటా 10 లక్షలకు పైగా- అంటే దాదాపు 25 లక్షల మంది ఈ వృత్తిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్నారు. రాష్ట్ర రవాణా నెట్‌వర్క్‌లో వారిది కీలక పాత్ర అయినప్పటికీ, వారికి ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి సంక్షేమ పథకాలేవి అందుబాటులో లేవు. పరిస్థితిని మరింత దిగజార్చే విధంగా ఇంధన ధరలు, జీవన వ్యయం విపరీతంగా పెరిగినప్పటికీ, ఛార్జీలు మాత్రం ఇప్పటికీ కనీసం రూ. 20, కిలోమీటరుకు రూ. 12 గానీ ఉంది. చాలా మంది డ్రైవర్లు ఇప్పుడు నెలకు రూ. 15,000 నుంచి రూ. 20,000 మాత్రమే సంపాదిస్తున్నారు. ఇంటి కిరాయి, కిరాణా సామాగ్రి, పిల్లల పాఠశాల ఫీజులు వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడానికి కూడా వారి ఆదాయం సరిపోవడం లేదు. వాహనాలను అద్దెకు తీసుకునే వారు మరింత దారుణమైన పరిస్థితిలో ఉన్నారు. రోజుకు రూ. 400 నుంచి రూ. 500 వరకు ఆటోకు కిరాయి చెల్లిస్తున్నారు. ఈ గణాంకాలన్నీ ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సంక్షోభం స్థాయిని వెల్లడిస్తున్నాయి. మేము రోజుకు 10 నుండి 12 గంటలు పని చేస్తాం, కానీ ఇప్పటికీ మా జీవితాలు మారాలేదు' అని ఆటో డ్రైవర్ వెంకటేశం చెబుతున్నారు. ప్రభుత్వం నిర్వహించే రైడ్-బుకింగ్ అప్లికేషన్ వారి భారాన్ని గణనీయంగా తగ్గించగలదని కూడా ఆయన అభిప్రాయపడుతున్నారు. ప్రతి రైడ్‌లో 40 శాతం వరకు కమిషన్ వసూలు చేసే ప్రైవేట్ యాప్‌ల మాదిరిగా కాకుండా, రాష్ట్ర నిర్వహణ ప్లాట్‌ఫామ్ డ్రైవర్లు తమ సంపాదనలో ఎక్కువ భాగాన్ని మిగుల్చుకోవడానికి, ప్రభుత్వం ఈ రంగాన్ని మరింత సమర్థవంతంగా నియంత్రించడంలో సహాయపడటానికి ఉపయోగపడుతుంది. మాజీ మంత్రి కేటీఆర్ ఇలాంటి ప్రణాళికను ప్రతిపాదించగా, రాష్ట్ర ప్రభుత్వం దానిని పునరుద్ధరించేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో ఆవేదన చెందుతున్న ఆటో డ్రైవర్లలో ఆగ్రహం పెరిగిపోతున్నది. అయితే ఆటో డ్రైవర్ల దుస్థితిపై సికింద్రాబాద్‌లోని భారతీయ మజ్దూర్ సంఫ్? (బీఎంఎస్) ఇన్‌ఛార్జ్ శ్రీధర్ స్పందిస్తూ... ఉచిత బస్సు పథకం, యాప్ ఆధారిత సేవలకు ముందు, డ్రైవర్లు రోజుకు రూ. 2,500 నుంచి రూ. 3,000 సంపాదించారని గుర్తు చేశారు. ఇప్పుడు, రూ. 1,000 సంపాదన కూడా చాలా కష్టతరంగా మారిందని, రూ. 12,000 సహాయాన్ని వెంటనే అమలు చేయాలని, రైడ్- హెయిలింగ్ కంపెనీలు వసూలు చేసే కమిషన్లను పరిమితం చేయాలని రవాణా మంత్రి పొన్నంకు ఆయన విజ్ఞప్తి చేశారు. 'ఆరేళ్లుగా ఈ వృత్తిలోనే కష్టపడుతున్నా ప్రస్తుతం రోజుకు కనీసం రూ. 1000 సంపాదించడం కూడా కష్టమైపోయింది. ఈ సంపాదన- నా కుటుంబాన్ని పోషించడానికి సరిపోవడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు అక్కడి ప్రభుత్వం ముందడుగు వేసింది. కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం తప్పుడు వాగ్దానాలు ఇచ్చి ఆటోడ్రైవర్లను విస్మరించిందని' లోతుకుంటకు చెందిన ఆటో డ్రైవర్ జేమ్స్ తన ఆవేదనను పంచుకున్నారు. ప్రస్తుతం ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడి విషాదకరంగా, ఆత్మహత్యలకు కూడా దారితీస్తున్నది. 198 మంది ఆటో డ్రైవర్లు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారని, మరికొందరు ఈ వృత్తిని విడిచిపెట్టారని యూనియన్ నాయకులు చెబుతున్నారు. అయినా ఇప్పటికీ ఆటో నడుపుతున్న వారు భారీ అప్పుల్లో కురుకుపోతున్నారు. వాహన రుణాలపై వడ్డీగా ప్రతి నెలా రూ. 10,000 లేదా అంతకంటే ఎక్కువ చెల్లిస్తున్నారు. ప్రభుత్వం తమ దుస్థితిని నిర్లక్ష్యం చేస్తోందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ పండుగల సమయంలో ఆర్థిక సహాయం పంపిణీ చేస్తుండగా, కానీ తెలంగాణలో మాత్రం ఆటో డ్రైవర్లు ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పుడు వాగ్దానం చేసిన సహాయంలో రూ. 1,000 కోట్లకు పైగా బాకీ ఉందని నాయకులు అంచనా వేస్తున్నారు. ఛార్జీల సవరణలు, సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, రైడ్-హెయిలింగ్ ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణతో సహా తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని ఆటోడ్రైవర్లు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు ఎంతో మంది జీవనోపాధి వనరుగా ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పుడు మనుగడ కోసం రోజువారీ పోరాటం చేయాల్సివస్తున్నది. ఆదాయాలు కుప్పకూలిపోవడం, అప్పులు పెరగడం, ఆత్మహత్యలు పెరగడంతో, తెలంగాణ ఆటో- డ్రైవర్లుగా తమ బతుకులు కునారిల్లాయని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ చేస్తున్నట్టుగా ప్రభుత్వం ఇప్పుడు చర్య తీసుకోవాలని వారు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

================

## 13 నుంచి కాలేజీల బంద్...



హైదరాబాద్, అక్టోబరు 7, (

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కాలేజీలు మరోమారు మూతపడనున్నాయి. ఈ మేరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల నిర్వహణ సంఘం ప్రకటన వెలువరించింది. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. లేకుంటే అక్టోబర్ 13 నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలు మూసివేయనున్నట్లు పేర్కొంది. గత నెలలో రూ. 900 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ అక్టోబర్ 1 వరకు కేవలం రూ. 300 కోట్లు మాత్రమే చెల్లించిందని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి. సత్యనారాయణ రెడ్డి తెలిపారు. దసరాకు ముందు మరో రూ. 600 కోట్లు, దీపావళికి ముందు అదనంగా రూ. 600 కోట్లు విడుదల చేస్తామని గతంలో హామీ ఇచ్చారని, కానీ ఇంత వరకు పెండింగ్ బకాయిలు చెల్లించలేదని ఆయన అన్నారు. మిగిలిన బకాయిలను అక్టోబర్ 12 నాటికి విడుదల చేయాలని, లేదంటే అక్టోబర్ 13 నుంచి అన్ని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలు మూసివేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సంఘానికి మద్దతు తెలుపుతూ దసరాకు ముందు రూ. 1,200 కోట్లు విడుదల చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కూడా డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ దాదాపు రూ. 10 వేల కోట్ల పెండింగ్ బకాయిలను చెల్లించడంలో విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. కాగా ప్రైవేట్ కాలేజీలు ఫీజు రీయంబర్స్‌మెంట్ అంశంపై సమ్మె చేస్తామని బెదిరించడం నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి కావడం గమనార్హం. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను అసోసియేషన్ తో చర్చలు జరిపేందుకు సీఎం రేవంత్ ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఈ వారం కళాశాల యాజమాన్యాలతో సమావేశమయ్యే అవకాశం ఉంది.

## శబరిమలలో గోల్డ్ స్కామ్

తిరువనంతపురం, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)

శబరిమల ఆలయ ద్వారపాలకుల విగ్రహాలకు అమర్చిన బంగారు పూత తాపడాల బరువు తగ్గడం, ఆభరణాల నిర్వహణలో జరిగిన అక్రమాలపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కుంభకోణంలో అవినీతి పాల్పడింది కేవలం ఉన్నికృష్ణన్ పొట్టి మాత్రమే కాదని, దేవాలయ ఆస్తులను నిర్వహించే దేవస్వోం బోర్డు అధికారుల ప్రమేయం కూడా ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసు, శిక్షార్హమైన పలు నేరాలు జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని కోర్టు పేర్కొంది. ఈ కుంభకోణంపై దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. స్వర్ణ కుంభకోణం'పై ఏర్పాటైన సిట్‌కు కేరళ పోలీస్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హెచ్ వెంకటేష్ నేతృత్వం వహిస్తారు. సిట్ ఈ కుంభకోణంపై అత్యంత నిజాయితీతో, గోప్యంగా దర్యాప్తు నిర్వహించాలని, అసలు దోషులను చట్టం ముందు నిలబెట్టాలని హైకోర్టు ఆదేశించింది. ఈ స్కామ్‌కు బలం చేకూర్చే కీలక అంశాన్ని విచారణ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. 2019 డిసెంబర్ 9న ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డు అధ్యక్షుడికి పంపిన ఒక ఈ-మెయిల్‌ను కోర్టు పరిశీలించింది. శబరిమల గర్భగుడి, ద్వారపాలకుల విగ్రహాల తాపడాలకు బంగారపు పూత పనులు పూర్తయిన తర్వాత తన దగ్గర అదనంగా పసిడి పలకలు మిగిలాయని పొట్టి ఆ ఈ మెయిల్‌లో పేర్కొన్నారు. ఆ అదనపు బంగారాన్ని ఒక పేద అమ్మాయి పెళ్లి కోసం వినియోగించడంపై దానిలో అభిప్రాయం కోరారు. దీన్ని చూస్తుంటే పొట్టి దగ్గర మిగులు బంగారం ఉన్నట్లు స్పష్టమవుతోందని, అందుకే ఈ అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు అవసరమని కోర్టు పేర్కొంది.

# ఎకరం రూ.177 కోట్లు

హైదరాబాద్, అక్టోబరు 7, (

హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతంలో భూమి వేలం రికార్డు సృష్టించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరానికి రూ. 177 కోట్లు చొప్పున భూమి పలికింది. టీజీఐఐసీ నిర్వహించిన ఈ వేలంలో, మొత్తంగా ఏడు ఎకరాల 67 సెంట్ల భూమిని ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేజిక్కించుకుంది. ఈ సంస్థ మొత్తం రూ. 1,357 కోట్లకు ఈ భూమి సొంతం చేసుకుంది. టీజీఐఐసీ అధికారుల ప్రకారం, ఈ వేలం రూ. 1,357 కోట్లతో పూర్తి అయింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, హైదరాబాద్ షెడ్యూల్డ్ ఏరియాలో భాగంగా ఉన్న ఈ ప్రాంతం, ఐటీ, ఫార్మా, బయోటెక్ వంటి కంపెనీల కార్యాలయాలకు అనుకూలంగా ఉంది. గతంలో రాయదుర్గంలో ఎకరానికి రూ. 100-120 కోట్ల వరకు పలికేవి. ఈ సారి భారీగా పెరిగాయి. ఈ వేలంలో పాల్గొన్న మరో కొన్ని సంస్థలు కూడా పోటీ పడ్డాయి, కానీ ఎంఎస్ఎన్ రియాలిటీస్ అత్యధిక బిడ్‌తో విజయం సాధించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఉన్న ఈ భూమి, టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రియల్ పార్క్‌లో భాగం. వేలం ప్రక్రియలో మొత్తం 7.67 ఎకరాల భూమి వేలం వేశారు. ఎకరానికి రూ. 177 కోట్లు ధర నిర్ణయమై, మొత్తం మొత్తంగా రూ. 1,357 కోట్లు వసూలైంది. ఈ ధరలో భూమి అభివృద్ధి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సౌకర్యాలు కూడా చేరుతాయి. ఐటీ కారిడార్ మధ్యలో నాలెడ్జ్ సిటీ, ఫార్మా సిటీ, ఐటీ పార్కుల మధ్య ఈ స్థలం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్లాన్. గత రెండు సంవత్సరాలుగా ఇక్కడ భూమి ధరలు రెండు రెట్లు పెరిగాయి. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి విపులమైన ఆదాయం లభించడంతో, మరిన్ని ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు మార్గం సుగమమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ. ఈ సంస్థ గతంలో కూడా రాయదుర్గం ప్రాంతంలో పెద్ద భూములు కొనుగోలు చేసి, కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు అభివృద్ధి చేసింది. ఈ కొత్త భూమిపై ఐటీ పార్కులు, కార్పొరేట్ ఆఫీసులు నిర్మించే అవకాశం ఉంది. టీజీఐఐసీ ఎండీ శశాంక మాట్లాడుతూ.. తాజా ధర రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మునుపటి రికార్డులను బద్దలు కొట్టిందని తెలిపారు. 2022లో కోకాపేట నియోపోలీస్‌లో జరిగిన వేలంలో ఎకరాకు రూ. 100.75 కోట్లు గరిష్ఠ ధర పలికిన రికార్డును.. ఈ రాయదుర్గం నాలెడ్జ్ సిటీ వేలం అధిగమించింది. కొత్త రికార్డు ధర రూ. 177 కోట్లు కావడంతో.. ఇది గత కోకాపేట ధర కంటే దాదాపు 75% అధిక వృద్ధిని సాధించినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం పారదర్శక, వ్యాపారానుకూల వాతావరణాన్ని నిర్మిస్తోందని.. పెట్టుబడిదారులు హైదరాబాద్ భవిష్యత్తుపై ఉంచిన నమ్మకానికి ఈ వేలం నిదర్శనమని శశాంక పేర్కొన్నారు. ఈ వేలాన్ని జేఎల్ఎల్ ఇండియా, ఎంఎస్టీసీ సంస్థల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఒకవైపు రాయదుర్గంలో వాణిజ్య భూములకు భారీ ధరలు పలకగా.. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో నివాస భూములు సైతం రికార్డు స్థాయి ధరలను నమోదు చేశాయి. సోమవారం జరిగిన బహిరంగ వేలంలో 513 చదరపు గజాల విస్తీర్ణంలోని ఒక ప్లాట్‌కు చదరపు గజం (చ.గ.) ధర రూ. 1.14 లక్షలు పలికింది. హెచ్ఐజీ కేటగిరీకి చెందిన మరో ప్లాట్ చ.గ. రూ. లక్షకు అమ్ముడైంది. ఈ వేలంలో మొత్తం 18 ఓపెన్ ప్లాట్లు, 4 ఫ్లాట్లకు గాను హౌసింగ్ బోర్డుకు రూ. 44.24 కోట్ల ఆదాయం లభించింది. వేలంలో పాల్గొన్న 27 మంది బిడ్డర్ల కారణంగా చ.గ. సగటు ధర రూ. 91,947గా నమోదైంది. ఈ డబుల్ రికార్డులతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మరింత జోరును సంతరించుకుంది.

# అస్తవ్యస్తంగా రోడ్లు.. ..జాతర కైనా పూర్తయ్యేనా

వరంగల్, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)

తెలంగాణ ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల మధ్య నూతనంగా ఏర్పాటు చేసిన 163 జాతీయ రహదారిపై వరంగల్, ములుగు జిల్లాల పరిధిలో రెండు ప్రధాన వంతెనల నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడం వల్ల నిత్యం వేల వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించనుండగా, ఈసారి జాతర వరకు కూడా రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తారా లేదా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం 317 కోట్ల రూపాయలతో గతంలో ఉన్న ఆర్ అండ్ బి రోడ్డును నాలుగు వర్సాలుగా విస్తరించేందుకు 163 జాతీయ రహదారి పేరుతో హైదరాబాదు నుండి భూపాలపట్నం వరకు పనులు చేపట్టారు. హైదరాబాదు నుండి ఆత్మకూరు వరకు రహదారి నిర్మాణం పూర్తి చేశారు. హైదరాబాదు నుండి నేరుగా హనుమకొండ నగరానికి రాకుండానే బైపాస్ రోడ్డు ద్వారా ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని భూపాలపట్నం వెళ్లడానికి రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఇక తాడ్వాయి, ఏటూర్ నాగారం, గోవిందరావుపేట మండలాల పరిధిలో కొన్నిచోట్ల అటవీశాఖ క్లియరెన్స్ లేకపోవడంతో రోడ్డు పనులు విస్తరించక పోగా, పలుచోట్ల వంతెన నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయాయి. ములుగు జిల్లా మల్లంపల్లి వద్ద ఎస్సారెస్పీ కాలువపై ఇరుకైన వంతెన విస్తరణ పనులు ఇటీవలే ప్రారంభించారు. అదేవిధంగా హనుమకొండ జిల్లా కటాక్షపూర్ వద్ద చెరువు మత్తడి వద్ద హై లెవెల్ వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కటాక్ష పూర్ వద్ద వంతెన నిర్మాణం పూర్తిచేసేంతవరకు ప్రస్తుతం ఉన్న లో లెవెల్ కాజ్ వే కు పటిష్టమైన మరమ్మత్తులు చేపట్టడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. లో లెవెల్ కాజ్ వే పైన గుంతలు ఏర్పడి వర్షం నీటిలో ప్రమాదాల చోటుచేసుకుంటున్నాయి. ఒకవైపు మాత్రమే రోడ్డు కాస్త మెరుగ్గా ఉండగా మరోవైపు పూర్తిగా దెబ్బతిందని, వరద ఉధృతిలో రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు భారీ వర్షాలు కురిస్తే ఆ సమయంలో చెరువు మత్తడి పోయడం వల్ల వరద ఉధృతి పెరిగి పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయని, ఫలితంగా పరకాల మీదుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మత్తడి పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ములుగు జిల్లా మల్లంపల్లి వద్ద ఎస్సారెస్పీ కాలువపై చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఇరుకు వంతెన కృంగిపోవడంతో రాకపోకలు నిలిపివేసి కొద్ది రోజులు పరకాల మీదుగా దారి మళ్ళించారు. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టిన జాతీయ రహదారుల శాఖ తాత్కాలికంగా రాకపోకలను ఇటీవల పునరుద్ధరించారు.

రాష్ట్ర రాజధాని హైదరాబాదు నుండి ఛత్తీస్ ఘడ్ రాష్ట్రానికి దగ్గరి మార్గం కావడంతో పాటు నల్గొండ, వరంగల్, ములుగు, జిల్లాలకు ప్రధాన రహదారిగా ఉండడంతో నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తాయి. అలాగే తెలంగాణలో పర్యాటక ప్రాంతాలైన రామప్ప, బోగత, లక్నవరంతో పాటు ప్రతిష్టాత్మకమైన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంతం వెళ్లడానికి ఈ మార్గమే ప్రధాన దిక్కుగా మారింది. అయితే కొన్ని ఏళ్ల క్రితం పనులు చేపట్టిన జాతీయ రహదారుల శాఖ ఇరుకుగా మారిన వంతెనల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయకుండా నత్తనడకన సాగిస్తుందని విమర్శలు వస్తున్నాయి. దీనివల్ల తరచుగా వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతుందని, వచ్చే ఏడాది మేడారం జాతరకు వచ్చే వాహనాలకు ఇబ్బందిగా మారే పరిస్థితి కనిపిస్తోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతరను ఈసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి 150 కోట్ల రూపాయలను మంజూరు చేసి మేడారంలో అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి వందరోజులకు అడుగు పెట్టింది. ఈ నేపథ్యంలో మేడారం జాతర పనులను ములుగు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అయితే మేడారం రావడానికి ప్రధాన రహదారి పరిస్థితి అధ్వానంగా మారడంపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు, వాహనదారులు పేర్కొంటున్నారు. అసంపూర్తిగా ఉన్న వంతెనల నిర్మాణం పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని, మేడారం వరకు నాలుగు వరసల రహదారి పనులను పూర్తిచేసి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై జాతీయ రహదారుల విభాగం ఇంజనీరింగ్ అధికారులు మాట్లాడుతూ జాతర వరకు అసంపూర్తి పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ఈ విషయంపై గుత్తేదారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, పనులను వేగవంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

## ఓటర్ లిస్ట్ లో మీ పేరు లేదా... అయితే ఇలా చేయండి

హైదరాబాద్, అక్టోబరు 7,

తెలంగాణ రాష్ట్ర రాజధానిలో కీలకమైన జూబ్లీహిల్స్ శాసనసభ స్థానానికి సంబంధించిన ఉపఎన్నికల సందడి మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే.. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పందించారు. ఈ ప్రకటన కారణంగా హైదరాబాద్ జిల్లా పరిధిలో తక్షణమే ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినట్లు ఆయన మీడియాకు తెలియజేశారు. జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన ఉపఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. నవంబర్ 11వ తేదీ రోజున పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని, ఆ తర్వాత నవంబర్ 14న కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) చేపడతామని అధికారులు వివరించారు. ఈ ప్రాంతంలో దాదాపు 4 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, వారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలుగా 139 ప్రాంతాలలో మొత్తం 407 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. నియమావళి అమలు నేపథ్యంలో.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన అన్ని రకాల పోస్టర్లు, బ్యానర్లు, గోడ రాతలు వంటి వాటిని వెంటనే తొలగింపు చర్యలు చేపడతామని కర్ణన్ తెలియజేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా స్థలాలపై ఎలాంటి రాజకీయ ప్రకటనలు కనిపించకూడదని ఆదేశించారు. ఈ ఎన్నికల నియమావళిని ఏ రాజకీయ పక్షం, నాయకుడు లేదా కార్యకర్త ఉల్లంఘించినా.. వారిపై పార్టీలకు అతీతంగా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని.. తక్షణమే కేసులు నమోదు అవుతాయని కమిషనర్ హెచ్చరిక జారీ చేశారు. ముఖ్యంగా.. ఉపఎన్నిక జరగనున్న ఈ ప్రాంతంలో కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఇంకా పది రోజులు మాత్రమే ఉందని.. అర్హులైన పౌరులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే మీరు దరఖాస్తు చేసుకుంటే.. మీ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో అధికారిక వెబ్ సైట్ కు వెళ్లి తెలుసుకోవాల్సి ఉంటుంది. ఒక వేల మీ పేరు లేకపోతే.. దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం కల్పించారు.

====================

## పెరాలసిస్ వారి కోసం ఆవిష్కరణ

హైదరాబాద్, అక్టోబరు 7,

టెక్నాలజీ సాయంతో పూర్తిగా శరీరం పక్షవాతానికి గురైన వారికి సహాయం అందించే పరికరాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు రూపొందించారు. ఈ నూతన ఆవిష్కరణ పక్షవాత రోగులకు స్వతంత్రంగా జీవించే అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ పరికరం సహాయంతో రోగులు తమ వీల్‌చైర్‌ను నియంత్రించడం, అర్జెంట్‌గా ఎద్దైనా అవసరం అయితే అభ్యర్థించడం, ఇంట్లోని విద్యుత్ పరికరాలను కూడా ఆపరేట్ చేయడం సాధ్యమవుతుంది. బయోమెడికల్ ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ చదువుతున్న ఈ విద్యార్థులు రూపొందించిన ఈ ప్రాజెక్ట్‌కు 'పక్షవాత రోగుల కోసం ఇంటిగ్రేటెడ్ సహాయక సాంకేతిక వ్యవస్థ అని పేరు పెట్టారు. ఈ ఆవిష్కరణ 'హాక్-ఎ-బోర్డ్ హ్యాకథాన్' ఫైనల్‌లో మొదటి బహుమతిని గెలుచుకుంది. ఈ పరికరం పని చేయడానికి ముఖ్యంగా మూడు టెక్నాలజీలను ఉపయోగించారు. ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్ . వినియోగదారు ముఖ కదలికలను గుర్తించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఎమీ).. దీని ద్వారా ఇంటిలోని స్విచ్‌లు వంటి వాటిని నియంత్రించవచ్చు. బాహ్యంగా జత చేసిన స్క్రీన్.. ఆదేశాలను వీక్షించడానికి ఉపయోగపడుతుందిఈ బృందంలోని హారిక అనే విద్యార్థి మాట్లాడుతూ.. మెడ కింది భాగం నుండి కండరాల కదలికను కోల్పోయిన రోగులు కుటుంబ సభ్యులపై పూర్తిగా ఆధారపడటం తప్ప వేరే మార్గం లేదని అన్నారు. అలాంటి వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతోనే ఈ ఉత్పత్తిని రూపొందించినట్లు, దీనిని ఏ వీల్‌చైర్‌కు లేదా బెడ్‌కు అయినా జత చేయవచ్చని వివరించారు. వినియోగదారు ముక్కు కొన స్థానాన్ని ట్రాక్ చేయడం ద్వారా వివిధ పనులు చేస్తుంది. వీల్‌చైర్‌కు జతచేసిన స్క్రీన్ ముందు వినియోగదారు ముఖాన్ని లేదా తలను కదిలించి.. ఒక నిర్ణీత స్థానంలో మూడు సెకన్ల పాటు ఆపితే.. యాక్షన్ ఎంపిక అవుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ముందుగా నమోదు చేసుకున్న కొన్ని నంబర్‌లకు కాల్ చేసి సహాయం కోరడానికి కూడా ఇది అవకాశం ఇస్తుంది. దీనివల్ల ఇతరులపై ఆధారపడటం తగ్గుతుంది.

## తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఘనంగా కొమురం భీం వర్ధంతి వేడుకలు

జిల్లా తుడుందెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ మండిగ రవీందర్

;తాండూర్ .అక్టోబర్ 7)

ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీం వర్ధంతి సందర్భంగా ఐబీ తాండూర్ కేంద్రంలో ఆ మహనీయుడు చిత్ర పటానికి తుడుందెబ్బ నాయకులుపూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా తుడుందెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ మండిగా రవీందర్ మాట్లాడుతూ కొమరం భీం పోరాటం.. ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటమని చెప్పుకొచ్చారు. 'మా గుడాల్లో మా రాజ్యం కావాలని మా అడవుల మీద మాకు హక్కు ఉండాలని పోరాటం చేసారన్నారు.ఈ కార్యక్రమంలో తాండూర్ మండల్ తుడుం దెబ్బ మండల ప్రధాన కార్యదర్శి యాపల సమ్మయ్య, కొలవరి సేవా సంఘం మండల అధ్యక్షుడు గోలిసేటి బాపు ,కిష్టంపేట మాజీ సర్పంచ్ గడ్డం మణికుమార్,మహేందర ,టేకం రాజయ్య ,ఎలుగటి పోచయ్య, సంతోష్ ,మండిగ చిన్నయ్య,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీఈసా,నాయకులు సిరంగిశంకర్,రవీందర్ రెడ్డి,మురళీధర్,పూసల ప్రణయ్ కుమార్,దత్తుమూర్తి,పులగం తిరుపతి,భరత్,శంకర్ గౌడ్, చిన్నయ్య, తిరుపతి, వెంకటేష్, ఎగిడి సంతోష్,దామోదర్,శ్రీనివాస్,పాపయ్య,విష్ణు కళ్యాణ్,అరుణ్ కుమార్, శ్రీధర్, సురేష్, వెంకటస్వామి, చందు,విగ్నేష్,రఘు,తదితరులు పాల్గొన్నారు

==========================

## రామ్మూర్తి నాయుడు వర్ధంతిలో పాల్గొన్న చంద్రబాబు కుటుంబం

తిరుపతి అక్టోబర్ 7)

నారావారిపల్లెలో తన సోదరుడు రామ్మూర్తి నాయుడు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.తరువాత రామ్మూర్తినాయుడు స్మృతీవనం వద్ద తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు.

## 10 కోట్లు ఎగ్గొట్టిన వడ్డీ వ్యాపారి ఇంటి పై బాధితుల దాడి

నల్గొండ అక్టోబర్ 7)

నల్గొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలంలోని పడమటి తండాలో ఇటీవల అధికవడ్డీల ఆశ చూపి భాదితులకు మొండిచేయి చూపించి 10 కోట్ల మేర ఎగ్గొట్టి తిరుగుతున్న బాలాజీ నాయక్ అనే వడ్డీ వ్యాపారి ఇంటి పై బాధితులు దాడికి దిగారు. ఫర్నీచర్ ధ్వంసం చేసి తగలబెట్టారు. బాలాజీ నాయక్ ఐపీ పెట్టి కోర్టుకు పోయి 300 మందికి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున బాధితులు తరలి వచ్చి బాలాజీ నాయక్ ఇంటిపై దాడి చేసారు.

## జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ దే విజయం

సికింద్రాబాద్.. అక్టోబర్ 7)

కంటోన్మెంట్ ఉప ఎన్నికల మాదిరిగానే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని కంటోన్మెంట్ కాంగ్రెస్ శాసనసభ్యులు శ్రీ గణేష్ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

# 22 నుంచి పత్తి కొనుగోళ్లు...

అదిలాబాద్, అక్టోబరు 7, తెలంగాణలో పత్తి కొనుగోళ్లకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీసీఐ అధికారులు, రాష్ట్రంలోని కాటన్ మిల్లర్లతో సోమవారం నిర్వహించిన కీలక సమావేశంలో ఏకాభిప్రాయం కుదరడంతో ఈ ప్రతిష్టంభన వీడిం కొద్ది రోజులుగా మిల్లర్లు టెండరు నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కొనుగోళ్ల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పత్తి క్వింటా రూ.5 వేలకు మించి ఎవరూ కొనటం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది రూ. 9 వేల వరకు పలికిన పత్తి ఈ ఏడాది రూ.5 వేలకే అడుగుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కొనుగోళ్లు ప్రారభించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ మేరకు సోమవారం జరిగిన సమావేశంలో సీసీఐ చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) లలిత్‌కుమార్ సింగ్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సంచాలకులు గోపి, లక్ష్మీబాయి, తెలంగాణ కాటన్ మిల్లర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు మంత్రి తుమ్మలతో జరిగిన భేటీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మిల్లర్లు ముఖ్యంగా దూదిశాతం, స్లాట్ బుకింగ్, జాబ్‌వర్క్ టెండర్లలోని ఒ-1, ఒ-2 నిబంధనల గురించి తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై స్పందించిన సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ సింగ్.. దేశవ్యాప్తంగా ఉన్న నిబంధనలను మార్చడం సాధ్యం కానప్పటికీ రాష్ట్ర మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం ఒ-1, ఒ-2 నిబంధనల్లో సడలింపులు ఇస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాల వారీగా జాబ్‌వర్క్‌కు అవకాశాలు కల్పిస్తామని, మిల్లర్ల సమస్యలను పరిష్కరించడానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ హామీతో మిల్లర్లు టెండర్లలో పాల్గొనడానికి అంగీకరించారు.చర్చలు ఫలించిన నేపథ్యంలో.. మంగళవారం నుంచే రాష్ట్రంలోని 341 మంది మిల్లర్లు జాబ్‌వర్క్‌కు సంబంధించిన టెండర్లను దాఖలు చేయనున్నారు. బుధవారంతో టెండర్ల గడువు ముగియనుంది. ఆ వెంటనే సీసీఐ, మిల్లర్లతో ఒప్పందాలు కుదుర్చుకోనుంది. రైతులకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా, వీలైనంత త్వరగా పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు. వాస్తవానికి ఈ నెల 21 నుంచి కొనుగోళ్లు చేపట్టాలని సీసీఐ భావించినప్పటికీ.. మిల్లర్లు మరో రెండు రోజుల గడువు కోరడంతో ఈ నెల 22 లేదా 23వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీసీఐ అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. దీంతో పంట దిగుబడిని విక్రయించడానికి ఎదురుచూస్తున్న వేలాది మంది రైతులకు ఊరట లభించింది.

# ఘనంగా కొమురం భీం 85వ వర్ధంతి



జయశంకర్ భూపాలపల్లి.అక్టోబర్ 7)జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ఆఫీసులో తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో మంగళవారం కొమురం భీం 85వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు అనంతరం తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ మాట్లాడుతూ ఆదివాసీల ఆత్మ గౌరవానికి నిలువెత్తు రూపం. గిరిజనుల ఆరాధ్య దైవం. అడవి బిడ్డల హక్కుల కోసం పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన పోరు కెరటం "జల్.జంగల్.జమీన్" నినాదం ఆదివాసీల ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటం నిజాం పాలకులకు సింహస్వప్నం. కొమరం బీం అని అన్నారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామర గట్టయ్య. మాట్లాడుతూ నిన్నటి రోజున సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై న్యాయవాది ముసుగు వేసుకున్న ఒక సనాతనవాది కోర్టు హాలులో న్యాయవాదులందరూ చూస్తుండగా దాడికి ప్రయత్నించడం అత్యంత హేయమైన,దుర్మార్గమైన చర్య. స్వతంత్ర న్యాయ వ్యవస్థ మీద దాడి మాత్రమే కాదు, మన భారత రాజ్యాంగంపై దాడి కూడా. మనుస్మృతిని తమ రాజ్యాంగంగా కొనసాగిస్తున్న బిజెపి,ఆర్ఎస్ఎస్, వాటి అనుబంధ సంస్థలకు భారత రాజ్యాంగమును గౌరవించడం, అమలు చేయడం సుతారము ఇష్టం లేదనే విషయం ఈ చర్యతో మరొక్కసారి రుజువు అయింది. గతంలో నూతన పార్లమెంటు భవనం ప్రారంభ ఉత్సవంలో భారత ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును పక్కకు పెట్టడానికి ఆమె ఒక భర్త లేని స్త్రీ అని, ఆదివాసి మహిళ అని, సనాతన మనుధర్మం ప్రకారం ఆ శుభకార్యానికి ఆమెకు అనుమతి లేదని భారతదేశానికే కాదు, ప్రపంచానికి చాటి చెప్పిన విషయం మనందరికీ తెలుసు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షురాలు కుడుమేత సరస్వతి. ప్రధాన కార్యదర్శి దుబాసి పార్వతి. యువైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు. తదితరులు పాల్గొన్నారు.

## సింగూరు ప్రాజెక్టుకి కొనసాగుతున్న వరద

సంగారెడ్డి అక్టోబరు 7,

జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. దాంతో మూడు స్పిల్ వే గేటు ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. ఇన్ ఫ్లో- 20858, ఔట్ ఫ్లో- 21240 క్యూసెక్కులు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం- 29.917 టీఎంసీలు. ప్రాజెక్టు ప్రస్తుత నీటి సామర్థ్యం- 18.169 టీఎంసీలు.

## బైకు దొంగ అరెస్టు 50 బైకులు స్వాధీనం

గుంటూరు అక్టోబరు 7,

కొత్తపేట పోలీసులు అంతర్ జిల్లా బైకుల దొంగను అరెస్టు చేసారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా, గురజాల మండలం, మాడుగుల గ్రామానికి చెందిన అంతర్ జిల్లా బైకుల దొంగ బొప్పూరి మల్లికార్జున రావు అరెస్ట్ చేసాం. నిందితుడు వద్ద నుండి 50 బైకులు స్వాధీనం చేసుకున్నాం. స్వాధీనం చేసుకున్న బైకులు విలువ రూ.25,00,000/- వుంటుందని అన్నారు. మద్యానికి బానిసై నిందితుడు భార్యకు దూరంగా గుంటూరులో నివాసం వుంటున్నాడు. రైల్వే స్టేషన్ ఏరియాలోని మడత మంచాల లాడ్జిలో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. 2024 నుండి గుంటూరు, దాచేపల్లి, మాచర్ల, పిడుగురాళ్ల ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చేసాడు. మాయాబజార్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు వద్ద నుండి 15 బైకులు కొనుగోలు చేసిన గురజాలకు చెందిన బైక్ మెకానిక్ రాజశేఖర్, గొర్రెల కాపరి మహేష్ వద్ద నుండి 6 బైకులు, సాతులూరు కి చెందిన బేల్దరు మేస్త్రి నుండి 7 బైకులు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామన్నారు.

==========================

## కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన ప్రపంచ ట్రైజెమినల్ న్యూరాల్జియా దినోత్సవం

కాకినాడ అక్టోబరు 7,

స్థానిక రమణయ్య పేట వద్ద ఉన్న అడబాల ట్రస్ట్ లో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన ప్రపంచ ?ట్రైజెమినల్ న్యూరాల్జియా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ "?ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 7 ను ట్రైజెమినల్ న్యూరాల్జియా అవగాహన దినంగా జరుపుకుంటారని తెలిపారు. ట్రైజెమినల్ ? న్యూరాల్జియా? ముఖానికి సంచలనాన్ని అందించే ట్రైజెమినల్ నరానికి సంబంధించిన ఒక దీర్ఘకాలిక నొప్పి అని,దీని?ముఖ్య లక్షణాలు ?తీవ్రమైన నొప్పి,ముఖంలో ఆకస్మికంగా, తీవ్రంగా, విద్యుత్ షాక్ కొట్టినట్లుగా లేదా మండే విధంగా నొప్పి అని,?నొప్పి కొన్ని సెకన్ల నుండి కొన్ని నిమిషాల వరకు మాత్రమే ఉంటుంది, కానీ ఇది తరచుగా పునరావృతమవుతుందని,?సాధారణంగా ముఖం యొక్క ఒక వైపు మాత్రమే నొప్పి ఉంటుంది, ఎక్కువగా బుగ్గ, దవడ, పెదవులు లేదా కళ్ళ చుట్టూ ఉంటుందని,?ట్రిగ్గర్ పాయింట్స్ ..ముఖం కడుక్కోవడం, పళ్ళు తోముకోవడం, గడ్డం చేసుకోవడం, మాట్లాడటం, నమలడం లేదా చల్లటి గాలి తగలడం వంటి రోజువారీ పనుల ద్వారా ఈ నొప్పి ప్రేరేపించబడుతుందని తెలిపారు.?మందులు కార్బమజెపైన్ వంటి మందులు నొప్పిని నియంత్రించడానికి ప్రాథమిక చికిత్సగా ఉపయోగిస్తారని,? మందులతో నొప్పి తగ్గకపోతే, మైక్రోవాస్కులర్ డికంప్రెషన్ వంటి శస్త్రచికిత్సలు లేదా రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ వంటి ప్రక్రియలను నొప్పిని తగ్గించడానికి లేదా నయం చేయడానికి పరిగణించవచ్చని అన్నారు .?ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఎ సభ్యులు ,అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వర రావు, ప్రజలు పాల్గొన్నారు.

=======================================చీచీ

## కొమురం భీమ్‌కు ఎమ్మెల్సీ కవిత నివాళులు

ట్యాంక్ బండ్,.అక్టోబర్ 7)

ఆదివాసీ యోధులు కొమురం భీమ్ వర్ధంతి నేపథ్యంలో ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కవిత మాట్లాడుతూ తెలంగాణ మన్నెం పులి, ఆదివాసీ బొబ్బిలి కొమురం భీమ్. తమ జాతి కోసం ఎలా పోరాటం చేయాలో దేశం మొత్తం తరతరాలు చెప్పుకునేలా గొప్ప పోరాటం చేసిన బిడ్డ కొమురం భీమ్ అని అన్నారు.

కొంతమంది జననం చరిత్ర అయితే...కొంతమంది మరణం చరిత్ర అవుతుంది. కొమురం భీమ్ తన మరణంతో ఆదివాసీలకు ఎన్నో హక్కులను పర్మినెంట్ గా సాధించి పెట్టారు. మావా నాటే మావా రాజ్' అంటే మా గూడెంలో మా రాజ్యమే ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. జల్, జంగిల్, జమీన్ అనగా నీరు, అడవి, భూమి మీద ఆదివాసీలకే హక్కు ఉండాలని ఆయన పోరాటం చేశారు. నిజాం ప్రభుత్వాన్ని తలవంచేలా చేసి ఆదివాసీలు తమ సమస్యలు చెప్పుకునేలా దర్బార్ నిర్వహించేలా చేశారు. ఇప్పటికీ కొమురం భీమ్ గౌరవార్థం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నమంటే అది ఆయన గొప్పతనం. కొమురం భీమ్ కి జోడే ఘాట్ వద్ద స్మృతి వనం కట్టుకున్నాం. తెలంగాణ వచ్చాక ఆయనకు తగిన గౌరవం ఇచ్చుకున్నాం. గుస్సాడీ ఉత్సవాల కోసం గత ప్రభుత్వం ఏటా ప్రతి గూడానికి రూ. 25 వేలు ఇచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం పెరిగిన ధరలను పరిగణలోకి తీసుకుని ఈ ఉత్సవాల కోసం రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

ఈ ఉత్సవాలు ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. కనుక ఈ సంస్కృతిని కాపాడాలి. అది ప్రభుత్వం బాధ్యత. కచ్చితంగా గుస్సాడి ఉత్సవాలకు డబ్బులు ఇవ్వాలి. కాంగ్రెస్ వచ్చాక గూడెలలో అభివృద్ధి ఆగిపోయింది. మహిళలకు కనీసం ప్రసూతి సౌకర్యాలు లేని పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యలపై కొమురం భీమ్ స్ఫూర్తితో జాగృతి పోరాటం చేస్తుంది. మా ఆదివాసీ విభాగం అధ్యక్షుడు లోకిని రాజు ఆధ్వర్యంలో ఆదివాసీలతో చర్చలు చేస్తున్నాం. ఆదివాసీల హక్కుల పోరాటం కోసం త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తాంమని అన్నారు.

# పీడితుల గొంతు జస్టిస్ వి. గోపాల గౌడ

## పదవీ కాలం మొత్తం సామాన్యుల పక్షాన నిలచిన అసామాన్యుడు

నాకు ఆయన స్ఫూర్తి ప్రదాతే కాదు మార్గనిర్దేశకుడు కూడా

న్యాయపరమైన అంశాల్లో స్వతంత్రంగా ఆయన సేవలు అందించారు

రాజ్యాంగ రక్షణ కూడా దేశ భక్తిగా భావించే ఆయన జీవితం స్ఫూర్తిదాయకం

జస్టిస్ గోపాల గౌడ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా మానవతావాది పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్'న్యాయం అనేది కేవలం తీర్పుగా ఉండిపోకూడదు అది బాధితుల తరఫున వినిపించే గళంగా ఉండాలి అని భావించిన గొప్ప న్యాయ కోవిదుడు జస్టిస్ వి. గోపాల గౌడ . అలాంటి అసమాన్య వ్యక్తి సమక్షంలో నిలబడి ప్రసంగిచడం అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఇక్కడికి రాజకీయ నాయకుడిగా రాలేదు. భారత దేశంలో సుప్రసిద్ధుడైన న్యాయ కోవిదుడికి విద్యార్థిగా వచ్చాన'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చి అసమాన్యుడిగా ఎదిగి, తన పదవీకాలం మొత్తంలో పీడితుల పక్షాన నిలచి, అత్యున్నత న్యాయ స్థానానికి న్యాయమూర్తిగా జస్టిస్ గోపాల గౌడ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. జస్టిస్ గోపాల గౌడ గారి జన్మ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం బెంగళూరులోనూ కర్ణాటక విధాన సౌధలో... ఆయన జీవితంపై రచించిన మానవతావాది పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "జస్టిస్ గోపాల గౌడ జీవితాన్ని పరిశీలిస్తే ఒక స్ఫూర్తివంతమైన ప్రయాణం గుర్తొస్తుంది. చిక్కబల్లాపూర్ జిల్లాలోని, చింతామణి రీజియన్, పెద్దూరు అనే మారుమూల గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించి తన పట్టుదలతో ఉన్నత స్థానాలు అధిరోహించిన ఆయన యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారు. సాధారణ అడ్వకేట్ గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా, ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, అనంతరం అత్యున్నత న్యాయస్థానానికి న్యాయమూర్తిగా గోపాల గౌడ అందించిన సేవలు ఎనలేనివి. నిజాయితీ, నిబద్ధత, కఠోర శ్రమ అనే ఆయుధాలే ఆయన్ని ముందుకు నడిపించాయి. జులై 2025లో నేను ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... జస్టిస్ వి.గోపాల గౌడ నాకు కేవలం స్ఫూర్తిప్రదాత మాత్రమే కాదు నా మెంటార్ కూడా అని చెప్పాను. రాజ్యాంగ పరిరక్షణకు ఆయన చూపించే అవిశ్రాంత



పోరాటం, విలువలు, నన్ను ఆ మాట అనేలా చేశాయి. ప్రభుత్వాలు మారతాయి.. రాజ్యాంగం ఎప్పటికీ మారదుప్రభుత్వాలు ఐదేళ్లకోసారి మారే అవకాశం ఉంటుంది. పాలకులు కూడా మారతారు కానీ భారత దేశ రాజ్యాంగం ఎప్పటికీ తన పని తాను చేసుకుంటూ వెళ్తుందని జస్టిస్ గోపాల గౌడ బలంగా నమ్ముతారు. పాటిస్తారు. ప్రభుత్వాలు రాజ్యాంగ విరుద్ధంగా ముందుకు వెళ్లిన ప్రతిసారి శ్రీ గోపాల గౌడ గారు నిర్మోహమాటంగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చడంలో ముందుంటారు. ప్రభుత్వాలుగాని, కార్యనిర్వహక వ్యవస్థలుగాని రాజ్యాంగానికి కట్టుబడే పని చేయాలని, అప్పుడే నిజమైన రాజ్యాంగ ఫలాలు సామాన్యుడికి అందుతాయని ఆయన చెబుతారు. రాజ్యాంగ రక్షణ కూడా దేశ భక్తిగానే భావించే జస్టిస్ గౌడ గారి జీవితం, ఆయన మాటలు నన్ను ఎంతో ఉత్తేజితం చేస్తాయి. నైతిక విలువలు పాటిస్తూ చట్టబద్ధంగా రాజ్యాంగ రక్షణకు ఆయన ముందుకు వెళ్తారు. గోపాల గౌడ ఆలోచనలు, ఆయన పాటించే విలువలు, చూపించే తెగువ కూడా జాతీయ సమైక్యత కిందకే వస్తాయి. వాటిని భావితరాలకు అందంగా అందిండంలో నిబద్ధతగా పని చేస్తారు.రాజ్యాంగంపై నమ్మకం అపారంరాజ్యాంగం అనేది కేవలం ఒక పుస్తకం కాదు.



రాజ్యాంగం ఎప్పుడూ దానిని రక్షించే వారి చేతుల్లో ఉండాలని జస్టిస్ గోపాల గౌడ చెబుతుంటారు. మేము ఆయన మాటలకు, మేధస్సుకు ఎప్పుడూ రుణపడి ఉంటాం. రాజ్యాంగ రక్షణలో ఆయనకి ఉన్న స్పష్టత, అవగాహన గొప్పవి. ప్రజాస్వామ్య పరిరక్షణకు మీ మాటలు పునాదులుగా పని చేస్తాయి.

# అందరికీ స్ఫూర్తి... "స్వచ్ఛ ఆంధ్రా పురస్కారాలు":

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, అక్టోబర్ 7 ( భారత శక్తి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛ ఆంధ్రా పురస్కారాలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాయని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

కలెక్టరేట్ లోని సభా భవన్ లో "స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలు – 2025" ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు ప్రభుత్వ విప్, జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, జేసీ అదితిసింగ్, కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, జెడ్పి సీఈవో ఓబులమ్మ హాజరై అవార్డులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం అమలు చేస్తున్న "స్వచ్ఛ ఆంధ్రా –2025 పురస్కారాలు" ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపుతున్నాయన్నారు.



స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 3వ శనివారం చేపడుతున్న స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించడం ద్వారా జిల్లాలోని ప్రతి గ్రామం స్వచ్ఛతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. దైనందిన మన జీవితంలో నిజమైన హీరోలు ఎవరంటే.. పారిశుధ్య కార్మికులే అని గర్వాంగా చెప్పుకోవాలన్నారు. వారి సేవలు వెల కట్టలేనివని అభివర్ణించారు. స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేసి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ అవార్డుల ప్రదానం రాష్ట్రానికే కాదు, దేశానికి ఆదర్శనీయం అన్నారు. ముందుగా రెండు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న వారికి, 48 జిల్లా స్థాయి అవార్డులు అందుకున్న ప్రతి ఒక్కరికీ శుభాభివందనాలు తెలియజేస్తున్నామన్నారు. స్వచ్ఛ ఆలోచన అనేది మన ఇంటి నుండే ప్రారంభం కావాలన్నారు. ప్రతి పౌరుడు స్వచ్ఛ ఆంధ్ర సాధన వైపు అడుగులేసి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. జిల్లా అంతట పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, తడి పొడి చెత్తలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ వేస్ట్ ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉంటుందని... దాని పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మన జిల్లాను ఆరోగ్య జిల్లాగా, కాలుష్య రహిత జిల్లాగా తీర్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

భారత దేశం అంత్యంత వేగవంతమైన ఆర్థిక అభివృద్ధి రేటుతో ముందుకెళుతోందన్నారు. ఈ తరుణంలో మన చుట్టూ వున్న సమాజాన్ని శుచిగా ఉంచుకోవడంలో ఇంకా వెనుకబడి ఉన్నామని చెప్పుకునేందుకు వెనుకడుగు వేయాల్సి వస్తోందన్నారు. ఈ వ్యత్యాసాన్ని.. సమూలంగా మార్చేసి.. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛ సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ సంకల్పంతో ముందుకెళ్లాలన్నారు.

ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ... మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట పరిశుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా, మన జిల్లాను స్వచ్ఛమైన కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ స్వీయ స్వచ్ఛతను పాటిస్తూ.. సమాజాన్ని కూడా స్వచ్ఛంగా ఆరోగ్యవంతంగా ఉంచేలా.. చర్యకు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా స్వచ్ఛతకు మార్గదర్శకులు మహిళలే అని గుర్తు చేస్తూ.. స్వచ్ఛ సమాజాన్ని నిర్మించడంలో మహిళల పాత్ర కీలకమైనదని తెలిపారు.

జేసీ అదితి సింగ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంతటా పరిశుభ్రత మరియు పారిశుధ్యాన్ని ప్రోత్సహించడంలో జిల్లాలు, సంస్థలు మరియు వాటాదారుల ఆదర్శప్రాయమైన ప్రయత్నాలను గుర్తించడానికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు -2025 అవార్డులు అందివ్వడం గర్వకారణం అన్నారు. వివిధ స్వచ్ఛత పరమితులలో పనితీరు మరియు ఇటీవలి స్వచ్ఛతా హీ సేవా ప్రచారం మరియు నెలవారీ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం ఆధారంగా ఈ అవార్డుల ఎంపిక జరిగిందన్నారు. జిల్లా అంతటా స్వచ్ఛత హీ సేవ, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, సిబ్బంది, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు అందరికీ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ అవార్డులు జిల్లాలోని ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తాయని, భవిష్యత్తులో జిల్లాలోని అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీలు అవార్డులు అందుకుంటాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో ముందుగా అమరావతి నుండి "స్వచ్ఛ ఆంధ్రా -2025 అవార్డుల ప్రదానోత్సవం" కార్యక్రమాన్ని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడం జరిగింది. అనంతరం గౌరవ అతిధులు జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా అవార్డుల ప్రదనోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పురష్కారాలకు ఎంపికైన వారిని అభినందిస్తూ వారి సేవలను అభినందిస్తూ అందరితో ఒక్క నిమిషం పాటు కరతాళ ధ్వనులతో కృతజ్ఞతాభివందనలు తెలియజేశారు. అనంతరం అవార్డులకు ఎంపికైన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజారోగ్య శాఖల అధికారులు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ జిఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు పారమిత విద్యార్థులు




కరీంనగర్, అక్టోబర్ 7 (భారత శక్తి):పారమిత ఉన్నత పాఠ శాలలోని విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్ 17 బాలబాలికల బాక్సింగ్ చాంపియన్షిప్ పోటీలలో పారమిత విద్యార్థినిలు

ఎమ్. తనుశ్రీ 54–57 కిలోల విభాగంలో, పి.సిమ్రిత రెడ్డి 75–80 కిలోల విభాగంలో, జి. సాకేత్ రెడ్డి 75–80 కిలోల విభాగంలో బంగారు పధకాలను గెలుపొంది రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా బాక్సింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో హన్మకొండ పట్టణంలోని జె.ఎన్ స్టేడియంలోని బాక్సింగ్ హాల్ లో అక్టోబర్ 10.11.12 తేదీలలో నిర్వ హించనున్న 69వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఇనుగంటి ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్లు, ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాద్ , హనుమంతరావు, బాలాజీ, కవిత ప్రసాద్ సమన్వయకర్త శ్రీనాథ్, కోచ్ ఎ. రామకృష్ణ లు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా మహాకవి వాల్మీకి జయంతి వేడుకలు



కామారెడ్డి జిల్లా భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 07: మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాకవి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ విక్టర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "మహర్షి వాల్మీకి ఆదికవి, ఆయన రచించిన రామాయణం నిత్యనూతన గ్రంథం. ఆయన చూపిన సత్యం, ధర్మం, న్యాయం మార్గం ప్రతి మనిషి జీవనానికి మార్గదర్శకం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ, ట్రైని డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కలెక్టరేట్ ఏవో, డిఎస్సీడీవో వెంకటేష్, డిఎం డబ్ల్యూ సతీష్ యాదవ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్ , సహాయ బీసీ అభివృద్ధి అధికారి చక్రధర్ , నరేష్ , అశ్వాక్, జీవన్, శాంతయ్య, స్వామి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు:జిల్లా కలెక్టర్ ఎం. హరిత

వేములవాడ, అక్టోబర్ 07 (భారత శక్తి) :వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం విస్తరణ, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు వేస్తూ ఆలయ విస్తరణ పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. ముందుగా శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని కలెక్టర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం కళ్యాణ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు కలెక్టర్ కు ఆశీర్వచనం చేశారు. వారికి ఆలయ ఈఓ రమాదేవి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న కట్టడాల కూల్చివేత పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం విస్తరణ, అభివృద్ధిపై ఆలయ అతిథి గృహంలో వీటీఏడీఏ, ఆలయ అధికారులు, అర్చకులు,ఆర్ అండ్ బీ, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ విస్తరణ, అభివృద్ధిపై రూపొందించిన నమూనాను కలెక్టర్ కు క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి విపులంగా వివరించారు. ప్రస్తుతం ఉన్న భవనాల కూల్చివేత పనులు, ప్రణాళిక ప్రకారం చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.హరిత మాట్లాడారు.

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు, మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులకు వీటీఏడీఏ ఆద్వర్యంలో శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఆలయ విస్తరణకు పెండింగ్ లో ఉన్న పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్ కు ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రతి రోజూ ముఖ్యమేనని, ఒక్కరోజు కూడా వృథా చేయకుండా పనులు కొనసాగించాలని తెలిపారు. వచ్చే మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరకు ముందు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెలలో శృంగేరి పీఠాధిపతులు రానున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. భీమేశ్వర ఆలయంలో భక్తుల సౌకర్యార్థం అభిషేకం, అన్న పూజ, కోడె క్యూలైన్లో, కౌంటర్స్, ప్రసాదం తయారీ విభాగం ,నిత్య కళ్యాణము, సత్యనారాయణ వ్రతం మండపంతోపాటు పలు ప్రదేశాలను ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈసమావేశంలో ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, క్షేత్ర ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి, ఆర్%ఢ%బీ ఈఈ నరసింహ చారి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, వీటీఏడీఏ సెక్రటరీ అన్సార్, ఆలయ అర్చకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 07: బాల్యవివాహాలతో అమ్మాయిల జీవితాల్లో ఎన్నో అనర్థాలు వస్తాయని సాధన ఎన్జీవో జిల్లా కోఆర్డి నేటర్ గిరిజ అన్నారు. మంగళవారం కామారెడ్డి పాల్వంచ, మాచారెడ్డి మండల పరిధిలోని దేవాలయాలు, చర్చిలు, మస్జీదుల ఆవరణలోబాల్యవివాహాల నిర్మూలన బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిజ మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలో బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతిఒక్కరు సహకరించాలని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం ద్వారా అమ్మాయి జీవన విధానంలో, మానసిక స్థితిలో పరిపక్వత చెందక భవిష్యత్తులో వారి జీవితంలో ఎన్నో రకాల నష్టాలు జరుగుతాయని చెప్పారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్ల వయసు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలని స్పష్టం చేశారు. సమాజంలో బాల్య వివాహాలు జరిగితే నెం 1098, పోలీస్ శాఖ 100 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాధన సంస్థ జ్యోతి సంధ్య రాణి మమత, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛ భారత్ తోనే సమాజ శ్రేయస్సు

భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 78 సంవత్సరాలు ఐనప్పటికి' రాజ్యాంగ లక్ష్యాలు నెరవేర్చడంలో కేంద్ర' రాష్ట్ర ప్రభుత్వాలు పరిశు భ్రతకు పెద్దపీట వేశాయి. . దేశ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచంలో పారిశుధ్యం ప్రముఖ పాత్ర పోషిస్తుందని వంద సంవత్సరాల క్రితం పారిశుధ్యం' పరిశుభ్రత స్వచ్ఛత ప్రజా ఉద్యమానికి గాంధీజీ పిలుపునిచ్చారు.

**బాపూజీ ఆశయాలు అమలు కాలేదు**

ప్రజల శ్రేయస్సు' ఆరోగ్యం పరిశుభ్రతతో ముడిపడి ఉందని మహాత్ముడు చెప్పిన మాటలు నేటికీ మాటలు గానే మిగిలాయి. ఆశించనమేరకు బాపూజీ ఆశయాలు అమలుకాలేదు.

**బాపూజీ పిలుపు పాలకులకు కనువిప్పు కావాలి**

ప్రజల ఆరోగ్యం పరిరక్షించబడాలంటే ప్రతి వాడ ఇల్లు 'ఊరు 'పరిశుభ్రత' స్వచ్ఛత 'పచ్చదనాన్ని ఉద్యమంగా నిర్వహించాలన్న బాపూజీ మాటలు పాలకులకు ప్రభుత్వ అధికారులకు కనువిప్పు కావాలి.

**గాంధీజీ ఆశయాలు మరిచిపోవడంలో పోటీ**

మహాత్మా గాంధీ జయంతి వర్ధంతి సందర్భంగా గాంధీ గారి బోధనలు గుర్తు చేయడములో పోటీ పడే అధికారులు' పౌరసమాజం గాంధీ జయంతి అనంతరం మరిచిపోవడంలో అంతకంటే రెట్టింపు రేటుతో మరచిపోవడంలో పోటీ పడ డం శోచనీయం.

**గ్రామీణ పారిశుధ్యం విస్తరణ**

1981నాటికి గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు 1శాతం మాత్రమే పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేవి. వాటిని విస్తృత పరచడానికి1986 కేంద్ర ప్రభుత్వం గ్రామీణపారిశు ధ్యం కార్యక్రమాన్ని రూపొందిం చడం జరిగింది. 1999 నాటికి పారిశుధ్యం ఉద్యమంగా మారిపోయింది. ఈ ఉద్యమం నిర్మల్ భారత్ అభియాన్గా మారిపోయింది. ఇరవై ఐదేళ్ల కాలంలో ఈ కార్యక్రమం పై దాదాపు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయడంవల్ల 2012 నాటికి పారిశుధ్య సౌకర్యాలున్న గ్రామీణ కుటుంబాల సంఖ్య32.7 శాతానికి చేరడం గమనార్హం.

**స్వచ్ఛభారత్ 2014 అక్టోబర్**

2న ప్రధాన మంత్రి నరేంద్రమోడి 'స్వచ్ఛ భారత్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం వల్ల11కోట్లకు పైగా వ్యక్తిగత మరుగు దొడ్లు 2లక్షలకు పైగా కమ్యూనిటీ శానిటరీ కంప్లెక్సులు నిర్మితమైనాయి.

**తగ్గిన శిశు మరణాలు**

పారిశుధ్యం వసతులు పరిశుభ్రత మెరుగు పడడం వల్ల దేశంలో ఏడాదికి 70వేల శిశు మరణాలు తగ్గినాయని వైద్య ఆరోగ్య సర్వేలు వెల్లడించాయి. ప్రభుత్వం పారిశుధ్యం కోసం చేస్తున్న కృషిలో గణనీయమైన ప్రగతి సాధించినప్పటికి అనేక మారుమూల గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన సమస్య తీరలేదు.

**నాణ్యతలేని మరుగుదొడ్లు**

స్వచ్ఛ భారత్ కింద నిర్మితమైన మరుగుదొడ్ల నాణ్యత లోపించిందని పార్లమెంటరీ స్థాయి సంఘం విమర్శించడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో గిరిజన ప్రాంతాల్లో మరుగుదొడ్ల వాడకం పట్ల ప్రజలు మొగ్గు చూపడం లేదని. వాటి వాడకం తగ్గుతుందని ప్రపంచ బ్యాంకు అధ్యయన బృందం తెలిపింది.

**పట్టణాలలో పడకేసిన పారిశుధ్యం**

స్వచ్ఛ భారత్ లక్ష్యాలు అనుకున్న మేరకు సాదించబడలేదు. పట్టణాలలో' నగరాలలో పారిశు ధ్యం పడకేసింది. పట్టణాలలో చెత్త గుట్టలు గుట్టలుగా పోగుబడి పోతుంది. స్వచ్ఛబారత్ అర్బన్ 2.0 ఆశయాల్లో ఒకటి. 2021లో ప్రారంభమైన ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా2411 డంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు పో గైన 22.11 కోట్ల టన్నుల చెత్త పేరుకుపోయింది. ఇప్పటి వరకు9.06 కోట్ల టన్నుల వ్యర్థాలను మాత్రమే తొలగించారు.

**జల కాలుష్యం బివ్యాధుల విజృంభణ**

దేశ వ్యాప్తంగా పట్టణాలలో చెత్త సేకరణ విభజన 'పుణశుద్ధి' సక్రమంగా జరగడంలేదు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల మురుగునీరు'పారిశ్రామిక రసాయన వ్యర్థాలు నేరుగా నదుల్లో చేరడం వల్ల నదులు కాలుష్యమౌతున్నాయి. జల వనరులు కలుషితం కావడం వల్ల వ్యవసాయ పంటలు

విష పూరితమై కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతుంది. అపరిశుభ్ర పరిస్థితి వల్ల ప్రజలు అనేక వ్యాధుల బారినపడుతున్నారు .

**తగ్గుతున్న ఉత్పాదక సామర్థ్యం ఆదాయాలు**

ప్రజలు అనారోగ్యానికి గురై ఉత్పాదక సామర్థ్యం తగ్గడం వల్ల ఆదాయాలు తగ్గుతున్నాయి. కొనుగోలు శక్తి పెరగడం లేదు.

**ప్రభుత్వం అవగాహన చైతన్య సదస్సులు నిర్వహించాలి**

పారిశుధ్యం' స్వచ్ఛత' పచ్చదనం 'పరిశుభ్రత 'పర్యావరణ పరిరక్షణ 'శబ్ద కాలుష్యం 'వాయు కాలుష్యం 'నివారణ పద్ధతులపై ప్రజలకు ప్రభుత్వం అవగాహన చైతన్య సదస్సులు నిర్వహించాలి. లిస్వచ్ఛ భారత్ ప్రజా భాగస్వామ్యంలి పరిశుభ్రత ' పచ్చదనం' స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చెయ్యాలి.

**స్వచ్ఛత అవార్డులు ఇవ్వాలి**

పరిశుభ్రత 'పచ్చదనం స్వచ్ఛత లో మెరుగైన విధానాలను అవలంబించిన గ్రామాలను వార్డులును పట్టణాలకు స్వచ్ఛత అవార్డులు ఇవ్వడం ద్వారా ప్రోత్సహించాలి. లినిధులు కేటాయించాలి

పారిశుధ్య వసతుల మీద కేంద్ర: రాష్ట్ర 'స్థానిక ప్రభుత్వాలు ఎక్కువ నిధులు కేటాయించి సిబ్బందిని నియమించాలి. బహిరంగ మలవిసర్జన చేసే వ్యక్తుల సంఖ్య తగ్గించడం గృహాల సంఖ్య తగ్గించడం. గ్రామీణ సమాజాలలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం. పర్యావరణానికి సరిపోయే పారిశుధ్య పద్ధతుల ఉపయోగాన్ని ప్రోత్సాహించడం. పారిశుధ్యం కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కమ్యూనిటీ టైలెట్స్ నిర్మించడం. టాయిలెట్స్ నిర్మాణానికి ఇస్తున్న ప్రోత్సాహకాలు రూ"2000 నుండి 12000 రూ"లకు పెంచడం స్వచ్ఛత సాధనకు ఉపయోగపడే చర్యగా పేర్కొనవచ్చు. ప్రభుత్వం 'స్వచ్ఛంధ సంస్థలు ' పౌరసమాజం ఆరోగ్యం పరిశుభ్రత గురించి ప్రజల్లో ప్రచారం చెయ్యాలి. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనలో పారిశుద్యానికి ఉన్న ప్రాధాన్యతను వివరించాలి. పట్టణాలలో' గ్రామాలలో ఘన' ద్రవ్య 'వ్యర్థ పదార్థాల నిర్వహణకు నిధులు కేటాయించాలి. పారిశుధ్య వసతుల మెరుగుదలకు ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా కేంద్ర' రాష్ట్ర 'స్థానిక ప్రభుత్వాలు పరిశు భ్రత' పచ్చదనం 'స్వచ్ఛత పట్ల మరింత శ్రద్ధ పెంచి ఆరోగ్య భారత్ ఆవిర్భావానికి అంకితమవుతుందని



ఆశిద్దాం.

నేదునూరి కనకయ్య
రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక కరీంనగర్
9440245771

# శిశుమందిర్ లో ఘనంగా కోజాగరి పౌర్ణమి



కరీంనగర్, అక్టోబర్ 7 (భారత శక్తి): శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో కోజాగరి పౌర్ణమి యజ్ఞం ఘనంగా జరిగింది. ఈ యజ్ఞం లో కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, పులాల శ్యామ్, డా ఎలగందుల శ్రీనివాస్, అప్పిడి వకులా దేవి లో పాల్గొనగా శంకర్ ఆర్యన్ గావించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సముద్రాల చంద్రమౌళి మాట్లాడుతూ యజ్ఞం అనేది ఒక విశిష్టమైన హిందూ సంప్రదాయం. మనిషికి దేవతలకు మధ్య వారధిగా పనిచేస్తుంది. యజ్ఞం యొక్క ముఖ్య లక్ష్యం దేవతలకు తృప్తి కలిగించి ఆశీర్వాదాలు పొందడం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్ రావు, గట్టు శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, గోలి పూర్ణచందర్, కొత్తూరి ముకుంద%శీ%, గట్టు రాం ప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో గల ఎలక్షన్ గోడౌన్ సందర్శించిన జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ విక్టర్ తో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 07: మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా కేంద్రంలో గల ఎలక్షన్ గోడౌన్ జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్ తో కలిసి సందర్శించి ఈవీఎంలను భద్రపరిచిన గదుల వద్ద రక్షణ చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా ఈరోజు ఇవిఎం గోడౌన్ సందర్శించి రక్షణ చర్యలను పరిశీలించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా ఇవేం గోడౌన్లో సిసి కెమెరాలు 24 గంటలు పని చేసేలా చూడాలని, ఇసిఐ మార్గదర్శకాలు ప్రకారం నిరంతరం బందోబస్తు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి తాసిల్దార్ జనార్ధన్, ఎలక్షన్ డిటి తదితరులు పాల్గొన్నారు.

## కులతత్వం వద్దు మానవత్వమే ముద్దు

సమాజంలో కులమే బలం
కుట్రలు కుయుక్తులే బలగం
కుళ్ళు కుతంత్రాలే భూషణం
కులం అహంకారమే ఆస్తి
పేరాశే పెన్నిధి స్వార్థమే సన్నిధి

ఉద్రిక్తత ఉన్మాదం
ఉక్రోషం ఉరకలు వేస్తూ
హింసోన్మాదం విజృంభించి
సామాజిక అశాంతికి వేదికయ్యే
కులం కుమ్ములాటలో
ప్రేమ కరుణ దయ
వాత్సల్యం మాయమై
మతం పేరున మారణహోమాలు

కులం పేరున సమాజ విచ్ఛిన్నం
విద్వంసం జరిగి సంఘ విచ్ఛిన్నకర
శక్తులు విజృంభించి అభివృద్ధి మందగించె
అణువిస్ఫోటనం కన్న
కులవిస్ఫోటనం ప్రమాదం

చదువు వ్యక్తిలో
సంస్కారాన్ని పెంచాలి
చదువు కుల
అహంకారాన్ని తుంచాలి
చదువు కుల రహిత
సమాజ స్థాపనకు
చోదక శక్తి కావాలి

చదువు ఆత్మవిశ్వాసాన్ని
చదువు విద్యార్థిపై ఒత్తిడికి
అడ్డుకట్ట వేయాలి
చదువు పరువు హత్యలకు
చరమగీతం పాడాలి
చదువు సామాజిక సమత
సామరస్యం సంఘీభావం
సౌభ్రాతృత్వ ఐక్యత సమైక్యతకు
ఊతం కావాలి

గుణం లేని వాడు
కులం గొడుగు పడతాడు
మానవత్వంలేని వాడు మతం
ముసుగు వేస్తాడు
పస లేని వాడు ప్రాంతం ఊసు ఎత్తుతాడు
జనులంతా ఒక కుటుంభం
జగమంత ఒక నిలయం అన్న
గురజాడ జాషువా మాటల స్ఫూర్తితో
ప్రగతిశీల సమాజ
నిర్మాణంలో ప్రతి పౌరుడు
భాగస్వామి కావాలి

నేర రహిత అవినీతి
రహిత రాజకీయాలు
మొగ్గ తొడుగాలి
ఓటరు ప్రలోభాలకు
లొంగక ఉచితాలకు ఉవ్విళ్లూరక
నోటుకు ఓటును అమ్ముకోక
సమర్థులకు ప్రగతశీల
ప్రజాప్రతినిధులకు
పట్టం కట్టాలిసుపరిపాలన
బాటేయాలి మేధావులు
విద్యావంతులు యువత సంఘ
సేవకులు
మహిళలు రాజకీయాల్లో
క్రియాశీలక పాత్ర
పోషించాలి

దుర్రాజకీయాలనుజి
మట్టుపెట్టాలిజి
రాజకీయ పార్టీలు గెలుపు గుర్రాలకు
ధనికులకు
టికెట్ ఇవ్వకుండ
ధనస్వామ్యాన్ని అడ్డుకోవాలి
ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి అభ్యర్థి
సేవా గుణం
ప్రజా సంబంధాలే
టికెట్టు కెటాయింపుకు
గీటురాయి కావాలి

కులం కన్న గుణం
మిన్న అహంకారం
కన్న అభివృద్ధి
మిన్న ఆందోళన కన్న
ఆలోచన మిన్న
పలాయన వాదం వద్దు
ప్రగతిశీలత ముద్దు
కులతత్వాన్ని కూల్చుదాం
మానవత్వ పరిమళాల
పరివ్యాప్తితో మానవాభివృద్ధే
ధ్యేయంగా దేశ ప్రగతి
పురోగతికి బాటవేద్దాం
భారత్ ను" వసుదైక
కుటుంబం' స్థాయికి చేర్చుదాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
కరీంనగర్ 9440245771



# గండికోట ముంపు నిర్వాసితులకు న్యాయబద్ధమైన

## పరిహారం, పునరావాసం:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, అక్టోబర్ 7(భారత శక్తి ) : గండికోట జలాశయ నిర్వాసిత గ్రామస్తులకు పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, న్యాయబద్ధమైన పరిహారం అందించేందుకు కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు గండికోట జలాశయం ముంపు గ్రామస్తులకు పునరావసం, పరిహారం, మౌలిక సదుపాయాలు కల్పించే అంశమై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జేసీ అదితి సింగ్, ఆర్డీవో సాయిశ్రీ, ఎస్డీసిలు శాంతమ్మ, నీలమయ్య లతో కలిసి గ్రామస్తులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గండికోట రిజర్వాయర్ లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేసి జిల్లాను సస్యశ్యామలం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో అన్ని రకాల నీటి అవసరాలను తీర్చే దిశగా ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా నీటి నిల్వ సామర్థ్యం పెంపుదల విషయంలో మరికొన్ని గ్రామాలు ముంపునకు గురి కావడంతో ఆయా గ్రామస్థులకు కూడా పరిహారం, పునరావాసం కల్పించడంలో భాగంగా వివిధ దశల్లో పరిహారం, పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి నివాస గృహాలను లబ్ధిదారులకు వారి పేరుతో ధృవీకరణ, రిజిస్ట్రేషన్ చేయించి అందించేందుకు తక్షణమే చర్యలు చేపడుతామన్నారు. గండికోట నిర్వాసిత గ్రామస్తులకు పునరావాసం, పరిహారం కల్పన విషయంలో 2019, 2023 వరకు కూడా చాలా వరకు




పరిహారం అందించడం జరిగిందని, కొండాపురం నమండలంలోని ఇంకా 3 గ్రామాలకు పరిహారం అందాల్సి ఉందన్నారు. మొత్తం 22 గ్రామాల వరకు ముంపునకు కూరయ్యాయని, వారందరికీ పరిహారం, పునరావాసం కూడా కల్పించడం జరిగిందన్నారు. మొత్తం 26 పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు.

పునరావాసం కల్పించడంలో కొన్ని అంశాలు ఇంకా పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకారం అందాల్సిన పరిహారం నిధులు, పునరావాస కల్పనలో భాగంగా పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తి స్థాయిలో పనులను చేపట్టాల్సి ఉందన్నారు. అంతే కాకుండా సామాజిక, ఆర్థిక సర్వే విషయంలో కూడా పూర్తిస్థాయిలో వివరాలు అందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గండికోట పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సరిస్తోందన్నారు.

జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ అంతేకాకుండా గండికోట రిజర్వాయర్ కోసం భూములు, ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లపుడు వెన్నంటే ఉంటుందన్నారు. పునరావాస కాలనీల్లో అన్నిరకాల మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో విస్తృతమైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందేలా ప్రాజెక్టులు రానున్నాయన్నారు.

అనంతరం ముంపు గ్రామాలకు సంబంధించిన సమస్యలపై ఆయా గ్రామస్తుల నుండి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు అర్జీలను స్వీకరించారు. ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి పునరావాస గ్రామంలో స్మశానవాటిక లేక నానా అవస్థలు పడుతున్నామని పలువురు తెలిపారు. కొండాపురం మండలంలో పాఠశాల, జూనియర్ కళాశాలకు స్థలం, భవనాల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా కలెక్టర్ ను కోరారు. అలాగే దత్తాపురం పునరావాస గ్రామంలో చాలా స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, ఆలయాలను పునర్మించాలని, కొంతమందికి పరిహారం పంపిణీ కూడా పెండింగ్ లో ఉందన్నారు. ఈ సందర్భంగా పేస్-1, పేస్.2, పేస్ -3, పేస్ -4 కింద పునరావాసం కల్పించిన గ్రామాల్లో పెండింగ్ లోవున్న ప్యాకేజీ సమస్యను పరిష్కరించాలని పలువురు నిర్వాసిత గ్రామస్థులు వివిధ రకాల సమ,స్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

# గంజాయి రవాణా, సరఫరా,అమ్మకం, వినియోగం నేరం అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

## విలేకరుల సమావేశంలో సూర్యాపేట ఎస్పీ- నరసింహ

సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 7: మాదక ద్రవ్యాలలో ఒకటైన గంజాయి రవాణా చేసిన అమ్మిన వినియోగించిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ హెచ్చరించారు.మంగళవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ



కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.గత నెల 23వ తేదీన కోదాడ పట్టణ పరిధి జాతీయ రహదారి వెంబడి సుమారు 110 కేజీల గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారు. దీనిని గుర్తించిన కోదాడ పట్టణ పోలీసులు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ కేసు దర్యాప్తు కోసం మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని సీసీ ఫుటేజ్ ఆధారంగా కోదాడ పట్టణ పోలీసుల పరిధి జాతీయ రహదారిపై కట్టకమ్మ గూడెం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను గమనించి అనుమానస్పదంగా పారిపోతున్న కారును వెంబడించి పట్టుకోగా ఇందుకు సంబంధించిన వివరాలు పూర్తిగా బయటపడ్డాయని తెలిపారు. ఏ 1 ముద్దాయి కణం రమేష్ వద్ద పది కేజీల గంజాయి స్వాధీన పరచుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా ఏ 2 చాపల అశోక్ ఏ 3 చాపల ఎరుకమ్మ లను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేయగా 110 కేజీల గంజాయిని వదిలేసి వెళ్లినట్లు వీరు స్వయంగా ఒప్పుకున్నారని ఎస్పీ నరసింహ తెలిపారు. మొత్తం 120 కేజీల గంజాయి విలువ 60 లక్షలు ఉంటుందని ఈ గంజాయిని %యూా8 ఖీ=%6521 నెంబర్ గల కారులో తరలించారని ఇందులో ఎనిమిది సెల్ ఫోన్లు కూడా స్వాధీనపరుచుకున్నామని వెల్లడించారు.ఈ కేసు దర్యాప్తు చేసి చాకచక్యంతో గంజాయి ముఠాను పట్టుకున్న కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్, సీసీ ఎస్ ఎస్ఐ హరికృష్ణ పట్టణ ఎస్ఐ హనుమాన్ నాయక్ హెడ్ కానిస్టేబుల్ బాల్తు శ్రీనివాస్ కానిస్టేబుల్ ఎల్లారెడ్డి జి సతీష్ ఎం వెంకటేశ్వర్లు కే రాంబాబు ఎస్.కె ఫరీద్ లతోపాటు సిబ్బందిని ఎస్పీ నరసింహ అభినందించారు.

# మంత్రి పొన్నంను బర్తరఫ్ చేయాలి బహిరంగంగా మంత్రి అడ్లూరికి క్షమాపణ చెప్పాలి

### దళిత సంఘాల రాష్ట్ర నాయకులు, మాజీ కార్పొరేటర్ కంసాల



కరీంనగర్, అక్టోబర్ 7(భారత శక్తి):రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను దున్నపోతనీ అహంకార భావంతో అవమానపరిచిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను రాష్ట్ర మంత్రి వర్గం నుంచి బర్త్రాఫ్ చేయాలని దళిత సంఘాల రాష్ట్ర నాయకులు, మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంటనే దళిత బిడ్డ, బడుల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై వెంటనే ఉపసంహరించుకుని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సూచించారు. మంగళవారం కరీంనగర్ లో రాష్ట్ర దళిత సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాదిగ నాయకుడు అయినందునే దున్నపోతు అన్నాడనీ ఆరోపించారు. ఇది మాదిగల అందరిని అవమానపరిచిన సంఘటనగా, మాదిగ జాతి మొత్తం తీవ్రంగా పరిగణిస్తూ ఖండిస్తా ఉందన్నారు. మంత్రి అడ్లూరి బాధపడినట్లుగా కేవలం నేను మాదిగ కులం కు చెందిన నాయకుడిని కావడం వలన నన్ను ఇంత అహంభావంతో పొన్నం ప్రభాకర్ అవమానపరిచాడని, ఇంత సమయం గడిచినా కూడా ఇప్పటివరకు నాకు కనీసం ఫోన్ చేసి కూడా తను క్షమాపణ చెప్పలేదని బాధతో వీడియో రిలీజ్ చేశారని చెప్పారు. సహచర మంత్రిని అవమానపరిస్తే దళిత జాతికి సంబంధించిన మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందించలేదనీ ఆరోపించారు. సీఎం కు మాదిగల మీద ప్రేమ ఉంటే వెంటనే మంత్రి పొన్నం పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మారుముల్ల సాంబయ్య, దరిపల్లి క్రాంతి, కల్లపల్లి నవీన్, చిలుముల మంహేందర్, వడ్లూరి ప్రశాంత్, మార్త సాయి,

# మనిషికి స్వరం దేవుడిచ్చిన వరం

"మానవ స్వరం ఆత్మయొక్క అవయవం" బి హెన్రీ వార్డ్స్ వర్త్ లాంగ్ ఫెలో
మాట్లాడటం మనిషికి దేవుడిచ్చిన వరం గొప్ప వరం .విభిన్న రీతుల్లో స్వరాలు పలికించే శక్తి సమస్త జీవరాశుల్లో ఒక్క మానవునికే వుంది.మన స్వర పేటిక కేవలం మాటలకే పరిమిత%శీ% కాధు. విచారం' సంతోషం ' సంతాపం' కోపం 'శాంతం 'అసహనం 'ఆవేశం ఆక్రందన 'మొన్నగు భావోద్వేగాలను వ్యక్తం చేయటంలో స్వరమే దిట్ట.

స్వరం వరం
గాయకులు' రాజకీయనాయకులు' వ్యక్తిత్వ వికాసనిపుణులు' ఎన్నికల్లో స్టార్ కంపెనర్స్ ' మత ధార్మిక ప్రచారకులు ' వ్యాపారవేత్తలు' అధ్యాపకులు 'టివి 'ఆర్టిస్టులు 'డబ్బింగ్ ఆర్టిస్టులు' నటి నటులుస్వరంపైననేఆధారపడి జీవిస్తుంటారు.స్వరం వారికి వరం.

స్వరం ఆదాయ సృష్టి
స్వరం మంచిగా వుంటే అట్లాంటి వారికి డిమాండ్ ఎక్కువగా వుంటుంది. మనిషి స్వరం బాగుంటే తన స్వరం పెట్టుబడిగా పెడుతాడు.స్వరం ఉత్పాదక వనరుగా ఉపయోగపడి అదాయ సృష్టికిఉపకరిస్తుంది .సుస్వరమున్న గాయకులు సంగీత ప్రపంచంలో రాణించిన సంఘటనలు కోకొల్లలు వున్నాయి. ముఖ్యంగా గాయకులు' ఆంకర్లు 'డబ్బింగ్ 'ఆర్టిస్టులు ఈకోవలోకి వస్తారు. వీరి స్వరమే వీరి భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మనిషి తన గొంతుతో మాటలు పలికిస్తూ తన భావాలు ఆలోచనలు ఇతరులకు కమ్యూనికేట్ చేస్తాడు.స్వరం ప్రతి వ్యక్తి జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. తన స్వరంతో సమాజంలో గుర్తింపు పొందుతాడు. నాటి స్వాతంత్ర్య పోరాటం నుండి నేటి తెలంగాణ ఉద్యమంలో' దేశంలో జరిగిన పలు సాంఘిక సంస్కరణోద్యమాలలో గాయకులు "ధుంధాం" ద్వారా తమ స్వరంతో పాటలు పాడి ఉద్యమాలను ఉవ్వెత్తున నిర్వహించి జాతి విముక్తి ఉద్యమాల లో గురుతర బాధ్యత నిర్వహించడం గమనార్హం.

స్వరం విచరిత్ర సృష్టి
.ప్రజల స్వరం ప్రజల గొంతుకై చరిత్రను సృష్టించింది. కళాకారులు గాయకులు తన సుస్వరంతో పాటలు పాడుతూ తోటి వాళ్ళను మైమరిపిస్తుంటారు.
మనిషి గుర్తింపు లో కీలక పాత్ర పోషించే స్వరానికి వున్న ప్రాముఖ్యాన్ని బట్టి ప్రతి యేడాది ఏప్రిల్ 16 ప్రపంచ "స్వర దినోత్సవం " ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు.

స్వర దినోత్సవం చరిత్ర
స్వర దినోత్సవం జరుపాలనే ఆలోచనను బ్రెజిలియన్ వాయిస్ కేర్ నిపుణులు చేశారు. మొదటి సారి బ్రెజిలియన్ వాయిస్ డే జరిపి తర్వాత యూరప్ లోని మిగతావారిని సంప్రదించి1999 నుండి ప్రపంచ స్వర దినోత్సవం జరుపుతున్నారు. 2002 నుండి అమెరికా ప్రపంచ స్వర దినోత్సవం నిర్వహణలో బాగస్వామైంది.

2024 స్వర దినోత్సవం
థీమ్వా యిస్ ప్రచారానికి సంబంధించిన నినాదం "ప్రతి ధ్వనించండి' చదువుకోండి ' జరుపుకోండి" వృత్తి జీవితంలో స్వర ఆరోగ్య సంరక్షణ ప్రాధాన్యతేలక్ష్యంగ నిర్ణయించనైనది.
యువర్ వాయిస్ మ్యాటర్స్ అనేది ఎంపిక చేశారు.1999 నుండి ప్రత్యేక థీమ్ తో ఈ దినోత్సవం జరుపుతున్నారు.అమెరికాకు చెందిన అకాడమీ ఆఫ్ వోటరాంగోలాజి కి చెందిన వాయిస్ కమిటీ ఎంపిక చేస్తుంది.
దైనందిన జీవితంలో తోటి మనుషులతో భావాలు పంచుకోవడానికి కమ్యూనికేట్ చేయడానికి స్వరం ముఖ్య సాధనం ధూమపానం 'మద్యపానం 'శీతల పానీయాలు సేవించి దురలవాట్లతో తమ స్వరాన్ని పోగొట్టు కుంటున్నాను. గట్టిగా అరవడం వల్ల స్వర పీఠిక దెబ్బతింటుంది. ఈ రోజు స్వరం (వాయిస్ )యొక్క గొప్ప తనం వాయిస్ పరిరక్షణకు పాటించాల్సిన జాగ్రత్తలు ఆహార అలవాట్లు మొన్నగు అంశాల మీద వాయిస్ నిపుణులు వైద్యులు పరిశోధకులు వాయిస్ ఇంప్రూవ్మెంట్ గురించి ప్రచారం అవగాహన కలిగిస్తారు.

స్వర (వాయిస్)సమస్యలు పరిష్కారాలు
స్వర (వాయిస్)సమస్యల్లో ఎక్కువగా వచ్చేది బొంగురు గొంతు సరిగా కమ్యూనికేట్ చేయక పోవడం .మాటలు మధ్యలో ఆగిపోవడం తత్తర పడటం కీచు గొంతు రావడం గాయకుల్లో పాడేటపుడు గొంతు జీరపోవడం ఉచ్ఛ స్థాయిలో పాడక పోవడం ఎక్కువ టైం స్వరాన్ని స్థిరంగా నిలపక పోవడం. స్వర మార్గం సన్నబడడం .స్వర నాడుల మధ్య పొరలు ఏర్పడడం. మొదలగు సమస్యలు వస్తాయి. 6 యేళ్ల నుండి 14 ఏళ్ల.మధ్య వయసు వున్న పిల్లల్లో గొంతు బొంగురు పోవడం యుక్త వయసు వారిలో మగ.వారిలో ఆడ గొంతు ఆడవారిలో మగ గొంతు ఏర్పడుతుంది కొన్ని హార్మోన్స్ ప్రభావం.వల్ల వస్తె మరికొన్ని ఇన్ఫెక్షన్స్ వల్ల. స్వరంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని వైద్య ఆరోగ్య సర్వేలు వెల్లడిస్తున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ
ప్రపంచ ఆరోగ్య సంస్ధ సూచనల ప్రకారం మూడు వారాల కంటే ఎక్కువ బొంగురు గొంతు వుంటే క్యాన్సర్ గా అనుమానించాలి అని విధ్య సర్వేలు చెబుతున్నాయి.

స్వర సంరక్షణ జీవన శైలి కావాలి
50 నుండి 65 శాతం స్వర సమస్యలను వాయిస్ తెరఫీద్వారా నయం చేసే వీలు ఉంటుంది. స్వర సమస్యలు రాకుండా వుండాలంటే గట్టిగా కేకలు వేయడం మానాలి.గుట్కా 'ఖైనీ 'తంభాకు'పొగాకు నమలడం మద్యపానం " ధూమపానం గొంతును ప్రభావితం చేసే శీతల పానీయాల లాంటివి సేవించరాదు . కాఫీలకు మొదలగువాటికి దూరంగా వుండాలి .నీరు ఎక్కువ మోతాదులో తీసుకోవాలి.
అతిశీతల ఉష్ణోగ్రతలకు దూరంగా వుండాలి. స్వర సంరక్షణ జీవన శైలి లో అంతర్భాగం కావాలి. ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ పౌష్ఠికాహారంతో సంపూర్ణ ఆరోగ్యవిధానాల పట్ల ప్రభుత్వం' పౌరసమాజం' స్వచ్ఛంద 'సాంస్కృతిక సంస్థలు ప్రజల్లో నిత్య యోగ ధ్యానం నడక క్రమశిక్షణ గల



ఉత్తమ జీవన శైలి పట్ల అవగాహన కలిగించాలి. ఆరోగ్య అక్షరాస్యత' జాతీయ ప్రత్యామ్నాయ వైద్య విధానాలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ప్రజల్లోఆరోగ్య సూత్రాల పై అవగాహన కల్పిస్తూ పాజిటివ్ దృక్పథ పరివ్యాప్తిలో సంగీత ' సాంస్కృతిక 'సంస్థలు క్రియాశీలక పాత్ర పోషించాలి.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ వికాస వేదిక
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
కరీంనగర్ 9440245771

# మహిళా ఆటో డ్రైవర్లు ఆదర్శంగా నిలవాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, అక్టోబర్ 7 (భారత శక్తి): మహిళా ఆటో డ్రైవర్లు ఆర్థిక సాధికారత సాధించి తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.

మంగళవారం దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా, శిశు వికాస కేంద్రంలో ఎలక్ట్రిక్ ఆటో డ్రైవింగ్ లో శిక్షణ పొంది ఉపాధి పొందుతున్న మహిళలతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు విభిన్న రంగాలలో రాణించాలని, స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక సాధికారత సాధించాలన్న ఉద్దేశంతో ఆటో డ్రైవింగ్ లో ఉచిత శిక్షణ ఇచ్చామని అన్నారు. అంతేకాకుండా వారికి ఉచితంగా ఆటోలు అందజేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళా ఆటో డ్రైవర్లు ఉపాధి పొందాలని పేర్కొన్నారు. ఆటోలను కుటుంబ సభ్యులకు, ఇతరులు ఎవరికీ ఇవ్వరాదని అన్నారు. ఆటోలు కేటాయించిన మహిళలే నడుపుతూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ సమావేశంలో మహిళా ప్రాంగణం మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

బంధువుల నుండి చట్టబద్ధమైన దత్తతమహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన పిల్లలు లేని దంపతులు వారి రక్తసంబంధీకుల నుండి చట్టబద్ధమైన దత్తత తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి దత్తత ఉత్తర్వులను తల్లిదండ్రులకు అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ దత్తత కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత మాత్రమే తీసుకోవాలని అన్నారు. బంధువులు, రక్తసంబంధీకుల నుండి దత్తత తీసుకోదలిస్తే జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, కరీంనగర్ లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, శిశుగృహ మేనేజర్ తేజస్విని, ఎల్.సి.పి.ఓ రాజు పాల్గొన్నారు.ఘనంగా మహర్షి వాల్మీకి జయంతికలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో పాటు ఉన్నతాధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదర్శమైన రామాయణం రచించిన వాల్మీకి సత్యం, ధర్మం, న్యాయం, సేవా వంటి విలువలను సమాజానికి చాటి చెప్పారని అన్నారు. సంస్కృత సాహిత్యంలో అయన సేవను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, డీఆర్ఓ బి.వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఏవో సుధాకర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అలనాటి బాలీవుడ్

## నటి సంధ్యా శాంతారామ్ కన్నుమూత



అలనాటి బాలీవుడ్ నటి, ప్రముఖ దర్శక, నిర్మాత వి.శాంతారామ్ భార్య సంధ్యా శాంతారామ్ (94) కన్నుమూశారు. వయసు సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా ఆమె శనివారం తుది శ్వాస విడిచారు. సంధ్య హిందీతోపాటు పలు మరాఠీ చిత్రాల్లోనూ నటించారు. 'అమర్ భూపాలి', 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే', 'నవరంగ్', 'పింజారా', 'దో ఆంఖ్ బారా హాత్', 'తీన్ బత్తీ చార్ రస్తా', 'స్త్రీ' వంటి అనేక క్లాసిక్ చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించారు. అమె అద్భుతమైన నటన, ప్రేక్షకులను మంత్ర ముగ్ధలను చేసే నృత్య ప్రదర్శనలతో భారతీయ సినిమాలలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నారు. తన భర్త శాంతారామ్ దర్శకత్వంలోనే ఆమె చాలా చిత్రాల్లో నాయికగా నటించడం విశేషం. అంతేకాదు సంధ్యని వెండితెరకు పరిచయం చేసింది కూడా ఆయనే. 1951లో 'అమర్ భూపాలి' చిత్రం కోసం కొత్త నాయికల కోసం చూస్తున్న తరుణంలో సంధ్య ఫొటోలను చూసి, ఎంపిక చేశారు. ఆ సినిమాతో ప్రారంభమైన వీరి స్నేహం..వివాహ బంధంలోకి అడుగు పెట్టేలా చేసింది. సంధ్య మృతి పట్ల బాలీవుడ్ దర్శకుడు మధుర్ భండార్కర్ ఎక్స్ వేదికగా లెజెండరీ నటి సంధ్యా శాంతారామ్‌జీ మరణం భాదాకరమని, ఆమె నటించిన చిత్రాలలోని ఐకానిక్ పాత్రలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొంటూ నివాళు లర్పించారు.

# 'కాంతార చాప్టర్ 1'కు స్టార్ క్రికెటర్ ఫిదా..

## రిషబ్‌పై ప్రశంసలు



రిషబ్ శెట్టిస్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాంతార చాప్టర్ 1'. దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమాపై సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మైథలాజికల్ ఫిల్మ్‌కు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ) ఫిదా అయ్యారు. తన ఇన్‌స్టా స్టోరీలో దీనిపై పోస్ట్ పెట్టారు.

"కాంతార చాప్టర్ 1 చూశాను. మరోసారి రిషబ్ తన ప్రతిభతో మేజిక్ చేశారు. మంగుళూరు ప్రజల నమ్మకాన్ని తెరపై అద్భుతంగా చూపించారు" అని కేఎల్ రాహుల్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు కాంతార టీమ్ (%ఖుఉ్ఖుతీఖు జఖ్త్రుజూవతీ%1) స్పందించింది. ఇది చూశాక ఎంతో గర్వంగా ఉందని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇది టీమ్ అందరికీ నిజంగా విన్నింగ్ మూమెంట్ అని పేర్కొంది. కేఎల్ రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపింది.

కేఎల్ రాహుల్ తనకు 'కాంతార' సినిమా అంటే ఎంతో ఇష్టమని ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించిన తర్వాత రాహుల్ చేసుకున్న సెలబ్రేషన్స్ నెట్టింట వైరల్ అయ్యాయి. దీనిపై కేఎల్ స్పందిస్తూ.. "మ్యాచ్ గెలిచాక సెలబ్రేషన్స్ నా ఫేవరెట్ సినిమాల్లో ఒకటైన 'కాంతార' స్ఫూర్తితో చేశాను. నేను ఇక్కడ ఆడుతూ పెరిగాను అని చెప్పడం నా సెలబ్రేషన్స్ ఉద్దేశం" అని తెలిపారు.

# 'ఐరన్‌మ్యాన్' అంబాసిడర్‌గా సయామీ ఖేర్



సినిమాల్లో నటనతో అదరగొడుతూనే.. అవకాశం వచ్చినప్పుడల్లా క్రీడల్లోనూ తమ ప్రతిభను నిరూపించుకుంటారు కొందరు సినీతారలు. ఇటీవలే తక్కువ సమయంలో రెండు సార్లు ట్రయథ్లాన్‌ను పూర్తి చేసిన తొలి భారతీయ నటిగా బాలీవుడ్ నాయిక, అథ్లెట్ సయామీ ఖేర్ రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమెకు ఓ అరుదైన గౌరవం దక్కింది. నవంబరు 9న గోవాలో జరగనున్న 'ఐరన్‌మ్యాన్ 70.3' ట్రయథ్లాన్‌కు అంబాసిడర్‌గా ఎంపికయ్యింది సయామి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఐరన్ మ్యాన్ ఇండియాకు ప్రతినిధిగా ఉండటం నాకు గౌరవంగా, ఉత్సాహంగా ఉంది. 'ఐరన్‌మ్యాన్' పోటీ మాత్రమే కాదు. అదొక జీవన విధానం. నా ప్రయాణం భారతీయ మహిళలు క్రీడల్లోకి వచ్చేందుకు స్ఫూర్తిగా నిలుస్తుందని కోరుకుంటున్నా" అని చెప్పింది. 'ఐరన్‌మ్యాన్ 70.3' పోటీని 'ప్రపంచ ట్రయథ్లాన్ కార్పొరేషన్' నిర్వహిస్తుంది. ఇందులో ఈత(1.9కి.మీ), సైక్లింగ్ (90కి.మీ), పరుగు (21.1కి.మీ) పోటీల్లో వరుసగా పాల్గొనాల్సి ఉంటుంది.

**"ఐరన్ మ్యాన్ ఇండియాకు ప్రతినిధిగా ఉండటం నాకు గౌరవంగా, ఉత్సాహంగా ఉంది. 'ఐరన్‌మ్యాన్' పోటీ మాత్రమే కాదు. అదొక జీవన విధానం.**

# గుడ్ న్యూస్ చెప్పిన లేడీ కమెడియన్..

## రెండో సారి అంటూ..



లేడీ కమెడియన్ భారతీ సింగ్ గుడ్ న్యూస్ చెప్పింది. తాము మరోసారి ప్రెగ్నెంట్ అయ్యామంటూ భర్తతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేసింది. ఈ క్రమంలో బేబీ బంప్‌ను చూపించింది. కాగా భారతీ సింగ్‌కు ఇప్పటికే ఓ కొడుకు ఉండగా.. రెండోసారి ఈ విషయాన్ని ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు కుటుంబీకులు. తల్లి, బిడ్డ సుఖంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఎలాంటి దిష్ట తగలకుండా ఉండాలని దేవుడిని ప్రార్థిసున్నారు. ఇక చిన్నప్పుడు తల్లి ఇండ్లలో పని చేసి తమను పెంచిందని.. తమను అంటరానివారిగా చూసే వారని.. ఓ ఇంటర్వ్యూలో చెప్పిన భారతి.. ఈ స్థాయిలో ఎదిగేందుకు కారణం చిన్నప్పటి జీవితమేనని చెప్పింది. తినడానికి తిండి కూడా లేని రోజులు గడిపామని.. ఇళ్లలో పండుగ రోజు మిగిలిపోయిన ఐటెమ్స్ తమకు పంచభక్ష పరమాన్నాలని ఎమోషనల్ అయిపోయింది.

# యూరప్‌కు రాజాసాబ్



'ది రాజాసాబ్'గా సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు ప్రభాస్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మారుతి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తోంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్ దత్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఈ వారం నుంచి యూరప్‌లో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనుంది. దీనికోసం చిత్ర బృందం ఇప్పటికే అక్కడికి చేరుకుంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా నాయకానాయికలపై రెండు పాటలు చిత్రీకరించనున్నారు. ఇక మరోవైపు ఈ చిత్ర నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రొమాంటిక్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ రెండు కోణాలున్న పాత్రలో అలరించనున్నారు. ఇది వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు

# హారర్ కామెడీ చిత్రంలో యామి?



ఈ మధ్యకాలంలో 'ఆర్టికల్ 370', 'ఓఎమ్‌జీ 2' లాంటి శక్తిమంతమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంది బాలీవుడ్ నాయిక యామీ గౌతమ్. త్వరలో 'హక్' అనే చిత్రంతో తెరపైకి రాబోతున్న ఆమె.. ఇప్పుడు మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రముఖ దర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్ 'నయీ నవేలి' అనే సినిమాని తెరకెక్కిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికగా యామిని ఎంపిక చేసిందట చిత్రబృందం. "భారతీయ జానపద కథలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్న హారర్ కామెడీ చిత్రమిది. మొదట్లో ఇందులో హీరోయిన్‌గా కృతి సనన్‌ని అనుకున్నారు. కొన్ని కారణాలతో ఆమె స్థానంలో యామిని తీసుకున్నారు. సవాలుతో కూడిన ఈ పాత్రకు యామి మాత్రమే సరిగ్గా సరిపోతుందని ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ సినిమా ఈ ఏడాది ఆఖర్లో సెట్స్‌పైకి వెళ్లనుంద"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# గృహిణులమని గర్వంగా చెప్పండి: అమితాబ్ బచ్చన్



బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరించే కౌన్ బనేగా కరోడ్ పతి (కేబీసీ). తాజాగా ఈ కార్యక్రమంలో అమితాబ్ మహిళను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇంటిని చక్కబెట్టడం ఎంత కష్టమో పురుషులందరికీ కొవిడ్ సమయంలో అర్థమైందన్నారు. "ఈ కార్యక్రమానికి వచ్చిన చాలామంది మహిళలను మీరు ఏం చేస్తుంటారని అడిగినప్పుడు.. 'నేను గృహిణిని' అని చిన్నగా చెబుతారు. అదేం తప్పు కాదు.. గర్వంగా, పెద్దగా చెప్పాల్సిన విషయం. ఒక ఇంటిని చక్కబెట్టే యజమానిగా గర్వపడాల్సిన విషయమది. భర్త, పిల్లలు, అందరికీ వంట చేయడం, వేళకు అన్ని పనులు చేయడం అంత తేలికైన పనికాదు. కొవిడ్ సమయంలో పురుషులు చాలామందికి ఈ విషయం అర్థమైంది. లాక్‌డౌన్ కారణంగా ఇంట్లో ఉన్నవారికి ఆ పనులు చేయడం ఎంత కష్టమో తెలిసింది" అని బిగ్ బీ అన్నారు. అమితాబ్ మాటలకు వేదిక మొత్తం చప్పట్లతో మారుమోగింది. భారత్ జట్టును అభినందించిన అమితాబ్..మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత్ సత్తా చాటిన విషయం తెలిసిందే. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 88 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. మ్యాచ్ అనంతరం అమితాబ్ భారత్ జట్టును అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'భారతదేశానికి వీళ్లు అతిపెద్ద సంపద' అని అభినందించారు.

# 'కాంతార చాప్టర్ 1'కు స్టార్ క్రికెటర్ ఫిదా.. రిషబ్‌పై ప్రశంసలు



: రిషబ్ శెట్టి () స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాంతార చాప్టర్ 1'. దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాపై సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మైథలాజికల్ ఫిల్మ్‌కు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ( ఫిదా అయ్యారు. తన ఇన్‌స్టా స్టోరీలో దీనిపై పోస్ట్ పెట్టారు.

"కాంతార చాప్టర్ 1 చూశాను. మరోసారి రిషబ్ తన ప్రతిభతో మేజిక్ చేశారు. మంగుళూరు ప్రజల నమ్మకాన్ని తెరపై అద్భుతంగా చూపించారు" అని కేఎల్ రాహుల్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు కాంతార టీమ్ స్పందించింది. ఇది చూశాక ఎంతో గర్వంగా ఉందని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇది టీమ్ అందరికీ నిజంగా విన్నింగ్ మూమెంట్ అని పేర్కొంది. కేఎల్ రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపింది.

కేఎల్ రాహుల్ తనకు 'కాంతార' సినిమా అంటే ఎంతో ఇష్టమని ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించిన తర్వాత రాహుల్ చేసుకున్న సెలబ్రేషన్స్ నెట్టింట వైరల్ అయ్యాయి. దీనిపై కేఎల్ స్పందిస్తూ.. "మ్యాచ్ గెలిచాక సెలబ్రేషన్స్ నా ఫేవరెట్ సినిమాల్లో ఒకటైన 'కాంతార' స్ఫూర్తితో చేశాను. నేను ఇక్కడ ఆడుతూ పెరిగాను అని చెప్పడం నా సెలబ్రేషన్స్ ఉద్దేశం" అని తెలిపారు.

# రహస్యంగానే విజయ్ దేవరకొండ, రష్మిక..

## కారణం ఏంటి?




సెలబ్రిటీల ఇంట్లో పెళ్లి అంటే సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతుందనే విషయం తెలిసిందే. రీసెంట్‌గా అక్కినేని నాగార్జున కుటంబంతో పాటు అల్లు అరవింద్ ఫ్యామిలీ నుంచి కూడా శుభవార్తలు విన్నాం. అయితే, తాజాగా విజయ్ దేవరకొండ రష్మికలు నిశ్చితార్థం చేసుకున్నారు. ఇదే విషయాన్ని వారి సన్నిహిత వర్గాలు కూడా చెబుతున్నాయి. సోషల్‌మీడియాలో అయితే, పాన్ ఇండియా రేంజ్‌లో ఈ వార్తలు వైరల్ అయ్యాయి. కానీ, ఈ జోడీ మాత్రం తమకు ఏమ్ తెలియనట్లు సైలెంట్‌గా ఉంది. గతంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ ఐశ్వర్యరాయ్, దీపికా పదుకొణెలతో పాటు చాలామంది సెలబ్రిటీలు తమ పెళ్లి సందర్భం వచ్చినప్పుడు తమ అభిమానులతో పంచుకున్నారు. నేటి ప్రపంచంలో ఎవరూ కూడా తమ ప్రేమ,పెళ్లి విషయాల్ని దాచుకోవడం లేదు. సమయం వచ్చినప్ప?డు చెప్పేస్తున్నారు. విజయ్ దేవరకొండ, రష్మికల నిశ్చితార్థం గురించి సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. మిలియన్ల కొద్ది శుభాకాంక్షలు చెబుతున్నారు. కానీ, ఈ జంట మాత్రం ఇలాంటి సమయంలో చాలా గుంభనంగా ఉంది. కనీసం ఇవన్నీ రూమర్స్ మాత్రమే అని కూడా వారు తమ అభిమానులకు చెప్పలేదు. నిజమే అయితే, కనీసం తమ ఫ్యాన్స్‌కు కూడా చెప్పకుండా ఇలా చేయడం ఏంటి అంటూ కామెంట్లు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఇద్దరూ ఒక లోకేషన్‌లో కనిపించడం చూశాం. విజయ్ ఇంట్లో రష్మిక ఫోటోలు దిగడం, పుట్టినరోజు సమయంలో ఒకే ప్రదేశానికి వెకేషన్ ప్లాన్ చేయడం వంటి సందర్భాలు ఉన్నాయి. అవన్నీ కూడా పలు ఫోటోలతో అభిమానులే డీకోడ్ చేశారు. ప్రేమ విషయాన్ని రహస్యంగా దాచారంటే తప్పులేదు. కానీ, నిశ్చితార్థం విషయాన్ని కూడా అంత సీక్రెట్‌గా ఉంచడం ఎందుకు అనే సందేహం అందరిలో వస్తుంది. రష్మిక రీసెంట్‌గా తన కొత్త సినిమా విడుదల తేదీ ప్రకటించింది కానీ నిశ్చితార్థం గురించి మాత్రం చెప్పలేదు. ఇలాంటి విషయాల్లో ఇంత రహస్యం అవసరమా అంటూ నెటిజన్లు పేర్కొంటున్నారు.

## రతితో ప్రేమలో పడేందుకు సిద్ధంగా ఉండండి..

# 'మాస్క్' మూవీ అప్డేట్ ఇచ్చిన రుహాని శర్మ

యంగ్ హీరో కవిన్‌విభిన్న కథలు ఎంచుకుంటూ వరుస సినిమాలు అనౌన్స్ చేస్తున్నాడు. ఇటీవల 'కిస్' అంటూ లవ్ చిత్రంతో వచ్చి ప్రేక్షకులను అలరించాడు. కానీ హిట్ అందుకోలేకపోయాడు. ప్రస్తుతం కవిన్ 'మాస్క్' మూవీ పనులో ఫుల్ బిజీ అయిపోయాడు. ఈ సినిమాకు వి.కర్ణన్ అశోక్( దర్శకత్వం వహిస్తున్నారు. గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీ, బ్లాక్ మద్రాస్ ఫిలిమ్స్ బ్యానర్స్‌పై ఎస్పీ చొక్కలింగం, వెట్రిమారన్ నిర్మిస్తున్నారు. ఇందులో కవిన్ సరసన ఆండ్రియా జెరెమియారు హాని శర్మ హీరోయిన్లుగా నటిస్తుండగా.. కార్లీ, బాల శరవణన్, విజె అర్చన చందోక్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న 'మాస్క్' అక్టోబర్ 31నథియేటర్స్‌లో విడుదల కానుంది. దీంతో చిత్ర బృందం మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేశారు. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్‌ను విజయ్ సేతుపతి చేతుల మీదుగా లాంచ్ చేయించారు. ఈ విషయాన్ని తెలుపుతూ రుహాని శర్మ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. "రతి ప్రపంచంలోకి అనుమతిస్తున్నాను. హృదయం నుంచి నేరుగా ఒక భాగం. ఆమెను కలవడానికి, అనుభూతి చెందడానికి సిద్ధంగా ఉండండి. మీరు



రతితో ప్రేమలో పడటాన్ని చూసేందుకు నేను వేచి ఉండలేకపోతున్నాను" అనే క్యాప్షన్ జత

# ‘థాంక్యూ.. రింకూ భయ్యా’



ఆసియా కప్‌లో ) పాకిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్‌లో విన్నింగ్ షాట్ కొట్టిన రింకూ సింగ్ . తన సోదరి నేహాకు స్కూటీని బహుమతిగా ఇచ్చాడు. అతడు ఆసియా కప్‌లో ఒకేఒక మ్యాచ్.. ఒకే ఒక బంతిని ఆడాడు. ఆ బంతినే బౌండరీకి తరలించిన విషయం తెలిసిందే. ఆసియా కప్ విక్టరీ తర్వాత కొన్ని రోజులకు అతడు తన సోదరికి దాదాపు రూ.లక్ష విలువైన స్కూటీని బహుమతిగా అందించాడు. ఈ విషయాన్ని అతడి సోదరి నేహా ఇన్‌స్టా వేదికగా తెలిపింది. ఫొటోలను తన ఫాలోవర్స్‌తో పంచుకుంది. అలాగే ఆ పోస్ట్‌కు ‘థాంక్యూ రింకూ భయ్యా’ అని క్యాప్షన్ ఇచ్చింది. రింకూ సింగ్ నవంబర్ 2024లో అలీఘడ్‌లో మూడంతస్థుల లగ్జరీ ఇంటిని కొనుగోలు చేశాడు. దాని విలువ సుమారు 3.5 కోట్లు. ఆ ఇంటికి వీణా ప్యాలస్ అని తన తల్లి పేరు పెట్టాడు. అప్పట్లో వరుసగా అయిదు సిక్స్‌లతో ఫేమస్ అయిన రింకూ సింగ్.. ఇటీవల ఆసియా కప్‌లో విన్నింగ్ షాట్ కొట్టి మరోసారి వార్తల్లో నిలిచాడు.



# ఆస్ట్రేలియా స్క్వాడ్ ప్రకటన.. కెప్టెన్ మిచ్ మార్ష్

టీమ్ఇండియా అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఇందులోభాగంగా ఇరు జట్లు మూడు వన్డేలు, అయిదు టీ20లు ఆడనున్నాయి. టీ20 మ్యాచ్‌లు అక్టోబర్ 29 నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి టీమ్ఇండియా స్క్వాడ్‌ను ఇదివరకే బీసీసీఐ ప్రకటించింది. తాజాగా తమ వన్డే, టీ20 స్క్వాడ్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది.

వన్డే జట్టు: మిచ్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బ్రాట్‌లెట్, అలెక్స్ కేరీ, కూపర్ కానెల్లీ, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మిచెల్ ఓవెన్, మాథ్యూ రెన్‌షా, మ్యాట్ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా

టీ 20 జట్టు: మిచ్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబోట్, జేవియర్ బ్రాట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, మిచెల్ ఓవెన్, మ్యాట్ షార్ట్, మార్కస్ స్టాయినిస్, ఆడం జంపా

గాయం వల్ల పాట్‌కమిన్స్ ఈ సిరీస్‌లో ఆడటం లేదు. ఇటీవల నెట్స్‌లో గాయపడిన మ్యాక్స్‌వెల్ కూడా అందుబాటులో లేదు. అతడు బిగ్ బాష్ లీగ్‌తో పునరాగమనం చేసే అవకాశం ఉంది. అలాగే ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ 2023 నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన లబుషేన్‌ను జట్టు నుంచి తప్పించారు. అతడు ఫామ్‌లో లేకపోవడమే దీనికి కారణం.



# రో-కోను వన్డే వరల్డ్ కప్‌లో ఆడించకపోతే అది పెద్ద తప్పిదమే

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లిని .. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ) వన్డే వరల్డ్ కప్ 2027లో ఆడించాలి. లేకపోతే అది పెద్ద తప్పిదమే అవుతుందని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అభిప్రాయపడ్డాడు. అలాగే గౌతమ్ గంభీర్ కోచ్‌గా వచ్చినప్పటి నుంచే జట్టుకు సీనియర్ ఆటగాళ్లు దూరమవుతున్నారన్నాడు. తన నిర్ణయాలకు అడ్డు లేకుండా ఉండటం కోసమే గౌతమ్ గంభీర్.. అశ్విన్, రోహిత్, విరాట్‌ను జట్టులో లేకుండా చేశాడని మనోజ్ తివారీ సంచలన ఆరోపణలు చేశాడు.గత సంవత్సరం భారత్, ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే రవిచంద్రన్ అశ్విన్ ) అంతర్జాతీయ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు. అలాగే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి.. మే 2025లో ఒకరి తర్వాత మరొకరు కొన్ని రోజుల వ్యవధిలో టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. వీరిద్దరూ ఇంతకుముందే టీ20లకు రిటైర్మెంట్ ఇచ్చారు. ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు.

‘ఒకవేళ జట్టులో సీనియర్ ఆటగాళ్లైన అశ్విన్, రోహిత్, విరాట్ కోహ్లి ఉంటే.. కోచ్‌గా గౌతమ్ గంభీర్ తీసుకున్న ఏదైనా నిర్ణయాన్ని తమకు నచ్చకుంటే వారు ప్రశ్నించే అవకాశం ఉంది. వారు లేకుంటే ఈ సమస్యే రాదుగా. గౌతమ్ గంభీర్ హెడ్‌కోచ్‌గా వచ్చినప్పటినుంచి చాలా వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇది భారత క్రికెట్‌కు అంత మంచిది కాదు. గంభీర్ కోచ్‌గా వచ్చిన తర్వాతే అశ్విన్, రోహిత్, విరాట్ తమ రిటైర్మెంట్లు ప్రకటించారు. ఊహించనివిధంగా పలువురు ఆటగాళ్లు స్క్వాడ్‌లోకి, తర్వాత నేరుగా తుది జట్టులోకి వస్తున్నారు’ అని మనోజ్ తివారీ ఆరోపించాడు.

**కోచ్‌గా గౌతమ్ గంభీర్ తీసుకున్న ఏదైనా నిర్ణయాన్ని తమకు నచ్చకుంటే వారు ప్రశ్నించే అవకాశం ఉంది. వారు లేకుంటే ఈ సమస్యే రాదుగా. గౌతమ్ గంభీర్ హెడ్‌కోచ్‌గా వచ్చినప్పటినుంచి చాలా వివాదాలు చోటు చేసుకుంటున్నాయి.**

‘రోహిత్, విరాట్ కోహ్లి జట్టు కోసం ఎంతో చేశారు. కానీ ప్రస్తుతం వారిని ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఒకవేళ వారిద్దరినీ వన్డే వరల్డ్ కప్ 2027లో కోచ్ గౌతమ్ గంభీర్ ఆడించకుంటే.. అది పెద్ద తప్పిదమే అవుతుంది. తమ గౌరవానికి భంగం కలుగుతోందని భావిస్తే రోహిత్, విరాట్.. డ్రెస్సింగ్ రూంలో ఉండటానికి ఇష్టపడరు. బహుశా వారు రిటైర్ కావొచ్చు. కానీ అలా జరగొద్దని, వారు ఇంకా ఆడాలని నేను కోరుకుంటున్నా. గౌతమ్ గంభీర్ కూడా ఈ విషయంలో వెనకడుగు వేస్తాడు. ఎందుకంటే వైట్ బాల్ క్రికెట్‌లో రో-కో అద్భుతమైన ఆటగాళ్లు’ అని మనోజ్ తివారీ విశ్లేషించాడు.

# రవీంద్ర జడేజాను అదనపు లగేజీగా చూస్తున్నారా?: టీమ్ఇండియా మాజీ క్రికెటర్



ఢిల్లీ: టీమ్ఇండియా ) అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఈనేపథ్యంలో మూడు వన్డేలు, అయిదు టీ20లు ఆడనుంది. దీనికి సంబంధించి బీసీసీఐటీవలే స్క్వాడ్‌ను ప్రకటించింది. అయితే వన్డే జట్టులో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు() చోటు కల్పించలేదు. అటు బ్యాట్‌తోనూ, ఇటు బంతితోనూ అద్భుతంగా రాణిస్తున్న రవీంద్ర జడేజాను ఎంపిక చేయకపోవడాన్ని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సడగోపన్ రమేశ్ తప్పుబట్టాడు. అతన్ని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అదనపు లగేజీగా చూస్తున్నారా.. అంటూ ప్రశ్నించాడు‘ఛాంపియన్స్ ట్రోఫీకి మేం అదనపు స్పిన్నర్లను తీసుకున్నాం.. కాబట్టి జడేజా టీమ్‌లో ఉన్నాడని సెలక్టర్ అగార్కర్ చెబుతున్నారు. అంటే రవీంద్ర జడేజాను అదనపు లగేజీగా చూస్తున్నారా? అతడో వైట్‌బాల్ లెజెండ్. మీకు అదనపు స్పిన్నర్లు అవసరమైతేనే అతన్ని జట్టులోకి తీసుకుంటారా? శుభ్‌మన్ గిల్‌ను టీ20 జట్టుకు వైస్ కెప్టెన్, వన్డే జట్టుకు కెప్టెన్‌గా చేయడానికి మీరిచ్చిన సమాధానం.. అతడు ఇంగ్లాండ్ టూర్‌లో రాణించాడని. ఆ పర్యటనలో రవీంద్ర జడేజా కూడా అద్భుతమైన ప్రదర్శనలే చేశాడు’ అని సడగోపన్ రమేశ్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా ప్రశ్నలు సంధించాడు.

## నాన్ కెప్టెన్ రోహిత్...

# మునుపటి ‘హిట్ మ్యాన్’ని చూపిస్తాడా?

రోహిత్ శర్మ డేంజరస్ బ్యాటర్. ఇది అందరూ చెప్పేమాట. ఓ బౌలర్.. ‘హమ్మయ్య.. ఈ బంతిని బాగా వేశాను’ అనుకునేలోపే ఆ బాల్‌ని స్టాండ్స్‌లోకి పంపి, నెక్స్ట్ ఏంటి.. అని ప్రశ్నించే రకం. మిగతా బ్యాటర్లు బౌన్సర్లకు ఇబ్బందిపడితే.. రోహిత్ దగ్గర దానికీ సిక్స్ రూపంలో ఆన్సర్ ఉంది. అందుకే అతడు ‘హిట్ మ్యాన్’ అనే పేరు సంపాదించాడు. మరిప్పుడు రోహిత్ నాన్ కెప్టెన్‌గా ఏం చేస్తాడు? పాత రోహిత్ బయటకు వస్తాడా? టీమ్ఇండియా ) వన్డే చరిత్రలో ఓ అధ్యాయం ముగిసింది. భారత క్రికెట్‌లో విజయవంతమైన కెప్టెన్‌గా పేరుగాంచిన రోహిత్ శర్మను ) భవిష్యత్తు అవసరాల దృష్ట్యా.. వన్డే కెప్టెన్సీ నుంచి బీసీసీఐ తప్పించింది. ఆ బాధ్యతను టీమ్ఇండియా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు అప్పగించింది. రోహిత్ సారథ్యంలో భారత్.. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ వరకు వెళ్లింది.




ఛాంపియన్స్ ట్రోఫీని ) కైవసం చేసుకుంది. రెండుసార్లు ఆసియా కప్ (2018, 2023) సొంతం చేసుకుంది. ఈనేపథ్యంలో.. వచ్చే వన్డే ప్రపంచకప్ (2027) వరకూ రోహిత్ శర్మను కొనసాగిస్తే బాగుంటుందనే అభిప్రాయం అతడి అభిమానుల నుంచి వ్యక్తమవుతోంది. కానీ బీసీసీఐ అనూహ్య నిర్ణయంతో కెప్టెన్సీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

కెప్టెన్‌గా తనదైన ముద్రటీమ్ఇండియా వన్డే కెప్టెన్‌గా రోహిత్ తనదైన ముద్ర వేశాడు. 2017 నుంచి 2025 (అక్టోబర్ 4) వరకు వన్డే జట్టు కెప్టెన్‌గా కొనసాగాడు. అతడి సారథ్యంలో 56 వన్డే మ్యాచ్‌లు ఆడిన భారత జట్టు 42 మ్యాచుల్లో విజయం సాధించింది. అంటే విజయాల శాతం 76. టీమ్ఇండియా కెప్టెన్లుగా గొప్ప పేరున్న సౌరభ్ గంగూలీ (51.70), ఎం.ఎస్.ధోని (55) కంటే హిట్ మ్యాన్ ఎక్కువ శాతం మ్యాచ్‌లు గెలిపించాడు. కపిల్‌దేవ్ (52.70) అజహరుద్దీన్ (51.72), రాహుల్ ద్రవిడ్ (53.16), విరాట్ కోహ్లి (68.42) కంటే కూడా రోహిత్ పర్సంటేజీనే అధికం. ఫామ్.. ఫిట్‌నెస్.. అయితే అదంతా గతం. వ్యక్తిగత ప్రదర్శనే ఇప్పుడు రోహిత్‌ని జట్టులో కొనసాగేలా చేస్తుంది. ఆస్ట్రేలియా టూర్‌కి టీమ్‌ను ప్రకటించినప్పుడు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ కూడా ఇదేమాట చెప్పాడు. 2027 వరల్డ్ కప్ నాటికి రోహిత్‌కి 40 సంవత్సరాలు వస్తాయి. ఆ వయసులో ఫిట్‌నెస్ కాపాడుకుంటూ.. వరల్డ్ కప్‌లో ఆడటం అంటే మామూలు విషయం కాదు. పైగా అప్పటివరకు ఫామ్ కొనసాగించాలి. ప్రస్తుతకాలంలో వన్డే మ్యాచ్‌ల సంఖ్య తగ్గిన నేపథ్యంలో హిట్ మ్యాన్‌కి ఇది కత్తిమీద సామే. అయితే కెప్టెన్‌గా విపరీతమైన ఒత్తిడిలోనూ దూకుడైన ఆటతీరుతో రోహిత్ రాణించిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఓపెనర్‌గా కేవలం 11 మ్యాచుల్లోనే 597 పరుగులు చేసి తానేంటో నిరూపించాడు. అలాంటిది కెప్టెన్సీ భారం తొలగిపోయాక.. ఇంకెంతగా బ్యాటింగ్‌లో చెలరేగిపోతాడో.. ఓ అంచనా వేయొచ్చు. కోహ్లి కూడా కెప్టెన్సీని వదిలేశాక బ్యాటింగ్‌లో వీరవిహారం చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు రోహిత్ కూడా తన సహచరుడిలా బ్యాటుతో మరింత స్వేచ్ఛగా విజృంభించే అవకాశముంది.

ఒక్కటే కష్టం అనుకుంటే..వన్డేల్లో ఒక డబుల్ సెంచరీనే కష్టం అనుకుంటున్న రోజుల్లో మూడు ద్విశతకాలు సాధించి ‘హిట్ మ్యాన్’ తానేంటో తెలియజెప్పాడు. ఈ మూడు డబుల్ సెంచరీల్లో రెండు తాను కెప్టెన్ కాకముందే చేశాడు. ఇక మూడోది కెప్టెన్ అయ్యాక ఆడిన రెండో వన్డేలోనే సాధించాడు. అంటే ఓ రకంగా రోహిత్ శర్మ కెప్టెన్సీ లేకుంటేనే మరింత ప్రమాదకారి. ఈ లెక్కన నాన్ కెప్టెన్ బ్యాటర్‌గా ఆ రోజుల్ని గుర్తుచేస్తూ ఆడితే.. ఫామ్ పెద్ద విషయమే కాదు. ఇక ఫిట్‌నెస్ సంగతంటారా? మొన్నీ మధ్యనే 10 కేజీల బరువు తగ్గి ఫిట్‌గా మారి ఆశ్చర్యపరిచాడు.

# రోహిత్ అందుకు సిద్ధంగా ఉండాలి



ముంబయి: వచ్చే వన్డే ప్రపంచ కప్ (2027)కు తాను అందు బాటులో ఉంటాడా లేదా అన్నది రోహిత్ చెప్పలేకపోతే అతడు మరింత చేదు వార్తను వినాల్సి ఉంటుందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అన్నాడు. అగార్కర్ నేతృత్వం లోని సెలక్షన్ కమిటీ.. రోహిత్‌ను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించి శుభ్‌మన్ గిల్‌కు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. 2027 ప్రపంచకప్‌నకు అందుబాటులో ఉండడంపై రోహిత్ ఇంకా తేల్చుకోలేదని జట్టును ప్రకటించాక వెల్లడైంది. ఈ నేపథ్యంలో గావస్కర్ మాట్లాడుతూ.. “రెండేళ్ల తర్వాత జరిగే ప్రపంచకప్‌నకు రోహిత్ సిద్ధంగా ఉంటాడో లేదో తెలియదు. ఇప్పుడు అతడు వన్డేల్లో మాత్రమే ఆడుతున్నాడు. ప్రస్తుతం భారత్ పెద్దగా వన్డేలు ఆడట్లేదు. ద్వైపాక్షిక సిరీస్‌ల్లో టెస్టులు, టీ20లు మాత్రమే ఉంటున్నాయి. రోహిత్ ఏడాదిలో 5-7 వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడితే ప్రపంచకప్ లాంటి పెద్ద టోర్నీకి అవసరమయ్యేంత ప్రాక్టీస్ అతడికి లభించదు. జట్టులో అతడి స్థానం నిశ్చయం కాని నేపథ్యంలో శుభ్‌మన్ గిల్‌కు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. వచ్చే రెండేళ్లు ఆడడానికి సిద్ధంగా ఉన్నది లేనిది చెప్పలేకపోతే రోహిత్ మరింత చేదు వార్త కోసం సిద్ధంగా ఉండాలి” అని చెప్పాడు. యువ కెప్టెన్ అవసరం: కెప్టెన్‌గా భారత జట్టుకు రోహిత్ ఎంతో చేశాడని, ఇప్పుడు యువ సారథి అవసరమని గాసవ్కర్ అన్నాడు. “కెప్టెన్‌గా రోహిత్ ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 ప్రపంచకప్పులను అందించాడు. కానీ గిల్‌ను వన్డే కెప్టెన్‌ను చేయాలన్న నిర్ణయాన్ని రోహిత్ కూడా అంగీకరించాడు. ఎందుకంటే వచ్చే రెండేళ్ల గురించి ఆలోచించాలంటే యువ కెప్టెన్‌ను సిద్ధం చేయడం అవసరం.

# సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని ఖండించిన హైడ్రా

*** వాస్తవాలు వెలికి తీసే పనిలో పహాడీషరీఫ్ పోలీసులు**

హైదరాబాద్, అక్టోబర్ 07 (భారత శక్తి) : భారత శక్తి తుక్కుగూడ మున్సిపాలిటీ మంఖాల్ విలేజ్‌లో వర్టెక్స్ రియల్ ఎస్టేట్ సంస్థకు చైతన్య రెడ్డికి మధ్య ఉన్న వివాదంలో తలదూర్చిన దళారులు.. దొంగలే దొంగా.. దొంగా అనేట్టు వ్యవహరిస్తున్నారు. హైడ్రా పేరు చెప్పి చైతన్య రెడ్డి నుంచి రూ. 50 లక్షలు తీసుకున్నకేసు విచారణను పహాడీషరీఫ్ పోలీసులు ముమ్మరం చేశారు. లోతైన విచారణ చేపట్టారు. ఈ కేసులో ఏ2గా ఉన్న సుంకరి నరేష్ తో పాటు.. ప్రవీణ్, చందు శ్రీనివాస్ పహాడీషరీఫ్ పోలీసుల విచారణకు సహకరించకుండా.. రకరకాల ఎత్తుగడలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో వారు వాడిన ఫోన్లను పోలీసులకు అప్పగిస్తే వాస్తవాలు బయటపడతాయి. ఫోన్లు పోయాయని ఒకరు.. పహాడీషరీఫ్ పోలీసులు విచారణకు రమ్మంటే.. రాకుండా మరొకరు కాలయాపన చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అవసరమైతే విచారణను చేపట్టాలని ఏసీబీని కూడా హైడ్రా కోరింది. ఇందుకు ఏసీబీ సమ్మతి వ్యక్తం చేయడమైందని హైడ్రా స్పష్టం చేసింది.

*** ఫేక్ సర్టిఫికేట్లతో చెలామణి..**

చదువుకు సంబంధించి ఫేక్ సర్టిఫికేట్లతో లాయర్ గా చెలామణి అవుతున్న సుంకరి నరేష్‌ను బార్ కౌన్సిల్ సస్పెండ్ చేసిన విషయం విధితమే. ఈ విషయమై స్టే తెచ్చుకున్నప్పటికీ.. సుంకరి నరేష్ సర్టిఫికేట్లు ఫేక్‌వని నిర్ధారణ అయ్యింది. ఇలా మోసం, నేర చరిత్ర ఉన్న సుంకరి నరేష్.. మన తొలివెలుగు రఘుతో కలిసి రోజుకో అవాస్తవాన్ని కట్టుకథగా అల్లి దుష్ప్రచారం చేయడాన్ని హైడ్రా ఖండిస్తోంది. సుంకరి నరేష్ వాహనంలో మనతొలి




వెలుగు రఘు వర్టెక్స్ వెంచర్ వద్దకు వెళ్లి కథనాలు ప్రసారం చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటనేది పోలీసులు వెలికితీసే పనిలో ఉన్నారు. వారి కాల్‌డేటాతో పాటు.. ఫోను సంబాషణలు, మెసేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. రూ. 50 లక్షలు సుంకరి నరేష్ కు ఇచ్చినట్టు చైతన్య రెడ్డి స్పష్టంగా చెప్పిన సాక్ష్యం హైడ్రా వద్ద ఉంది. హైడ్రాతో పని పూర్తి చేస్తాను అని సుంకరి నరేష్ తన వద్ద రూ. 50 లక్షలు తీసుకున్నట్టు ఆమే పేర్కొంది.

*** కేసు పెట్టిన తర్వాత చెక్కుల నాటకం..**

వివిధ కేసులు విచారణలో భాగంగా తనకు చైతన్య రెడ్డి రెండు చెక్కులు ఇచ్చారని.. ఇందులో ఒకటి రూ. 10 లక్షలది కాగా.. రెండోది రూ. 20 లక్షలదంటూ సుంకరి నరేష్ చెబుతున్నారు. తనపై పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్లో సెప్టెంబరు 4న కేసు నమోదవ్వగా.. ఆ చెక్కుల వ్యవహారం అదే నెల 8వ తేదీన బయట పెట్టారు. కాని ఆమె జూన్ నెలలోనే రూ. 50 లక్షలు ఇచ్చినట్టు తెలిపారు. ఈ చెక్కులపై రాసిన రాతలు, వేసిన తేదీలు ఎవరు రాశారనేది కూడా తేల్చే పనిలో పోలీసులు నిమఘ్నమయ్యారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి చేతి రాతలు ఎవరివో తేల్చనున్నారు. మొత్తమ్మీద ఈ వ్యవహారంలో ఏసీబీ రంగంలోకి దిగితే అసలు వాస్తవాలు బయటపడతాయని హైడ్రా భావిస్తోంది. ఏసీబీతో దర్యాప్తు చేయించే విషయమై హైకోర్టు కేసులో తాము కూడా ఇన్‌ప్లీడ్ అవుతామని హైడ్రా స్పష్టం చేసింది.

## సమాచార హక్కు చట్టం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**: అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి.**




ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7 (భారత శక్తి) : సమాచార హక్కు చట్టం పైన పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిర లో నిర్వహించిన సమాచార హక్కు చట్టంవారోత్సవాలలో నిర్వహించిన శిక్షణకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) సి.హెచ్ మహేందర్ జి హాజరై మాట్లాడారు. ఈ నెల 5 నుండి 12 వరకు అధికారులు సమాచార హక్కు వారోత్సవాలను జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో నిర్వహించాలని అధికారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, పి.ఐ.ఓ.లు, ఎ.పి.ఐ.ఓ.లు, ట్రైనర్ హమీద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## బైపాస్ రోడ్డు పనులను పరిశీలించిన టీజీఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 7 (భారత శక్తి) : సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డు పనులను టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పరిశీలించారు.రోడ్డు పనులు ఆలస్యం పై అసహనం వ్యక్తం చేశారు. పనుల జాప్యానికి కారణాలను హెచ్ఎండిఏ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు కరెంటు స్తంభాలు వల్ల రోడ్డు పనులు జాప్యం జరుగుతుందని అన్నారు. డిప్యూటీ ఇంజినీర్,ఎలక్ట్రిసిటీ ఫారెస్ట్ అధికారులను స్వయంగా పరిశీలనకు తీసుకెళ్లి తగు సూచనలు చేశారు. పనులు వేగంగా చేయాలని ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. బైపాస్ రోడ్డులో నాలుగు జంక్షన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ ఏఈ వెంకన్న,ఎలక్ట్రిసిటీ ఆడిఈ లక్ష్మన్, ఆర్ అండ్ బి డిఈ రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ డి ఈ రఘు, ఫారెస్ట్ అధికారులు, నియోజకవర్గ ఇంచార్జి జూలకంటిఆంజనేయులు,సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి,నాయకులు తోపాజి అనంత కిషన్,కూన సంతోష్,షఫీ, కిరణ్ గౌడ్, మహేష్, వెంకట్రాజు, ఉదయభాస్కర్,విక్రాంత్ శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ కు హైడ్రా ఘన నివాళి

హైదరాబాద్, అక్టోబర్ 7 (భారత శక్తి) : ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు కొమురం భీమ్ అని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు అన్నారు. కొమరం భీమ్ వర్ధంతి సందర్భంగా హైడ్రా కమిషనర్ శ్రీ ఏ.వి. రంగనాథ్ గారు ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

*** హైడ్రా కార్యాలయంలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి.**

అలాగే ప్రపంచానికి ధర్మం, న్యాయం, సత్యం, సేవా



మార్గాలను చాటిన శ్రీ రామాయణ మహాకావ్య రచయిత, ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా హైడ్రా కమిషనర్ శ్రీ ఏ.వి. రంగనాథ్ గారు ఆ మహనీయునికి నివాళులర్పించారు.

*** కాంగ్రెస్ కు అండగా నిలుస్తున్న ఎన్ఆర్ఐ లు: మధుయాష్కిగౌడ్**

*** న్యూ జెర్సీలో ఘనంగా మహాత్మా గాంధీ జయంతుత్సవాలు..**

*** ముఖ్య అతిథి గా హాజరైన మధుయాష్కిగౌడ్**

*** మధుయాష్కిగౌడ్ సమక్షంలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ లో పలువురు ఎన్ఆర్ఐ ల చేరిక..**

## ఎన్ఆర్ఐ లలో మోడీ పట్ల వ్యతిరేకత



ఎల్బీనగర్, అక్టోబర్ 07 (భారత శక్తి) : అమెరికాలోని న్యూ జెర్సీ చాప్టర్ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రదీప్ కొటారి, ఇన్చార్జి హర్కేష్‌ఠాకూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాలకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సదరు వేడుకలకు మధుయాష్కికి.. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. తాను అమెరికాలో నివాసం ఉన్నప్పటి స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరూ పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మధుయాష్కితో తమకున్న అనుబంధాన్ని, ఆత్మీయతను పంచుకున్నారు. న్యూ జెర్సీ చాప్టర్ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆవిర్భావం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. ఐఓసీ లో పలువురు ఎన్ఆర్ఐ లు చేరారు. ముఖ్యంగా గుజరాత్ రాష్ట్ర చెందిన పలువురు ఎన్నారైలు ఐఓసీలో చేరారు. వారికి మధుయాష్కి కండువాలు కప్పి ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ లోకి సాదరంగా ఆహ్వానించారు. అంతేకాకుండా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ లో కార్యవర్గ ప్రతినిధులకు ఈ సందర్భంగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ లో చేరేందుకు చాలా మంది ఎన్నారైలు ఎంతో ఆసక్తి చూపుతున్నారన్నారు. మోడీ ప్రభుత్వం పై ఎన్నారై ల నుంచి వ్యతిరేకత ఏర్పడిందన్నారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టిన గడ్డ అయిన గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఎన్నారైలు.. మోడీ బిజెపి ప్రభుత్వ నిజ స్వరూపం తెలుసుకుని కాంగ్రెస్ వైపు ఆకర్షితులైతున్నారన్నారు. విదేశాంగ విధానంలోనూ మోడీ ప్రభుత్వం విఫలమైందని, పబ్లిసిటీ స్టంట్ తప్ప మోడీ అమెరికాతో వాణిజ్య విధానాల లో వైఫల్యం చెందారన్నారు. అడ్డగోలు టారిఫ్ లతో భారత వ్యాపార రంగం పై ప్రభావం పడుతున్నప్పటికీ.. ట్రంప్ తన మిత్రుడే నన్న మోడీ మాత్రం నోరు మెదపటం లేదన్నారు. భిన్నత్వంలో ఏకత్వం, లౌకిక, ప్రజాస్వామ్య దేశంగా మహాత్మా గాంధీ, పటేల్ గార్లు కోరుకున్న తీరుకు విరుద్ధంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. భారత్ జోడోయాత్ర, ఓటర్ అధికార్ యాత్ర తదితర కార్యక్రమాలతో మోడీ ప్రభుత్వం చేపడుతున్న రాజ్యాంగ విలువల ధ్వంసం పై.. రాహుల్ గాంధీ గారు పోరాడుతున్న తీరు మీ అందరికీ తెలిసిందేనన్నారు. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో చేపడుతున్న పోరాటంలో ఎన్నారైల మద్దతు కాంగ్రెస్ కు ఎంతో అవసరమన్నారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ బలోపేతానికి శ్యామ్ పిట్రోడ గారు, ప్రదీప్ కొఠారి గార్ల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐఓసీ తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్ రాజేశ్వర్ గంగసాని, ఐఓసీ యూఎస్ఏ వైస్ ప్రెసిడెంట్ బాల్దేవ్ రంధ్వ, రామ్ గడుల, ఐఓసీ తెలంగాణ జనరల్ సెక్రటరీ సుధీర్ బండి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ ఎస్ ఎస్ జాతీయ అవార్డ్ గ్రహీత వంగపల్లి మణి సాయి వర్మకు అభినందనలు

రాజేంద్రనగర్, అక్టోబర్ 07 (భారత శక్తి) : జాతీయ సేవా పథకంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం నమిలగుండు పల్లె గ్రామస్థులైన వంగపల్లి మణి సాయి వర్మ విద్యార్థి వాలంటీర్ గా విశేష సేవలను గుర్తిస్తూ భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది మురుము గారి చేతుల మీదుగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్ గా అవార్డును స్వీకరించిన సందర్భంగా తెలంగాణ కుమ్మర సంఘం880/2014 రాష్ట్ర శాఖ అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు రచయిత కాలమిస్ట్ కరీంనగర్ జిల్లా స్థాయి ఎన్ ఎస్ ఎస్ విభాగం మాజీ ముఖ్య సలహాదారు నేదునూరి కనకయ్య ఒక పత్రిక ప్రకటనలో అభినందనలు వ్యక్తం చేశారు. నేడు తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ కార్యాలయంలో ఎన్ ఎస్ ఎస్ జాతీయ అవార్డ్ గ్రహీత వంగపల్లి మనిసాయి వర్మ అభినందన అత్యవసర సమావేశం టి కె ఎస్ టి ఇ ఫో అధ్యక్షులు రచయిత కాలమిస్ట్ నేదునూరి కనకయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది.



సమావేశానికి అధ్యక్షత వహించిన నేదునూరి కనకయ్య మాట్లాడుతూ మణి సాయి వర్మ ను స్పూర్తి గా తీసుకొని కుమ్మర సామాజిక వర్గం యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కుమ్మర ఆత్మ గౌరవ భవన్ ఉపాధ్యక్షులు కొల్లూరి అనిల్ కుమార్ మాట్లాడుతూ వంగపల్లి మణి సాయి వర్మ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పలు అభివృద్ధి పథకాలను ప్రజల వద్దకు చేర్చడంలో నిరంతరం కృషి చేసిన మణి సాయి వర్మ కుమ్మరి సామాజిక వర్గానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడం హర్షణీయమని అన్నారు. హై కోర్టు సీనియర్ అడ్వకేట్ తెలంగాణ కుమ్మర సంఘ. 880/2014 లీగల్ అడ్వైసర్ మాలికంటి వెంకన్న మాట్లాడుతూ వంగపల్లి సాయి వర్మ జాతీయ సేవా పథకం ద్వారా గ్రామీణ ప్రాంత యువతను సామాజిక ఆర్థిక అభివృద్ధి పథకాలలో క్రియాశీలక పాత్ర పోషించడం కుమ్మరి సమాజిక వర్గానికి గర్వకారణం అని అన్నారు. ఈ సమావేశములో తెలంగాణ కుమ్మర సంఘం సలహాదారు టీగుళ్ల యాదగిరి, ఉపాధ్యక్షులు మేధావుల విభాగం అధ్యక్షులు, ఉదోగులువిభాగం అధ్యక్షులు, కోశాధికారి, కార్యదర్శి, ధరణి ధర్, వెంకటేష్, డాక్టర్ వాసరవేణి, పరశురామ్, ఎం కుమార్, ఎన్ ప్రభాకర్, నాంపల్లి శంకర్, నాంపల్లి శ్రీనివాస్, యూత్ విభాగం అధ్యక్షులు కాకులారం కృష్ణ తదితరులు హాజరైనారు.




## జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో జిల్లా ఫిర్యాదు కమిటీ ఏర్పాటు

*** అదనపు కమిషనర్ (ఇస్టేట్స్) కె.ఏ. మంగతాయారు అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కమిటీ**

*** జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్**

హైదరాబాద్, అక్టోబర్ 7 (భారత శక్తి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో జిల్లా ఫిర్యాదు కమిటీని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఏర్పాటు చేశారు. ఈ కమిటీని నగదు సీజ్ చేయడం , రిలీజ్ చేయడం , ఎఫ్.ఎస్.టి , ఎస్.ఎస్.టి బృందాలకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ జారీనీ కమిటి చూస్తుంది. ఎన్నిక నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమాలు అమలులో ఉన్నందున ఎన్నికల కాలంలో హైదరాబాద్ జిల్లా పరిధిలో ప్రయాణం చేసే పౌరులు పరిమిత మొత్తంలో నగదు లేదా విలువైన వస్తువులు మాత్రమే తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. నగరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ (ఎఫ్. ఎస్.టి) మరియు స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్.ఎస్.టి) నిరంతరం తనిఖీలు చేపడతాయని, అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుంటాయని తెలిపారు. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగదు జప్తుకు సంబంధించి జిల్లా ఫిర్యాదుల కమిటీకి తగిన ఆధారాలు పౌరులు చూపితే సభ్యులు ఎన్నికల నిబంధనల మేరకు పరిశీలించి జప్తు చేసిన నగదును తిరిగి అందజేస్తారు.

*** జిల్లా ఫిర్యాదు కమిటీ ముగ్గురు సభ్యుల**

# ఫార్మా హబ్‌గా హైదరాబాద్.. రూ.9 వేల కోట్ల పెట్టుబడిని ప్రకటించిన దిగ్గజ సంస్థ

హైదరాబాద్, అక్టోబర్ 07 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి వచ్చి చేరింది. ప్రపంచ ప్రఖ్యాత ఫార్మా సంస్థ 'ఎలీ లిల్లీ అండ్ కంపెనీ' సుమారు రూ.9,000 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ఇండియాలోనే తమ మొట్టమొదటి మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయనుంది. సోమవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎలీ లిల్లీ ప్రతినిధి బృందం సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందని, ఎలీ లిల్లీ వంటి దిగ్గజ సంస్థ ముందుకు రావడం సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రంపై నమ్మకం ఉంచినందుకు కంపెనీకి ధన్యవాదాలు తెలిపిన ఆయన, కొత్త పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఈ మాన్యుఫ్యాక్చరింగ్ క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమని ఎలీ లిల్లీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్ తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఔషధాల తయారీ, సరఫరా సామర్థ్యాన్ని పెంచేందుకు భారీగా పెట్టుబడులు పెడుతున్నాం. హైదరాబాద్ హబ్ నుంచి దేశంలోని మా కాంట్రాక్ట్ తయారీ నెట్‌వర్క్‌ను పర్యవేక్షిస్తాం" అని ఆయన వివరించారు. ఈ కొత్త కేంద్రం ద్వారా తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఫార్మా రంగ నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని, త్వరలోనే ఇంజినీర్లు, సైంటిస్టులు, ఇతర నిపుణుల నియామకాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఎలీ లిల్లీ విస్తరణ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమని అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ ముందుండటం వల్లే ఇలాంటి ప్రపంచస్థాయి సంస్థలు ఆకర్షితులవుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ ఫార్మా రంగానికి మొదటి నుంచి కేంద్రంగా ఉందని, దేశంలోని బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎలీ లిల్లీ సంస్థకు ఇప్పటికే గురుగ్రామ్, బెంగళూరు నగరాల్లో కార్యకలాపాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టులోనే హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను కూడా ప్రారంభించింది. ఆ సమయంలో మంత్రి శ్రీధర్ బాబు జరిపిన చర్చలు, తాజాగా సీఎం రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశం ఫలించడంతో ఈ భారీ పెట్టుబడికి మార్గం సుగమమైంది.

## డ్రైవింగ్‌లో ఫోన్ వాడుతున్నారా? ...
# సీపీ సజ్జనార్ సీరియస్ వార్నింగ్!

హైదరాబాద్, అక్టోబర్ 07 (భారత శక్తి) : వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్‌లో వీడియోలు చూడటం, చెవిలో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని కబుర్లలో మునిగిపోవడం వంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు ఇకపై చెక్ పెట్టాలని హైదరాబాద్ పోలీసులు నిర్ణయించారు. ఇలాంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్రంగా హెచ్చరించారు. డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్ వాడటం కేవలం ప్రమాదకరమే కాదని, చట్టప్రకారం శిక్షార్హమైన నేరమని ఆయన స్పష్టం చేశారు. ప్రధానంగా ఆటో రిక్షా, క్యాబ్, బైక్ ట్యాక్సీ డ్రైవర్లలో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో ఫోన్ వాడటం వల్ల వారి ఏకాగ్రత పూర్తిగా దెబ్బతింటుందని, రోడ్డుపై దృష్టి నిలపలేరని తెలిపారు. ఇది డ్రైవర్లకే కాకుండా వాహనంలోని ప్రయాణికులకు, రోడ్డుపై వెళ్లే పాదచారులకు కూడా ప్రాణాంతకంగా పరిణమించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్‌ను ఉపేక్షించేది లేదని, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని సజ్జనార్ స్పష్టం చేశారు. డ్రైవర్, ప్రయాణికులతో పాటు రోడ్డుపై వెళ్లే ప్రతి ఒక్కరి భద్రతే తమకు అత్యంత ముఖ్యమని తెలిపారు. క్షణం పాటు పరధ్యానం ప్రాణాలకే ముప్పు తెస్తుందని గుర్తుంచుకోవాలని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా సూచించారు. చిన్న చిన్న అవసరాల కోసం విలువైన ప్రాణాలను పణంగా పెట్టవద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ టీడీపీ నేతలతో చంద్రబాబు కీలక భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 07 (భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఈ రోజు సాయంత్రం తెలంగాణ టీడీపీ నేతలతో సమావేశం కానున్నారు. వచ్చే నెలలో హైదరాబాద్ నగర పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలపై చర్చించడానికి ఆయన నేతలతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ రోజు సాయంత్రం 7 గంటలకు ఉండవల్లిలోని తన నివాసంలో చంద్రబాబు నేతలతో సమావేశం కానున్నారు. ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మద్దతునిచ్చి, వారి గెలుపు కోసం కృషి చేయాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నేతలకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. తన సొంతూరు నారావారిపల్లెలో ఉన్న చంద్రబాబు సాయంత్రం ఉండవల్లికి రానున్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం నిన్న విడుదల చేసింది. నవంబర్ 11వ తేదీన పోలింగ్, 14న ఫలితాలు వెలువడనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అనివార్యమైంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 21వ తేదీ వరకు నామినేషన్ దాఖలుకు గడువు, 22న నామినేషన్ల పరిశీలన, 24 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుంది.

# హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ నెమ్మదించడానికి అసలు కారణాలివే : హైడ్రా కమిషనర్

హైదరాబాద్, అక్టోబర్ 07 (భారత శక్తి) : గత కొంతకాలంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్దతకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలోని హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) తీసుకుంటున్న చర్యలే కారణమంటూ వస్తున్న ఆరోపణలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఈ ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. మార్కెట్ నెమ్మదించడానికి అసలు కారణాలు వేరే ఉన్నాయని, కేవలం తమపై నిందలు మోపడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో డిమాండ్‌కు మించి సప్లై ఉందని రంగనాథ్ వివరించారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్టులు, ఫ్లాట్లు భారీ సంఖ్యలో పేరుకుపోయాయని (అన్‌సోల్డ్ ఇన్వెంటరీ), ఇది మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. దీనికి తోడు, అమెరికా వంటి విదేశాల నుంచి వచ్చే ఎన్నారై పెట్టుబడులు, రెమిటెన్స్‌లు గణనీయంగా తగ్గిపోయాయని ఆయన పేర్కొన్నారు. పెరుగుతున్న వడ్డీ రేట్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కారణంగా ఉద్యోగాలు పోతాయనే భయాలు కూడా కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయని విశ్లేషించారు. "ప్రతిదానికీ హైడ్రాను బాధ్యుల్ని చేయడం ఒక బ్లేమ్ గేమ్‌లా మారింది. మా కార్యకలాపాలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం. మరి ఖమ్మం, వరంగల్ వంటి నగరాల్లో కూడా రియల్ ఎస్టేట్ ఎందుకు నెమ్మదించింది? ఈ అంశాన్ని కూడా గమనించాలి కదా?" అని రంగనాథ్ ప్రశ్నించారు. అసలు రియల్ ఎస్టేట్ అంటే చదరపు అడుగుకు రూ.10,000, రూ.15,000 ధరలు పెరగడం కాదని, సామాన్యుడికి, మధ్యతరగతి వారికి సొంతింటి కలను అందుబాటులోకి తీసుకురావడమే నిజమైన అభివృద్ధని ఆయన అభిప్రాయపడ్డారు. అందరికీ ఇళ్లు అందుబాటులోకి వచ్చినప్పుడే అది నిజమైన రియల్ ఎస్టేట్ అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమృత-ప్రణయ్ ప్రేమ పెళ్లికి సంబంధించి ప్రణయ్ హత్య కేసు దర్యాప్తు సమయంలో కూడా సోషల్ మీడియాలో తనపై ఇలాగే ఎన్నో ఆరోపణలు వచ్చాయని, అయినా వృత్తిధర్మాన్ని విడిచిపెట్టలేదని రంగనాథ్ గుర్తుచేశారు. బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గకుండా లక్ష్యంపైనే దృష్టి పెడితే వాస్తవాలు వాటంతట అవే బయటకు వస్తాయని ఆయన అన్నారు.

# ఆర్ఆర్ బీ ఉద్యోగాల జాతర..
## రైల్వే జాబ్ సాధించేందుకు సరైన సమయం ఇదే!

ఢిల్లీ, అక్టోబర్ 07 (భారత శక్తి) :రైల్వేలో ఉద్యోగం సాధించాలని ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డ్ (ఆర్ఆర్ బీ) శుభవార్త చెప్పింది. దేశవ్యాప్తంగా వివిధ పోస్టుల భర్తీ చేపట్టనున్నట్లు తెలిపింది. గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మొత్తం 8,050 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్ లో పేర్కొంది. ఇందులో 5 వేల గ్రాడ్యుయేట్ పోస్టులు కాగా మిగతావి అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు. గ్రాడ్యుయేట్ పోస్టులకు అక్టోబర్ 21 నుంచి, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు అక్టోబర్ 28 ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. జోన్లు, విభాగాల వారీగా ఖాళీల వివరాలను త్వరలో విడుదల చేయనున్న వివరణాత్మక నోటిఫికేషన్ లో వెల్లడిస్తామని తెలిపింది.

**ఏయే రీజియన్లంటే..**

సికింద్రాబాద్, చెన్నై, ముంబై, గువాహటి, గోరఖ్‌పుర్, అహ్మదాబాద్, అజ్‌మేర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, జమ్మూశ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సిలిగురి, తిరువనంతపురం.

**భర్తీ చేయనున్న పోస్టులు ఇవే..**

గూడ్స్ రైలు మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్‌కమ్‌టైపిస్ట్, స్టేషన్ మాస్టర్, సీనియర్ క్లర్క్‌కమ్‌టైపిస్ట్, చీఫ్ కమర్షియల్‌కమ్‌టికెట్ సూపర్‌వైజర్, ట్రాఫిక్ అసిస్టెంట్, అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కమర్షియల్‌కమ్‌టికెట్ క్లర్క్, అకౌంట్స్ క్లర్క్‌కమ్‌టైపిస్ట్, జూనియర్ క్లర్క్ కమ్‌టైపిస్ట్, రైళ్ల క్లర్క్

**అర్హతలు..**

గ్రాడ్యుయేట్ పోస్టులకు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత, అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత తప్పనిసరి

వయోపరిమితి..

18 నుంచి 33 సంవత్సరాలు (గ్రాడ్యుయేట్ పోస్టులు)

18 నుంచి 38 సంవత్సరాలు (అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులు)

**ముఖ్యమైన తేదీలు..**


గ్రాడ్యుయేట్ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభ తేదీ అక్టోబర్ 21, చివరి తేదీ 2025 నవంబరు 20.

అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు ప్రారంభ తేదీ అక్టోబర్ 28, చివరి తేదీ 2025 నవంబర్ 27.

# ఆన్‌లైన్‌లో నా డీప్ ఫేక్ వీడియోలు కూడా చూశాను

ఢిల్లీ, అక్టోబర్ 07 (భారత శక్తి) : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ డీప్‌ఫేక్ టెక్నాలజీ ప్రమాదంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో తన ముఖంతోనే సృష్టించిన పలు డీప్‌ఫేక్ వీడియోలు ప్రచారంలో ఉన్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టించి, వాస్తవాలను వక్రీకరించేందుకే వీటిని రూపొందిస్తున్నారని ఆమె అన్నారు. ముంబైలో మంగళవారం జరిగిన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025' కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీ పెరిగేకొద్దీ ఆర్థిక మోసాల స్వరూపం కూడా పూర్తిగా మారిపోయిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇదివరకటిలా ఫైర్‌వాల్స్‌ను బద్దలు కొట్టడం కాదని, ఇప్పుడు నేరుగా ప్రజల నమ్మకాన్నే హ్యాక్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి నేరగాళ్లు గొంతులను అనుకరిస్తున్నారు, వ్యక్తుల గుర్తింపును క్లోన్ చేసి అచ్చం నిజమైన వీడియోల లాంటివి సృష్టిస్తున్నారు. వీటి ద్వారా ప్రజలను సులభంగా మోసం చేస్తున్నారు" అని ఆమె వివరించారు. ఇలాంటి మోసాల నుంచి పెట్టుబడిదారులను కాపాడేందుకు సెబీ, ఎన్‌పీసీఐ కీలక చర్యలు చేపట్టాయని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా సెబీలో రిజిస్టర్ అయిన బ్రోకర్ల కోసం '.brk', మ్యూచువల్ ఫండ్ సంస్థల కోసం '.mf' అనే ప్రత్యేకమైన యూపీఐ హ్యాండిల్స్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇప్పటికే 90 శాతానికి పైగా బ్రోకర్లు, అన్ని మ్యూచువల్ ఫండ్స్ ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయని చెప్పారు. అంతేకాకుండా, 'సెబీ చెక్' అనే కొత్త ఫీచర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీని ద్వారా పెట్టుబడిదారులు డబ్బు పంపే ముందే బ్రోకర్లు లేదా సంస్థల యూపీఐ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలను (అకౌంట్ నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్) వెరిఫై చేసుకోవచ్చని సూచించారు. ఈ సదుపాయం వెబ్ పోర్టల్, సారథి యాప్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫిన్‌టెక్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని, ఆధార్, యూపీఐ, డిజిలాకర్ వంటివి ఆర్థిక కార్యకలాపాల స్వరూపాన్నే మార్చేశాయని అన్నారు. 1.3 బిలియన్ డాలర్లతో 'ఇండియా ఏఐ మిషన్' ప్రారంభించి భారత్ గ్లోబల్ ఏఐ రంగంలోకి దూసుకెళ్లిందని ఆమె గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఉత్పత్తులు, సేవలకు భారత్ ఒక గ్లోబల్ హబ్‌గా మారే సత్తా ఉందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. "బాధ్యతాయుతమైన నియంత్రణ అనేది పురోగతికి అడ్డుకట్ట కాదు, అది సురక్షితమైన ప్రయాణానికి సీట్ బెల్ట్ లాంటిది" అని ఆమె వ్యాఖ్యానించారు.

# భౌతికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్...



నోయిడా, అక్టోబర్ 07 : భౌతికశాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి 2025ని ప్రకటించారు. ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డును ముగ్గురు అమెరికన్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్. డివోరెట్, జాన్ ఎం. మార్టినిస్‌లను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. అణువుల స్థాయిలో మాత్రమే సాధ్యమనుకున్న క్వాంటం భౌతికశాస్త్ర సూత్రాలను, కంటికి కనిపించేంత పెద్ద ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో విజయవంతంగా ప్రదర్శించినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. క్వాంటం మెకానిక్స్ ప్రకారం, ఒక కణం తనకు అడ్డుగా ఉన్న గోడను సైతం దాటుకుని వెళ్ళగలదు. దీనినే 'టన్నెలింగ్' అంటారు. అయితే ఇలాంటి వింత ప్రవర్తనలు కేవలం సూక్ష్మ ప్రపంచానికే పరిమితమని ఇప్పటివరకు భావించేవారు. కానీ, ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు 198485 మధ్యలో చేసిన ప్రయోగాలతో ఈ అభిప్రాయాన్ని మార్చేశారు. వారు సూపర్ కండక్టర్లతో, మధ్యలో ఒక విద్యుత్ నిరోధక పొర (జోసెఫ్‌సన్ జంక్షన్) ఉండేలా ఒక ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ సర్క్యూట్‌ను రూపొందించారు. ఈ సర్క్యూట్‌లో విద్యుత్‌ను ప్రవహింపజేసినప్పుడు, అందులోని కణాలన్నీ కలిసి ఒకే 'స్థూల కణం'గా ప్రవర్తించడాన్ని వారు గమనించారు. ఈ స్థూల కణం, ఎలాంటి అడ్డంకి లేకపోయినా క్వాంటం టన్నెలింగ్ ద్వారా సున్నా వోల్టేజ్ స్థితి నుంచి బయటపడటాన్ని వారు నిరూపించారు. అలాగే, ఈ వ్యవస్థ నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే శక్తిని గ్రహించడం లేదా విడుదల చేయడాన్ని (ఎనర్జీ క్వాంటైజేషన్) కూడా ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ ఆవిష్కరణపై నోబెల్ కమిటీ ఛైర్ ఓల్ ఎరిక్సన్ స్పందిస్తూ, "శతాబ్దాల నాటి క్వాంటం మెకానిక్స్ నిరంతరం కొత్త ఆశ్చర్యాలను అందిస్తుండటం అద్భుతంగా ఉంది. అన్ని డిజిటల్ టెక్నాలజీలకు క్వాంటం మెకానిక్సే పునాది కాబట్టి ఇది ఎంతో ఉపయోగకరం" అని తెలిపారు. ఈ పరిశోధనలు క్వాంటం కంప్యూటర్లు, క్వాంటం సెన్సార్లు, క్వాంటం క్రిప్టోగ్రఫీ వంటి భవిష్యత్ టెక్నాలజీల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తాయని శాస్త్ర ప్రపంచం భావిస్తోంది.

# జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల కోసం ఎంసిఎంసి కమిటీ ఏర్పాటు




హైదరాబాద్, అక్టోబర్ 07 (భారత శక్తి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) ఏర్పాటు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఏర్పడిన ఈ కమిటీ, ఎన్నికల సమయంలో ప్రచార మాధ్యమాల్లో ప్రచురితమయ్యే వార్తలు, ప్రకటనలు, చెల్లింపు వార్తలపై పర్యవేక్షణ చేయనుంది. జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ ఈ కమిటీకి చైర్మన్ గా, జిహెచ్ఎంసి ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం మెంబర్ సెక్రటరీగా వ్యవహరించనున్నారు. సికింద్రాబాద్ ఆర్డిఓ, జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.సాయి రామ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజనీర్ (ఐటి వింగ్ - సోషల్ మీడియా) నర్సింగ్‌రావు, హైదరాబాద్ పిఐబి డిప్యూటీ డైరెక్టర్ మనసా కృష్ణ కాంత్ , ఇండియన్ ఎక్స్‌ప్రెస్ డైలీ ప్రిన్సిపల్ కరస్పాండెంట్ బచంజీత్ సింగ్ లు కమిటీలో సభ్యులు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, మీడియా సమన్వయం కోసం ఈ కమిటీ కీలక పాత్ర పోషించనుంది.

# అవినీతిని తమ ఇంటిపేరుగా మార్చుకుంటున్న అధికారులు

**వినడానికి, చెప్పుకోవడానికి కొన్ని అధికారుల పేర్లు, హోదాలు ఇన్స్పిరేషన్ గా ఉంటాయి.. కానీ వాళ్ళు చేసే పనులు మాత్రమే చాలా ఛండాలంగా ఉంటాయి.. ఎం.ఏ. అండ్. యు.డి, డి.టి.సి.పి మున్సిపల్ శాఖ కమిషనర్ టి. శ్రీదేవి ఐఏఎస్ , బిల్ నౌ ఇన్ఛార్జ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జరుగుతున్న మున్సిపల్ కమిషనర్ల అవినీతిపై దృష్టి సారించ లేకపోతున్నారా..? లేక ఎందుకులే అని మిన్నకుండిపోతున్నారా..? అసలు ఇందులోని అంతర్యం ఏమిటో మరి..! అవినీతి మున్సిపల్ కమిషనర్లను ట్రాన్స్ఫర్లు చేయడం కాదు విధుల నుంచి తొలగించి క్రిమినల్ కేసులు పెట్టరెందుకు...? దీనికి కూడా సమాధానం లేదు..**

**హైదరాబాద్, అక్టోబర్ 07 (భారత శక్తి) :** డి.పి.ఎం.ఎస్ బాగుండే...టీఎస్ బి పాస్ పోయింది టీజీబిపాస్ వచ్చింది, టీజీబిపాస్ పోయింది బిల్డ్ నౌ వచ్చింది.. ఏది వస్తే మాకేంటి..? ఉయ్ డోంట్ కేర్.. మా అవినీతికి ఎదురే లేదు అంటున్నారు అవినీతి అధికారులు.. వీటికి సంబంధించి ప్రభుత్వ వెబ్సైట్లో పారదర్శకత లేకపోవడం.. ఉన్నత స్థాయి అవినీతి అధికారులు కావాలనే పారదర్శకత లేకుండా చేసి, అవినీతికి పాల్పడుతున్న అధికారులను కంట్రోల్ లోకి తీసుకొని, వారి అవినీతిలో కొంత అవినీతి సొమ్మును తీసుకొని పారదర్శకత లేకుండా ఉన్నతస్థాయి ప్రిన్సిపల్ సెక్రెటరీ, మున్సిపల్ శాఖ మంత్రి సీఎం రేవంత్ రెడ్డికి తప్పుడు సలహాలు ఇచ్చి ఇటు ప్రభుత్వాన్ని అటు ప్రజలను మోసం చేస్తున్నారు అనడానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయి..

బిల్డ్ నౌ లో పారదర్శకత జీరో.. టౌన్ ప్లానింగ్ అధికారి ఏమి చేసినా చెల్లుతుంది, ఎంత అడిగినా ఇవ్వవలసిందే అడిగి నాథుడే లేడు.. తప్పులు కనబడే పరిస్థితి లేదు.. ఈ విషయంపై బిల్ నౌ టీం అధిపతి దేవేందర్ రెడ్డి సమాధానం చెప్పాలి.. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి... బంగారు తెలంగాణలో జవాబుదారీతనం లేకపోవడం, పారదర్శకత లేకపోవడం అవినీతికి అద్దం పడుతుందనే విషయాన్ని పాలకులు మర్చిపోవద్దని రాజకీయ నిపుణులు తమ నిస్పృహను వెళ్లబుచ్చుతున్నారు..

ఇలాంటి మోనోపాలి పరిపాలన జరిపిన గత సీఎం కేసీఆర్ ప్రజా క్షేత్రంలో ఓటమిపాలైన పరిస్థితులు రేపు మీకు ఎదురవుతావునే విషయాన్ని మర్చిపోవద్దు... ప్రతి ప్రభుత్వం ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ముఖ్య భూమిక పోషించే మున్సిపల్ శాఖ పలు పలు ప్రాంతాలలో మున్సిపాలిటీలుగా గ్రామపంచాయతీలుగా విభజించబడి, పరిపాలనకు అనుగుణంగా మున్సిపల్ శాఖ ద్వారా నియమించబడిన మున్సిపల్ అధికారులు పలు మున్సిపాలిటీలకు సంబంధించిన ఉన్నత స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు అవినీతే పరమావధిగా జీవనాన్ని సాగిస్తున్నారు అనడానికి ఈ వార్త కథనం నిదర్శనం...




మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పలు పలు ప్రాంతాలలో వీరికి నియంత్రించబడ్డ ప్రాంతానికి వీరు జవాబుదారీగా ఉన్న స్థాయి అధికారి.. వీరికి ప్రభుత్వం కల్పించిన అధికారాలు ఉన్నతమైనవిగా చెప్పుకుంటే ఆ ప్రాంతానికి ప్రత్యేక అధికారులు ఈ మున్సిపల్ కమిషనర్ కు ఉంటాయి.. గృహ నిర్మాణానికి అనుమతులు పొందాలంటే మొదట టౌన్ ప్లానింగ్ అధికారి, తదుపరి మున్సిపల్ కమిషనర్ అప్రూవ్ చేయడంతో నిర్మాణ అనుమతులు జారీ అవుతాయి.. నిర్మాణ అనుమతులు ఇచ్చే అధికారం తిరస్కరించే అధికారం వీరికి ఉంటుంది... ఇదే అదునుగా చిన్నచిన్న తప్పులు ఉంటే భారీ ఎత్తున లంచాలు డిమాండ్ చేసి, లక్షల కోట్లు మూట కట్టారు అనడానికి ఎన్నో నిదర్శనాలున్నాయి..

ఇదే విధంగా నిర్మాణం పూర్తయిన తర్వాత బిల్డింగ్ ప్రాపర్టీ టాక్స్ వేసే అధికారం మున్సిపల్ కమిషనర్ ఉంటుంది మున్సిపల్ కమిషనర్ అధికారి అధీనంలో ఆర్వో ఏఎంసి పన్ను విధించే అధికారులు వారి కింద రెవెన్యూ అధికారులు, హెల్పర్లు ఇతరత్రా కింది స్థాయి అధికారులు ఉంటారు .. వీరిని నియంత్రించే అధికారం, ప్రోత్సహించే అధికారం మున్సిపల్ కమిషనర్ గా ఉంటుంది.. ఈ విభాగంలో కూడా భారీ ఎత్తున ముడుపులు తీసుకొని మున్సిపల్ కమిషనర్లు కోట్లకు పడగలెత్తారు.. అనడానికి ఎన్నెన్నో నిదర్శనాలున్నాయి.. ఏసీబీకి చిక్కిన అధికారులే సాక్ష్యం.. ఇదే కాకుండా రోడ్లు, ఇతరత్రా చెత్త నిర్వహణ, పారిశుధ్యం ఫేవరెట్ విధుల నిర్వహణ.. వీటిలో కూడా నాసిరకం పనులతో భారీ అవినీతి జరుగుతోంది.. హరితహారంలో కూడా కక్కుర్తి. ఈ అవినీతి అధికారులపై క్షేత్రస్థాయిలో ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించలేకపోవడం, ఉన్నత స్థాయి అధికారుల వైఫల్యం, లేకపోతే అవినీతికి దాసోహమా..? ప్రభుత్వాలపై ప్రజలు తిరగబడే రోజులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉన్నత స్థాయి అధికారులదే అని నొక్కివక్కాణించి చెబుతున్నారు రాజకీయ నిపుణులు..

**మున్సిపల్ కమిషనర్ల అవినీతి: స్వభావం :**

మునిసిపల్ కమిషనర్లు లేదా సంబంధిత







అధికారులు అంటే డిప్యూటీ కమిషనర్లు, డిపార్ట్మెంటల్ అధికారి మొదలైన అవినీతికి పాల్పడుతున్నారు.. బడ్జెట్, ప్రాజెక్ట్ అనుమతుల, కాంట్రాక్టుల ఒప్పందాల నిఘా లేకుండా చేపట్టడం జరుగుతోంది.. అక్రమంగా భూమి అనుమతులు, నిర్మాణ అనుమతులు ఇవ్వడం చేస్తున్నారు.. ఇక లైసెన్సులు, వ్యాపార అనుమతులు కోసం తీసుకొనే రుసుములు, చెల్లింపులు.. జల సరఫరా, పారిశుద్ధ్య, చెత్త నిర్వహణలో అక్రమ విధులు.. ఇతర వస్తువులు, సరఫరా ఒప్పందాల్లో అదనపు ముడి ధరకే ఒప్పందాలు చేసుకోవడం జరుగుతోంది.. పెనాల్టీలు లేవనిచ్చడం, చెకింగ్ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉంచడం జరుగుతోంది.. ఈ విధంగా మునిసిపల్ కమిషనర్ల అవినీతి జరుగుతుంది.

*** ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు ఏమి చేస్తున్నాయి..?**

భారత కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక పాలక సంఘాలు పలు చర్యలు చేపడుతున్నారు..

**తీసుకుంటున్న చర్యలు :**

అవినీతిపై నిఘా ఉంచడానికి చట్ట సవరింపులు, అధికారులు అధిక బాధ్యత నిర్వహణ చేయడం.. ఉదాహరణకు, మండల అధికారులకు, ఐఏఎస్ అధికారులకు మాత్రమే పెద్ద మున్సిపల్ కమిషనర్ పదవులు ఇవ్వాలని రాష్ట్రం నిర్ణయించడం

ఇక రాష్ట్ర స్థాయి ఏసీబీ / విగిలెన్స్ శాఖల బలపరిచుట.. రాష్ట్ర లేదా నగర స్థాయిలో ఏసీబీ లేదా విచారణ విభాగాలు..

ఉదాహరణ : థానే మునిసిపల్ కమిషనర్ సహాయకుడు బ్రైబ్ కేస్‌లో అరెస్ట్ అయింది..

సెంట్రల్ ఏజెన్సీలు అంటే సీబీఐ, ఈడీలు.. భారీ అక్రమాల, మనీ లాండరింగ్, ఆస్తి విచారణలు చేపడతాయి.. పారదర్శకత, డిజిటైజేషన్ అండ్ ఆన్‌లైన్ సిస్టమ్స్.. అనుమతులు, లైసెన్స్, ఫీజు చెల్లింపులు వంటి ప్రక్రియలను ఆన్‌లైన్‌లో నిర్వహించడం ద్వారా ప్రత్యక్షంగా మధ్యవర్తి తొలగింపు.. ప్రభుత్వాలు డిజిటల్ పోర్టల్స్, ఈగవర్నెన్స్ ప్రాజెక్టులు ప్రచారం చేస్తున్నాయి

**ఇక ఫిర్యాదుల యంత్రాంగం :**

అవినీతిపై ఫిర్యాదులను ప్రోత్సహించేందుకు సురక్షిత మార్గాలు వున్నాయి.. విషిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ యాక్ట్ : 2011 ద్వారా ఫిర్యాదిదారులకు రక్షణ కల్పించే చట్టం ఉంది

*** న్యాయవాదులు / న్యాయపరిశీలనలు / హై కోర్టు ఆదేశాలు :**

న్యాయసహాయం, ప్రమాణపత్రాల సమీక్ష, విచారణ ఆదేశాలు తదితరాలు.. ఉదాహరణకు ఉత్తరాఖండ్‌లో హరిద్వార్ భూమి స్కాంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారులను గుర్తించి విచారణ కోసం ఆదేశం ఇచ్చారు..

**అడిట్ అండ్ ఆడిట్ నివేదికలు :**

ఆర్థిక లెక్కలు, ఖర్చు విశ్లేషణలు, గణాంకాల సమీక్షల ద్వారా కేంద్ర, రాష్ట్ర, నగర స్థాయి ఆడిట్ సంస్థలు పనిచేస్తాయి..

ప్రజా పర్యవేక్షణ, ఆరోపణలు,న్యాయపూర్వక పిటిషన్లు, ప్రజా పోరాటాలు, మీడియా మ్యాప్,స్థానిక సంస్థలు, ఎన్ .జీ.ఓ.లు, మీడియాలు అవినీతిపై తమవంతు పోరాటం చేస్తున్నాయి..

అవినీతి పేరుకుపోవడంతో తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి..

పాలిసీ అమలులో తేడాలు.. అవినీతి కారణంగా ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలు ఆలస్యం అవుతాయి.. అంతర్గత షెడ్యూల్ పక్కదారి పడుతుంది.. ఇక పబ్లిక్ నిధులను వివిధ అక్రమ మార్గాల్లో వృథా చేయడం, సరిగా వినియోగించకపోవడం జరుగుతోంది.. అవసరమైన ప్రాంతాల్లో సేవలు లభించకపోవడం జరుగుతోంది.. నీటి సరఫరా, పారిశుద్ధ్యం ఇలా అన్ని సేవలు బలహీనమవుతాయి.

వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం తగ్గుముఖం పడుతుంది.. ప్రజలకు ప్రభుత్వంపై అవిశ్వాసం పెరగడం, ప్రజాధారణలో సమస్యలు ఏర్పడతాయి..అదేవిధంగా సమాజంలో అవినీతికి ప్రోత్సాహం లభించే ప్రమాదం ఏర్పడుతుంది.. అసమానత, అభివృద్ధిలో లోపాలు ఏర్పడతాయి.. దీంతో నిరుపేదలు.. సామాన్యులు తమకు అందవలసిన సమాన హక్కులు కోల్పోతారు.. ప్రభుత్వాన్ని, సంస్థలను న్యాయవాదులు, పిటిషన్లు ఎదుర్కోవడం, అధిక ఖర్చులు ఎదురవుతాయి..

*** తెలంగాణలో జరిగిన కొన్ని అవినీతి ఘటనలు చూద్దాం :**

హుజూర్ నగర్ లో రూ. 7.2 లక్షల నిధుల దుర్వినియోగం జరిగింది.. పట్టణ ప్రగతి పథకంలో అసలు పని చేయకుండా ఫేక్ బిల్స్ వేసి రికార్డులు మారుస్తూ, నగర కమిషనర్, ఇద్దరు ఇంజినీర్లు కలిసి నిధులను స్వాహా చేశారని ఏసీబీ కేసు నమోదు చేసింది..

ఇక ధర్మపురి మునిసిపల్ కమిషనర్ కందుల శ్రీనివాస్ ఇంజినీరింగ్ వైద భత్య కార్మికుడికి జీతం విడుదల చేయడంలో రూ. 20,000 లంచం అడిగినట్లు ఆరోపణలు వచ్చాయి.

జనగామ మునిసిపల్ కమిషనర్, జంపాల రజిత రూ. 40,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ వారు ట్రాప్ చేశారు..

పెబ్బేరు మునిసిపల్ కమిషనర్ అరెస్ట్ అవడం అప్పట్లో సంచలనం సృష్టించింది.. మునిసిపల్ కమిషనర్ కందికట్ల ఆదిశేషు రూ. 20,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు..

నార్సింగి మునిసిపల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ మణి హారిక రూ. 4 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీ దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు..

ఇక రాజేంద్ర నగర్ పరిధిలో జీ.హెచ్.ఎం.సి. డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ ఏసీబీ పరిధిలో కేసులో ఉన్నట్లు తెలుస్తోంది..

గద్దపోతారం, సంగారెడ్డి జిల్లాలో మునిసిపల్ అధికారులు అనుమతి లేకుండా కొన్ని ఇళ్ళను ధ్వంసం చేయబోతున్నారని, 13 కుటుంబాలు హైకోర్టు ముందు ప్రస్తావించారు.. దీంతో హైకోర్టు ఆ ప్రక్రియను ఆపుతూ ఆదేశాలు జారీ చేసింది..

ఇక ముఖ్యంగా బడంగ్ పేట్ మున్సిపల్ కమిషనర్ పై, అవినీతి కార్యకలాపాలపై హై కోర్టు దృష్టి పెట్టిన సంగతి విదితమే.. బడంగ్ పేట్ నగర సంస్థ విధులలో అనధికార నిర్మాణాలు, పబ్లిక్ రోడ్లను ఆక్రమించడం లాంటి ఆరోపణలపై తక్షణ చర్యల్లో పాలుపంచుకోమని ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చింది...

ఈ విధంగా అనేక కేసుల్లో ఏసీబీ వెంటనే విచారణ చేపట్టి, అరెస్టులు చేస్తోంది.. మునిసిపల్ అధికారులపై కూడా చర్యలు తీసుకుంటోంది.. .ఉదాహరణకు జంపాల రాజిత, జనగాం.. హుజూర్నగర్ కమిషనర్ కేసులను చెప్పుకోవచ్చు..

**హైకోర్టు జడ్జిమెంట్లు, ఆదేశాలు :**

హైకోర్టు మునిసిపల్ సంస్థలపై నియంత్రణ విధిస్తూ అనధికార నిర్మాణాలపై చర్యలు చేపట్టమని ఆదేశాలు ఇచ్చింది.. అలాగే గుర్తింపు లేకుండా ఇళ్ళ ధ్వంసం చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది..

**లోకాయుక్త :**

తెలంగాణలో లోకాయుక్త ప్రజల ఫిర్యాదులను స్వతహాగా విచారించగల ఒక సంస్థగా ఉంది.

ఇన్ని జరుగుతున్నా మున్సిపల్ కమిషనరు కానీ, ఇతర అధికారులు కానీ అవినీతి చేయడానికి వెనుకాడటం లేదు.. ఎందుకిలా జరుగుతోంది.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నప్పుడు కేవలం అదుపులోకి తీసుకుని, సస్పెన్షన్ విధించడం జరుగుతోంది.. దీంతో కొద్ది కాలం తరువాత తిరిగి విధుల్లో చేరడం.. అవినీతి కార్యకలాపాలు చేయడం జరుగుతోంది.. తాము పట్టుబడ్డప్పుడు, కోర్టులకు వెళ్లడం, సస్పెన్షన్ ని ఎత్తివేయించుకోవడం జరుగుతోంది.. అలా కాకుండా ఎవరైతే అవినీతిలో దొరికిపోతారో అలాంటి వారిని పూర్తిగా విధులనుంచి తొలగించి.. కఠిన శిక్షలు అమలు చేస్తే మరొకరు అవినీతి చేయడానికి జంకుతారని ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని డిమాండ్ చేస్తోంది " ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..




## బస్సు చార్జీల పెంపు క్షమించరానిది : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 07 (భారత శక్తి): తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ప్రయాణికులకు షాకింగ్ న్యూస్ ఇచ్చింది.మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన విషయం తెలిసిందే. ఇప్పుడు సామాన్యులపై భారం వేసేందుకు రెడీ అయింది.హైదరాబాద్‌లో ఆర్టీసీ సిటీ బస్సుల టికెట్ ధరలు భారీగా పెంచేసింది. ఇప్పటికే బస్ పాస్, టి 24 టికెట్ ధరలను పెంచిన ప్రభుత్వం, తాజాగా నగరంలో టికెట్ ధరలను కూడా పెంచింది.మొదటి 3 స్టేజీలకు రూ.5, ఆ తర్వాత నుంచి రూ.10కి పెంచారు. దీనిపై బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్,ముఠా గోపాల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.దానిలో భాగంగా మంగళవారం వారు గాంధీ భవన్ నుంచి అసెంబ్లీ వరకు బస్సులో ప్రయాణించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ప్రయాణికులతో మాట్లాడడం జరిగింది.సిటీ బస్సు చార్జీలను ఒకటి కాదు రెండు కాదు.ఏకంగా ఒకేసారి 10 రూపాయలు పెంచి జంట నగరంలోని పేద,




మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని చూస్తున్న రేవంత్ రెడ్డి నిర్ణయాలు దుర్మార్గమైనవి. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో అల్లాడుతున్న తరుణంలో ప్రతి ప్రయాణికుడిపై నెలకు 500 రూపాయల అదనపు భారం మోపితే బడుగుజీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలి. ఇప్పటికే విద్యార్థుల బస్ చార్జీలు,టీ24 టిక్కెట్ చార్జీలను పెంచింది చాలదన్నట్టు ఇప్పుడు కనీస చార్జీపై కనికరం లేకుండా 50 శాతం టిక్కెట్టు ధరలను పెంచడం రేవంత్ అసమర్థ విధానాలకు, పాలనకు నిదర్శనం.రాజధాని వాసుల నడ్డి విరిచి ప్రతినిత్యం దాదాపు కోటి రూపాయల భారం మోపాలని చూస్తున్న ముఖ్యమంత్రి హైదరాబాద్ ప్రజలపై కక్ష పెంచుకున్నట్లు అర్థమవుతోంది. తుస్సుమన్న ఫ్రీ బస్సు పథకంతో దివాళా తీసిన ఆర్టీసిని గట్టెక్కించాల్సింది పోయి,సామాన్య ప్రయాణికుల నడ్డి విరచాలని చూడటం క్షమించరానిదని వారు అన్నారు.

## హై కోర్టులో జరుగబోయే విచారణలో ఇంప్లీడ్ అవుతున్నాం..

- **తెలంగాణ రిపబ్లికన్ పార్టీ సెక్రటరీ చెన్నోజు శ్రీనివాసులు వెల్లడి..**
- **జీ.ఓ. నెంబర్ 9 ని సవాల్ చేస్తూ పునః సమీక్షించాలని డిమాండ్..**

హైదరాబాద్, అక్టోబర్ 07 (భారత శక్తి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీఓ నెంబర్ 9 ని విడుదల చేసిన సంగతి విదితమే.. అయితే ఈ జీఓ ను సవాల్ చేస్తూ నేడు హైకోర్టులో జరగబోయే విచారణలో తెలంగాణ రిపబ్లికన్ పార్టీ (టీఆర్పీ) సెక్రటరీ చెన్నోజు శ్రీనివాసులు ఇంప్లీడ్ అయినట్టు ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ సూత్రాలకు, రాజ్యాంగానికి భిన్నంగా


TELANGANA REPUBLICAN PARTY
తెలంగాణ రిపబ్లికన్ పార్టీ
Yadishwar Nakka
Founder President
Date: 06-010-2025.
Hyderabad
"RESOLUTION"
That the party held executing meeting on 06.10.2025 at Hyderabad. The president, Yadishwar Nakka presided over the meeting. Many matters were discussed in the meeting pertaining to ensure the welfare, empowerment, and full participation of Schedule Classes, Schedule Tribes and Backward Classes, and to uphold the Constitution vision of equality, social justice, and inclusive growth, hereby order to provide 42% reservation of the seats and positions in local Bodies to Backward Classes in the State of Telangana, as well as ensure reservation of SCs and STs proportionate of their population in local bodies. And this relevant matter is pending before the Hon'ble High Court for the state of Telangana. In this junction it is resolved that approach court of law to fight legally for justice in the interest of these marginalized communities of the telangana society. On behalf of Telangana Republican Party-TRP to represent the matter in the court of law Sri Chennoju Srinivasulu is authorized to file the said case and deal this matter in the interest of justice.
1. Yadishwar.N President
2. Kinnera Yadamma Vice-President
3. Mekala Shivaji General Secretary

లోపభూయిష్టంగా ఉన్న ఈ జీఓను పునః పరిశీలన చేసి, సమీక్షించాలని ఆయన కోరారు.. ఇదే విషయాన్ని తాను నేడు జరగబోయే విచారణలో బలంగా తమ వాదనలు వినిపిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నోజుతో బాటు నందిగామ వెంకటేష్, ఆగల్ డ్యూటీ సాయికుమార్, సూర్య వంశీలు పాల్గొన్నారు..

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.